# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పత్రిక

సంపుటి : 54 సంచిక : 11-13 విజయవాడ 5-7-2021 పేజీలు : 24 వెల : రు. 10/-


## సంక్షోభం చుట్టుముట్టిన ఈ సమయాన కా॥టి.ఎన్. బోధించి, ఆచరించిన విప్లవ మార్గాన ముందుకుసాగుదాం

**విప్లవ** సిద్ధాంతాన్ని చదవటం, అర్థంచేసుకోవటం, వల్లెవేయ గల్గటం–వానికవే గొప్ప విషయాలు ఎంతమాత్రమూ కావు. మార్క్సిజాన్ని అధ్యయనంచేయటం, విప్లవ కార్యాచరణకు, జీవితానికి దానిని అన్వయించటం, ప్రజలనుండి నేర్చుకునే సహనంతో అంకితమవటం–ఒక్కమాటలో–విప్లవ విజయమనే ఏకైక కారణంకోసం తమ యవ్వనాన్ని, జీవితాన్ని, సర్వస్వాన్నీ పణమొడ్డటం–మహత్తరమైనది. దీనికితోడు విప్లవ మేధోకృషితో, విప్లవోద్యమ నాయకులుగా దార్శనికులుగా వెలుగొందటం చాలా కొద్దిమందికే సాధ్యం. అలాంటి మహత్తర విప్లవ నాయకులలో పేరెన్నికగలవాడు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి. జులై 28న కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి 45వ వర్ధంతి సందర్భంగా ఆ కామ్రేడ్‌కు జోహార్లర్పిద్దాం.



సిపిఐ(ఎం–ఎల్) కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు, సుదీర్ఘకాలం 'జనశక్తి'కి సంపాదకునిగా వ్యవహరించిన కామ్రేడ్ జస్వంతరావు గత సం॥రం ఆగస్టు 28న మరణించిన విషయం తెలిసిందే. కామ్రేడ్ టి.ఎన్ మరణించిన సంవత్సరమే వృత్తి విప్లవకారునిగా ప్రకటించుకున్న కా॥జస్వంత్, ఆర్థికశాస్త్రంపై అవగాహన పెంచుకునే కృషిచేశారు. వైద్యశాస్త్రంలో పట్టా తీసుకొని, సమాజశస్త్ర చికిత్సకు మార్క్సిస్టు తత్వశాస్త్రాన్ని అధ్యయనం చేశారు. కా॥టి.ఎన్. లోటును ఆర్థిక రంగంలో పూరించాలనే పట్టుదలతో మేధోకృషి సాగించారు. కా॥టి.ఎన్. 'తాకట్టులో భారతదేశం' ఆధారంగా ఎన్నో విశ్లేషణాత్మక వ్యాసాలు వ్రాశారు; ప్రసంగాలు చేశారు. పాలకుల గణాంకాల గారడీలను, అంకెల సాక్ష్యాలతోనే త్రిప్పికొట్టేవారు. కా॥టి.ఎన్.శతజయంతి సభలలోనూ, ఎన్నో వర్ధంతి సభలలోనూ రాష్ట్రవ్యాపితంగా తిరిగి ప్రసంగించారు. 'తాకట్టులో భారతదేశం' పుస్తకం రెండవ ముద్రణకు ముందుమాట ఆర్థికరంగంలో కా॥జస్వంత్ విశ్లేషణా శక్తిని చాటుతుంది.

కా॥టి.ఎన్ వర్ధంతి సందర్భంగా చివరగా గత సంవత్సరం 'జనశక్తి'లో కా॥జస్వంత్ వ్రాస్తూ 'కమ్యూనిస్టు విప్లవకారుల వైతాళికుడు కా॥టి.ఎన్' అంటూ జోహార్లర్పించారు. భారత విప్లవోద్యమంపై ఆయన ప్రసరించిన వెలుగు విప్లవ మార్గదర్శకంగా వుంటుందన్న కా॥జస్వంత్ నిర్ధారణ అక్షర సత్యం.

భారత దళారీ బూర్జువావర్గం గురించి అంచనా చెబుతూ సామ్రాజ్యవాదుల భోజనాల బల్లవద్ద జారిపడే ఎంగిలి మెతుకులకోసం వెంపర్లాడేవారుగా టి.ఎన్. వారిని అభివర్ణించారని, వారి వర్గ స్వభావాన్ని వివరించే ప్రతి సందర్భంలోనూ నొక్కి చెప్పేవారు. ఫ్యూడలిజంతో రాజీపడి భూస్వామ్య సంబంధాలను బలీయం చేస్తున్న, సామ్రాజ్యవాదానికి సేవ చేస్తున్న నేటి పాలనావ్యవస్థను కూలదోయాలనే, నూతన ప్రజాస్వామిక వ్యవస్థను స్థాపించుకోవాలనే కా॥టి.ఎన్. బోధనలను కా॥జస్వంత్ పునరుద్ఘాటించారు.

భారత పాలకవర్గాలు విప్లవాత్మక సంస్కరణలద్వారా భూస్వామ్య వ్యవస్థను మార్చడానికి పూనుకోవని, దశాబ్దాలపాటు భారత రైతాంగాన్ని అత్యంత దోపిడీ అణచివేతలకు గురిచేసి అతినెమ్మదిగా అతిక్రూరంగా, రక్తమాలిన్యాలలో నుండి పడలాగుతూ ఈ పరివర్తన సాగిస్తాయన్న కా॥టి.ఎన్. విశ్లేషణను ఉదహరించిన ప్రతి సందర్భంలోనూ కా॥జస్వంత్ గొంతు గద్గదమవటం అందరికీ అనుభవంలోనిదే. ఈ క్రమ పరివర్తనను నిరాకరించి, విప్లవ కార్యాచరణతో విప్లవాత్మక మార్పులకోసం–ప్రజల పక్షాన, రైతాంగ పక్షాన నిలచి విప్లవకారులు నాయకత్వం వహించాలని ఆయన ఉద్బోధించారు.

ప్రస్తుత కరోనా ఉపద్రవంతో ప్రజానీకం విలవిల్లాడు తుండగా, ప్రజలపై పన్నుల భారాన్ని పాలకులు పెంచుతూపోతున్నారు. రోజువారీగా పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో నిత్యావసరాల ధరలు, ప్రయాణ, రవాణా ఛార్జీలు పెనుభారమౌతున్నాయి. రెండు సంవత్సరాలుగా వెంటాడుతున్న కరోనా మహమ్మారి కారణంగా కోట్లాదిమంది ప్రజానీకానికి కాస్తోకూస్తో ఆధారంగా వున్న ఉపాధి అవకాశాలు కూడా లేకుండాపోయాయి. అనారోగ్యాల బారినపడి ప్రభుత్వ వైద్యానికి దిక్కులేక ఎందరో అప్పులపాలవుతున్నారు. కష్టకాలంలో ప్రజలను ఉదారంగా ఆదుకోవలసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెపాన్ని ఒకరిపై ఒకరు తోసుకుంటూ ప్రజలను గాలికొదిలేస్తున్నాయి. చిన్న వృత్తులు, చిన్న వ్యాపారాలు చితికిపోయాయి. కనీస ఉపాధికరవై కొనుగోలుశక్తి కోల్పోయి పూటగడవని స్థితిలోనున్న పేద, శ్రామిక ప్రజానీకం, భవిత అగమ్యగోచరంగా నున్న యువత, మధ్యతరగతి ప్రజానీకం, రైతాంగం, కార్మికవర్గ ప్రజానీకం తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. రైతాంగ మనుగడను ప్రశ్నార్థకం చేసే నల్లచట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ సరిహద్దులనే ఆవాసంగా చేసుకొని పెద్ద సంఖ్యలో రైతాంగం గత 7 నెలలుగా నిరవధికంగా ఆందోళన సాగిస్తున్నారు.

# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పత్రిక

వెబ్‌సైట్ :
www.janasakthionline.com
ఈ-మెయిల్ :
janasakthi1963@gmail.com

సంపుటి : 54  సంచిక : 11-13


## లోపలిపేజీల్లో....


కా॥మధుకు నివాళి :
సిసి, సిపిఐ(ఎం-ఎల్) జనశక్తి 11
అంతర్జాతీయం :
ఆఫ్ఘనిస్థాన్ పరిణామాలు 3
- నోమ్‌చామ్‌స్కీ, విజయ్‌ప్రసాద్
రాజకీయార్థికం :
బడా ఫార్మా కంపెనీలు - నయా ఉదారవాద విధానాలు 5
ఎల్ఐసి-ప్రైవేటుపరం 10
రాజద్రోహ చట్టం-అమలు 12
మేడే 2021-కార్మికుల డిమాండ్లు 14
- సుబోధ్‌వర్మ
గిగ్ ఆర్థిక వ్యవస్థ 16
ట్యాక్సీ డ్రైవర్ల దుస్థితి 17
అమెజాన్‌లో యూనియన్ ఏర్పాటు 19
సంఘీభావం :
లక్షద్వీప్ ప్రజల ఆందోళన 22
జోహార్లు :
మహమ్మద్ గౌస్ 11
కవిత :
కా॥టి.ఎన్. మా విప్లవ జెండా 18
పుస్తక పరిచయం :
'నా జాతి ప్రజలకోసం నిలబడతా' 20
కరపత్రం :
అధిక ధరలపై 4 విప్లవ సంస్థల కరపత్రం 23
రిపోర్టు :
కేంద్రకమిటి పిలుపు అమలు రిపోర్టులు 24
ప్రకటన :
ఎస్‌కెఎమ్ ఆందోళనపై 4



**వెల :** విడిప్రతి..................రూ.10/-
సంవత్సర చందా....రూ. 100/-

చిరునామా :

**32-13-26/1, బి.ఎం.ఆర్. రోడ్, ఎం.ఆర్.పురం, విజయవాడ-10**


ప్రస్తుత పరిణామాలన్నింటినీ దేశ రాజకీయ, ఆర్థిక సంక్షోభాల పర్యవసానాలేనని కా॥టి.ఎన్ చేసిన విశ్లేషణను తదనంతర కాలానికి అన్వయించి, ఆ విశ్లేషణ సరైనదని కా॥జస్వంత్ నిర్ధారించారు.

ప్రభుత్వరంగం గురించి కా॥టి.ఎన్. చెబుతూ భారత బూర్జువావర్గానికి వీటిని నిర్వహించగలిగే శక్తిలేదని, ప్రజాధనంతో ప్రభుత్వం ఈ మౌలికరంగ భారీ పరిశ్రమలను స్థాపించి, నిర్వహించి, బడాపెట్టుబడిదారీ వర్గానికి ఎలా తోడ్పడిందో వివరించారు. ఈనాడు వాటినే పాలకులు బడా, బహుళజాతి యాజమాన్యాలకు ఏవిధంగా కారుచౌకగా కట్టబెడుతున్నారో విశ్లేషిస్తూ కా॥జస్వంత్ పలు వ్యాసాలు రాశారు.

భారత పాలకవర్గాలు నిరంతర సంక్షోభంలో కూరుకుపోయి, ప్రజలను తమ ప్రభావంలో నిలబెట్టుకోగల పరిస్థితిలో లేవు. ప్రజల జీవితాలను మెరుగుపరిచే సంస్కరణలు చేస్తామన్న పాలకుల వాగ్దానాలన్నీ బూటకమని తేలిపోయాయి. తాత్కాలికంగా ప్రజల దృష్టి మరల్చటానికి, వారిని ఆశలపల్లకిలో ఊరేగించి ఊరించటానికి పాలకులు జనాకర్షక పథకాలుగా, వీటిని మరింతగా దిగజార్చి జనాకర్షక చిట్కాలుగా, ఈనాడు లబ్ధిదారులపేరిట కొందరిని ఎంపికచేసి, వారి బ్యాంకు ఖాతాలలో నేరుగా ఎంతో కొంత నగదు జమచేయటంగా దిగజార్చారు. దీనినంతా దేశ రాజకీయ ఆర్థిక సంక్షోభపు దుస్థితిగా కా॥టి.ఎన్. పేర్కొన్నారు. ప్రజలనుండి భారత పాలకులు ఎంతగా వేరుపడిపోయారో ఈ అంశాలు స్పష్టం చేస్తున్నాయన్నారు.

మరోవైపున బడాపారిశ్రామికవేత్తలకు, బహుళజాతి కంపెనీలకు పాలకులు వీసమెత్తు నష్టం జరగకుండా చూసుకుంటున్నారు. కరోనా విజృంభించిన రెండు దశల్లో 'ఆత్మ నిర్భర భారత్' పేరిట 2 విడతలుగా కేంద్రప్రభుత్వం ప్రకటించిన లక్షలకోట్ల నిధులలో సింహ భాగాన్ని రాయితీలు, ఉద్దీపనలు, పన్ను మినహాయిపులపేర దోపిడీ వర్గాలకే కట్టబెడుతున్నారు. కరోనా ఘోరపరిస్థితుల నడుమ కూడా బడావ్యాపార వర్గాల ఆస్తులు అనూహ్యంగా పెరగటమే దీనికి తార్కాణం.

ప్రజల ప్రాణాలర్పించి పోరాడి సాధించుకున్న, లాభాలలో నడుస్తున్న ప్రభుత్వ విశాఖ ఉక్కు పరిశ్రమను, హెచ్‌పిసిఎల్ వంటి పరిశ్రమలను అమ్మేందుకు కరోనా కాలంలోనే పాలకులు నిర్ణయించారు. ప్రభుత్వ బ్యాంకులు, ఎల్ఐసివంటి ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు యాజమాన్యాలకు ధారాదత్తంచేసే నిర్ణయాలు తీసుకున్నారు. ఈ చర్యలన్నీ దేశ, విదేశీ పెట్టుబడిదారీ వర్గానికి విందు భోజనాలే కదా?! కరోనా నుండి ప్రజలను రక్షించే బదులుగా ప్రపంచ పెట్టుబడిదారీ సంక్షోభ భారాన్ని ప్రజలవీపులపై మోపేందుకు కరోనాను పాలకులు ఉపయోగించుకుంటున్నారు.

పాలకులు ప్రజలపై మోపుతున్న భారాలతో, అసలే అస్తుబిస్తుగా జీవిస్తున్న ప్రజల బ్రతుకులు మరింత దుర్భరమౌతున్నాయి. వీరి అసంతృప్తి వివిధ సందర్భాల్లో నిరసన, ఆందోళనల రూపం తీసుకుంటున్నది. కొన్నిచోట్ల మిలిటెంట్ రూపం తీసుకుంటున్నది. ప్రజలపై, ప్రజాఉద్యమాలపై పాలకుల అణచివేత తీవ్రమైంది. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించటమే 'రాజద్రోహం' అవుతోంది. ఫాశిస్టు తరహా నిర్బంధం అమలవుతోంది.

మరోవైపున దళితులపైన, ఆదివాసులపైన, మతమైనారిటీలు, అల్పసంఖ్యాకులపైన తీవ్రంగా దాడులు సాగుతున్నాయి. ప్రజలను విభజించి పాలించేవిధంగా కుల, మత, జాతి, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టి పాలకముఠాలే వానికి నాయకత్వం వహిస్తున్నాయి. ప్రజలను ప్రక్కదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నాయి.

1970ల నాటికున్న పరిస్థితులను కా॥టి.ఎన్.విశ్లేషించి రాగల పరిణామాలను, పర్యవసానాలను గతితార్కిక దృష్టితో స్పష్టపరిచారు. ఈ అవగాహన వెలుగులో కా॥జస్వంత్ 1990ల నాటి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, నూతన ఆర్థికవిధానాల అమలు పర్యవసానాలను శాస్త్రీయంగా విశ్లేషించారు. సామ్రాజ్యవాద దోపిడీ కొనసాగింపే నూతన ఆర్థిక విధానాలని వివరిస్తూ, ఈ విధానాల అమలుకు ముందు దేశపరిస్థితి బాగుందనే కొందరు వామపక్షవాదుల సూత్రీకరణను పూర్వపక్షం చేశారు. గ్రామీణ ఆర్థికవ్యవస్థలో పెట్టుబడిదారీ సంబంధాలు పెరగటానికీ, పెట్టుబడిదారీ విధానంగా రూపాంతరం చెందటానికి మధ్యగల తేడాలను సోదాహరణంగా వివరించేవారు. గ్రామీణ ప్రాంతాల్లో అర్థఫ్యూడల్ సంబంధాలు బలీయంగా నేటికీ కొనసాగుతుండటాన్ని కా॥జస్వంత్ నొక్కి చెప్పారు. సామ్రాజ్యవాద దోపిడీ విధానాలలో వస్తున్న మార్పుల్ని అధ్యయనంచేసి విశ్లేషించటమేగాకుండా, కా॥టి.ఎన్. బోధించిన సూత్రీకరణల ప్రాసంగికతను, ప్రాధాన్యతను ఎత్తిపట్టారు.

ప్రజలను భ్రమల్లో ముంచటానికి, చీల్చటానికి, అణచివేయటానికి పాలకులు ఎన్ని ప్రయాసలు పడినప్పటికీ కుతకుత ఉడుకుతున్న అగ్ని పర్వతంలాగున్న పీడిత ప్రజల అసంతృప్తి ఏదోనాడు బ్రద్దలవటం ఖాయం. అయితే వీరిని సమీకృతంచేసి, వీరిలో విశ్వాసాన్ని ప్రోదిచేసి, సంఘటితపరిచే స్వీయాత్మకశక్తులు బలహీనంగా వుండటమే దోపిడీ పాలకులకు వరప్రసాదమౌతోంది. పాలకులు తమ అధికారపీఠంపై కులకటానికి ఈ పరిస్థితే అవకాశం కల్పిస్తోంది తప్ప, వారు ప్రచారం చేసుకుంటున్నట్లు వారి నాయకుల సుపరిపాలనో, ఛరిస్మానో, పలుకుబడో ఎంతమాత్రమూ కారణము కాదు. మార్క్సిజం-లెనినిజం-మావోఆలోచనావిధానం వెలుగులో ప్రజలను విప్లవకార్యాచరణకు కదిలించే విప్లవశక్తులన్నీ ఏకతాటిపైకి రావలసిన అవసరాన్ని ప్రస్తుత పరిస్థితులు డిమాండ్ చేస్తున్నాయి. ఈ దిశగా విప్లవకారుల ఐక్యతకోసం కృషిసల్పటానికి ప్రతినబూనుతూ కా॥తరిమెల నాగిరెడ్డికి విప్లవజోహార్లర్పిద్దాం. ✡

# ఆఫ్ఘనిస్తాన్ నుండి అమెరికా సైనిక బలగాల ఉపసంహరణ జరిగేనా?

నోమ్‌చామ్‌స్కీ, విజయ్‌ప్రసాద్

**2001** అక్టోబర్ 7న ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా దురాక్రమణ దాడికి పాల్పడటం నేరపూరితమైంది. వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై 2001 సెప్టెంబర్ 11న జరిగిన టెర్రరిస్టు దాడులను సాకుగా చూపి నాటి అమెరికా అధ్యక్షుడు బుష్ 'టెర్రరిజంపై పోరు' పేరిట ఈ దాడికి పాల్పడ్డారు. ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన భౌతిక, మౌలిక సదుపాయాలను నాశనం చేయటానికి, ఆ దేశ సామాజిక బంధాలను విచ్ఛిన్నం చేయటానికి భారీస్థాయిలో సైనిక బలగాలను ఉపయోగించటం-అమెరికా చేసిన ఘోరమైన నేరం.

2001 అక్టోబర్ 11న అనటోల్ లీవెన్ అనే పత్రికా విలేఖరి నాటి ఆఫ్ఘనిస్తాన్ నాయకుడు అబ్దుల్‌హక్‌ను పాకిస్థాన్‌లోని పెషావర్‌లో ఇంటర్వ్యూ చేశాడు. తాలిబన్లకు వ్యతిరేకంగా ప్రతిఘటనకు నాయకత్వం వహించటంలో భాగస్వామి అయిన హక్, అమెరికా వైమానిక బాంబుదాడులను ఆసరాగా చేసుకొని ఆఫ్ఘనిస్తాన్‌కు తిరిగి వెళ్ళేందుకు సంసిద్ధుడై వున్నాడు. ఏమైనా, యుద్ధాన్ని అమెరికా కొనసాగించాలని నిర్ణయించిన తీరుపట్ల అతను సంతోషంగా లేడు. 'ప్రస్తుత పరిస్థితుల్లో సైనిక చర్య-ప్రత్యేకించి, ఈ యుద్ధం మరింత కాలం కొనసాగి, ఇంకా ఎక్కువమంది పౌరులు హతమయ్యేట్లయితే, అది మాత్రం పరిస్థితులను మరింత క్లిష్టతరంగా మారుస్తుంది' అని హక్ లీవెన్‌తో ఆనాడే చెప్పాడు. ఈ యుద్ధం 20 సం॥ల కాలం నుండి కొనసాగుతూ వుంది; వియత్నాంలో అమెరికా సాగించిన దురాగతాలను మించిపోయిన స్థాయిలో ఆఫ్ఘన్ ప్రజలపై హింసాకాండ సాగించింది. ఈ కాలంలో కనీసం 71,344 మంది పౌరులు తమ ప్రాణాలు కోల్పోయారు. పదిలక్షల మందిపైగా గాయపడ్డారు. 60 లక్షలమంది దేశం వదిలి పోయారు. అతిపెద్ద శరణార్థులను తయారు చేసిన దేశంగా ఆఫ్ఘనిస్తాన్ మిగిలింది.

"ఆఫ్ఘనిస్తాన్‌లో పనిచేస్తున్న గ్రూపులన్నింటినీ కలుపుకుని, ఒక ఐక్యరాజకీయ పరిష్కారంకోసం కృషిచేయటమే, అమెరికాకు అన్నివిధాలా మంచిది. అలాకాకుంటే, వివిధ దేశాల దన్నుతోనున్న దేశంలోని వివిధ గ్రూపుల నడుమ లోతైన విభజనలకు ప్రోత్సాహం లభించి ఈ మొత్తం ప్రాంతాన్ని చాలా దారుణంగా ప్రభావితం చేస్తుంది" అని అబ్దుల్‌హక్ లీవెన్‌తో అన్నాడు. ముందుచూపు కలిగిన మాటలివి. అయితే తన ఈ మాటలనెవరూ లక్ష్యపెట్టరని హక్‌కు తెలుసు. 'ఏం చేయాలనే అంశంపై బహుశ ఇప్పటికే అమెరికా ఒక ఆలోచనకు వచ్చివున్నందున, నేనిచ్చే ఏ సూచనలూ, సలహాలూ ఉపయోగపడేవి కావు' అని ఆయన లీవెన్‌తో అన్నాడు.

అనూహ్య విధ్వంసాన్ని కలిగించిన 20 సం॥ల ఈ యుద్ధం తర్వాత, 'ఆఫ్ఘనిస్తాన్‌లోని గ్రూపులన్నింటి' నడుమ క్రోధావేశాలు భగ్గుమంటున్న ఈ తరుణాన-సరిగ్గా అబ్దుల్‌హక్ ప్రతిపాదించిన అదే విధానానికి - రాజకీయ చర్చలు జరపాలనే ఆలోచనకు-అమెరికా తిరిగి వచ్చింది.

అబ్దుల్‌హక్ పై ఇంటర్వ్యూ ఇచ్చిన 15 రోజులకు, ఆఫ్ఘనిస్తాన్‌కు తిరిగి వచ్చిన తర్వాత, 2001 అక్టోబర్ 26న తాలిబన్ల చేతిలో హతమయ్యాడు. అతని సలహాకు నేడు కాలం చెల్లింది. 2001 సెప్టెంబర్‌లో తాలిబన్లతో సహ దేశవ్యాపితంగా ఆఫ్ఘన్ మద్దతుదారులంతా చర్చలకు సిద్ధంగా వున్నారు. ఆఫ్ఘన్ ఆకాశంలో చక్కర్లు కొడుతున్న అమెరికా యుద్ధ విమానాలు ఆఫ్ఘనిస్తాన్‌లో నరకం సృష్టిస్తాయని కొంతలో కొంత వారు భయపడినందువల్ల కూడా వారు దీనికి సిద్ధమయ్యారు. ఇప్పుడు, 20 సం॥ల తర్వాత, తాలిబన్లకు ఇతరులకు నడుమ అఘాతం విస్తృతమైంది. కేవలం, చర్చలు జరుగుతాయనే ఆశ మాత్రమే, ఎంతో కాలం మనజాలదు.

## అంతర్యుద్ధం

2021 ఏప్రిల్ 14న ఆఫ్ఘనిస్తాన్ పార్లమెంట్ స్పీకర్ మీర్ రహ్మాన్ రహ్మాని మాట్లాడుతూ తమ దేశం 'అంతర్యుద్ధం' అంచున వుందంటూ హెచ్చరించాడు. అమెరికా ఆఫ్ఘనిస్తాన్ నుండి ఉపసంహరించుకున్న తర్వాత సెప్టెంబర్ 11 నాటికి సంభవించబోయే అంతర్యుద్ధం గురించి కాబూల్‌లో రాజకీయ వర్గాలు ఆగ్రహావేశాలతో చర్చలు సాగిస్తున్నాయి. ఈ కారణంగానే, ఏప్రిల్ 15న కాబూల్‌లోని అమెరికా దౌత్యకార్యాలయంలో నిర్వహించిన పత్రికా విలేఖరుల సమావేశం సందర్భంగా 'టోల్ న్యూస్'కు చెందిన షరీఫ్ అమ్రి అంతర్యుద్ధం సంభవించే అవకాశాల గురించి అమెరికా విదేశాంగమంత్రి ఆంటోనీ బ్లిన్‌కెన్‌ను ప్రశ్నించారు. 'దేశంలో పరిణామాలు అంతర్యుద్ధంగానూ, దీర్ఘకాల యుద్ధంగానూ దిగజారటమనేది ఎవరికీ తోడ్పడేది కాదు. మనకు తెలుస్తున్న దాని ప్రకారం, తాలిబన్ల ప్రయోజనాలకు కూడా ఇది ఏమాత్రం తోడ్పడేది కాదు' అని బ్లిన్‌కెన్ సమాధానమిచ్చాడు.

వాస్తవానికి, అన్నివిధాలా ఆఫ్ఘనిస్తాన్ గత 50 సం॥లుగా - అబ్దుల్‌హక్‌తో సహ ముజాహిదీన్‌లను సృష్టించిన కాలం నుండి- కనీసం, ఆఫ్ఘనిస్తాన్‌లో ఏర్పడిన పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ ప్రభుత్వం(1978-1992)తో యుద్ధ కాలం నుండీ అంతర్యుద్ధంలోనే వుంది. ఆఫ్ఘనిస్తాన్‌లోని అత్యంత ఛాందస, అతి మితవాదశక్తులకు, గ్రూపులకు అమెరికా అండదండలతో ఈ అంతర్యుద్ధం తీవ్రమైంది. ఆల్‌ఖైదా, తాలిబన్లు, ఇతర ముస్లిమ్ మతతత్వ గ్రూపులు ఇందులో భాగంగా రూపొందాయి. ఈ కాలమంతటా అమెరికా ఒక్కసారి కూడా శాంతిస్థాపనకు మార్గాన్ని ప్రతిపాదించలేదు; దీనికి బదులుగా, కాబూల్‌లో ఫలితాన్ని అదుపు చేసేందుకు ప్రతి మలుపులోనూ సైనిక బలగాలను అత్యధికంగా ఉపయోగించేందుకు అమెరికా ఎల్లవేళలా ఉత్సుకతను ప్రదర్శించింది.

## ఉపసంహరణ?

ఆఫ్ఘనిస్తాన్‌పై దురాక్రమణను అనుసరించి అమెరికా, ఇరాక్‌పై దురాక్రమణ సాగించింది. పశ్చిమాసియాలో తన సైనిక స్థావరాలను నెలకొల్పింది. లిబియా, సిరియాలపై దాడులు సాగించింది. ఇథియోపియా, సోమాలియాలలో సైనిక జోక్యాన్ని సాగించింది. ఈ క్రమంలో ఆఫ్ఘనిస్తాన్ నుండి తన సైనిక బలగాలను ఉపసంహరించుకుంటానని ప్రకటిస్తూ వస్తున్నా, ప్రజలను మోసగించటానికే తప్ప, వాస్తవానికి దానిని ఆచరణలో పెట్టలేదు. 2021 సెప్టెంబర్ 11 నాటికి ఆఫ్ఘనిస్తాన్ నుండి సైనిక బలగాలను ఉపసంహరించుకుంటామని తాజాగా ప్రకటించారు.

2021 ఏప్రిల్ చివరలో ప్రకటించి, మే 1వ తేదీన ప్రారంభమైన ఈ ఉపసంహరణ కూడా ప్రకటించినంత స్పష్టంగా అయితే మాత్రం లేదు. 2021 ఏప్రిల్ 14న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ 'అమెరికా సైనిక బలగాలు మాతృదేశం చేరుకునే సమయమిది' అని ప్రకటించాడు. 2500 సమూహాలకు చెందిన సైనిక బలగాలు సెప్టెంబర్ 11 నాటికి ఆఫ్ఘనిస్తాన్ నుండి ఉపసంహరించుకుంటాయని, అదే రోజున అమెరికా రక్షణశాఖ వివరణ నిచ్చింది. కాగా, అమెరికాకు చెందిన 'న్యూయార్క్ టైమ్స్' పత్రిక మార్చి 14న ఓ వ్యాసంలో ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా 3500 సమూహాల సైనిక బలగాలను కలిగి వుందని పేర్కొంది. (బహిరంగంగా 2500 సమూహాల బలగాలేనని పేర్కొంటున్నారు). సైనిక బలగాల సంఖ్యను ఇలా తక్కువగా చూపటం ద్వారా అమెరికా రక్షణశాఖ నిగూఢంగా వుంచదలచుకున్నదని స్పష్టమౌతోంది. రక్షణశాఖ సహాయమంత్రి కార్యాలయ నివేదిక మరిన్ని వివరాలిస్తూ ఆఫ్ఘనిస్తాన్ భూభాగంలో దృఢంగా నిలిచేందుకు అమెరికాకు చెందిన 16వేలమంది కాంట్రాక్టర్లున్నారని తెలిపింది. సైనికులకు మద్దతునందించటం వంటి వాటితో సహ అనేక సేవలందించేవారు వీరిలో వున్నారు. వీరిలో ఏ ఒక్క కాంట్రాక్టరు గానీ, లేదా బయటకు వెల్లడి

చేయని వెయ్యి సమూహాల అమెరికా సైనిక బలగాలుగానీ ఆఫ్ఘనిస్తాన్ నుండి ఉపసంహరించుకునే జాబితాలో లేవు;లేదా డ్రోన్ దాడులతో సహా వైమానిక బాంబుదాడులు సాగించే జాబితాలో కూడా పేర్కొనకపోవటం - ప్రత్యేక బలగాల మోహరింపు ప్రక్రియకు ముగింపు ఉండబోవటంలేదని తెలియజేయటమే!

ఆష్రఫ్ ఘని నాయకత్వంలోని ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వానికి అమెరికా షుమారు 30 కోట్ల డాలర్లను అందించబోతున్నట్లుగా ఏప్రిల్ 21న బ్లినకెన్ పేర్కొన్నాడు. తనకంటే ముందు ప్రభుత్వ అధికారంలోనున్న హమీద్ కర్జాయ్‌ను అభిమానించే ఆష్రఫ్‌ఘని, తరచుగా ఆఫ్ఘనిస్తాన్ అధ్యక్షునిగా కంటే కాబూల్ మేయర్‌గా మాత్రమే వ్యవహరిస్తూ, తన ప్రత్యర్థులచే చుట్టుముట్టబడి వున్నాడు. అమెరికా సైనిక బలగాల ఉపసంహరణ తర్వాత ఏర్పడనున్న ప్రభుత్వాల గురించి కాబూల్‌లో అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీనిలో హిజ్బ్-ఎ-ఇస్లామీ నాయకుడు గుల్బుద్దీన్ హెక్‌మాత్యార్ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడి పాలన సాగిస్తుందని, దీనిలో తాలిబన్లకు భాగస్వామ్యం ఉండబోదనే ప్రతిపాదన కూడా వుంది. ప్రభుత్వ ఏర్పాటులో తాలిబన్లకు పాత్ర వుండితీరాలనే ఆలోచనకు అమెరికా కట్టుబడి వుందని ఈలోగా అమెరికా ప్రకటించింది. 1996 నుండి 2001 వరకు వ్యవహరించిన దానికంటే 'తక్కువ కఠినంగానే తాలిబన్ల పాలన' సాగించగలరని బైడన్ అధికారయంత్రాంగం నమ్ముతోందని ప్రస్తుతం బాహాటంగా చెప్పుకుంటున్నారు.

తాలిబన్లు తిరిగి అధికారాన్ని చేపట్టేందుకు అంగీకరించటానికి రెండు షరతులతో అమెరికా సిద్ధంగా వున్నట్లుగా కన్పిస్తోంది. అమెరికా ప్రత్యక్షంగా కొనసాగటాన్ని తాలిబన్లు ఆమోదించటం; కాబూల్‌లో అమెరికా ప్రధాన ప్రత్యర్థులయిన చైనా, రష్యాలకు తాలిబన్లు ఎలాంటి పాత్ర కల్పించకూడదనేవే ఈ రెండు షరతులు. 2011లో అమెరికా విదేశాంగ శాఖామంత్రి హిల్లరీక్లింటన్ మనదేశ పర్యటనలో భాగంగా చెన్నైలో మట్లాడుతూ భారత ఓడ రేవులతో అనుసంధానిస్తూ ఆఫ్ఘనిస్తాన్ గుండా మధ్య ఆసియాను కలిపే 'న్యూసిల్క్ రోడ్ ఇనీషియేటివ్' నిర్మాణ ప్రతిపాదన ముందుకు తెచ్చింది. రష్యాను మధ్యఆసియాలోని దాని లింకుల నుండి తెగగొట్టి, టర్కీ వరకు ప్రస్తుతం నడుస్తున్న 'చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్' నిర్మాణాన్ని నిరోధించటం - ఈ ప్రతిపాదన వెనకనున్న ప్రయోజనంగా వుంది.

ఆఫ్ఘనిస్తాన్‌లో స్థిరత్వమనేది ఏర్పడటం లేదు. ఉజ్బెకిస్తాన్ మాజీ విదేశాంగశాఖా మంత్రి, ప్రస్తుత 'షాంగై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్' (యస్‌సిఓ) సెక్రటరీ జనరల్ వ్లదమీర్ నోరోవ్ జనవరిలో 'ఇస్లామాబాద్ పాలసీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' నిర్వహించిన వెబినార్‌లో పాల్గొని ప్రసంగించాడు. ఐసిస్ లేదా డేయిష్‌లు తమ కార్యకర్తలను సిరియానుండి ఉత్తర ఆఫ్ఘనిస్తాన్‌కు బదలాయిస్తున్నాయని నోరోవ్ ఆ సందర్భంగా పేర్కొన్నాడు. ఉగ్రవాద కార్యకర్తలతో కూడిన ఈ ఉద్యమం, ఆఫ్ఘనిస్తాన్‌కే కాక, మధ్య ఆసియా, చైనాలకు కూడా ఇబ్బందిని కలిగిస్తుంది. ఐసిస్ ఉగ్రవాదులపై విజయాలు సాధించటంలో, వైమానిక దాడులలో అమెరికా సైనికబలగాలకు తాలిబన్లు మద్దతునిచ్చినట్లుగా 2020లో వాషింగ్టన్ పోస్ట్ తెలియజేసింది. ఒకవేళ తాలిబన్లతో శాంతి ఒప్పందం ఏమైనా కుదిరినా, ఐసిస్ దానిని అస్థిరపరుస్తుంది.

## వదిలివేయబడిన సాధ్యం కాగల అంశాలు

ఆఫ్ఘనిస్తాన్ మహిళల పట్ల బాధ్యతతో వుంటామనే దానిపట్ల, 2001 అక్టోబర్‌లో అమెరికా సాగించిన దురాక్రమణకు చట్టబద్ధత కల్పించటంపట్ల ఇచ్చిన వాగ్దానాలను వదిలేశారు. రసిల్‌బసు అనే ఐక్యరాజ్యసమితి అధికారి 1986 నుండి 1988 వరకు ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వంలో మహిళాభివృద్ధి అంశంలో సీనియర్ సలహాదారుగా సేవలందించారు. పితృస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా మహిళలు సంఘటితమై పోరాడేందుకు; ఇంట్లో, పనిప్రదేశాల్లో సమానత్వం కొరకు పోరాడేందుకు 1987 నాటి ఆఫ్ఘనిస్తాన్ రాజ్యాంగం మహిళలకు పురుషులతో సమాన హక్కులను కల్పించింది. యుద్ధంలో పెద్ద సంఖ్యలో పురుషులు చనిపోయిన కారణంగా, మహిళలు పలురకాల వృత్తులలోకి ప్రవేశించారు. మహిళల అక్షరాస్యత మొదలుకొని మహిళల హక్కుల విషయంలో తగినన్ని విజయాలు సాధించారు. గత ఈ రెండు దశాబ్దాల పైగా కాలంలో, అమెరికా యుద్ధకాలంలో ఈ హక్కులు, అవకాశాలలో ఎక్కువభాగాన్ని హరించి వేశారు.

1988-89లో ఆఫ్ఘనిస్తాన్ నుండి రష్యా ఉపసంహరించుకునే దానికి ముందు కూడా, అధికారంకోసం ప్రాకులాడే గుల్బుద్దీన్ హెక్‌మాత్యార్‌వంటి పురుషులు, తాము అధికారంలోకి వస్తే ఈ హక్కులను రద్దుచేస్తామని చెప్పేవారు. రసిల్‌బసు షబ్నమ్‌ను గుర్తుచేసుకున్నాడు; పితృస్వామ్య విధానాలకు తలొగ్గాలని మహిళలను హెచ్చరిస్తూ జారీచేసిన ఆదేశాలను గమనించాడు. ('న్యూయార్క్ టైమ్స్', 'వాషింగ్టన్ పోస్ట్', 'మిస్ మ్యాగజైన్' వంటి పత్రికలకు ఈ ఘోరానికి సంబంధించిన కొన్ని అభిప్రాయాలను ఆమె పంపినప్పటికీ, వారందరూ దానిని ప్రచురించకుండా తిరస్కరించారు.)

ఆఫ్ఘనిస్తాన్‌లో మహమ్మద్ నజీబుల్లా నాయకత్వంలోని చివరి కమ్యూనిస్టు ప్రభుత్వం (1987-1992), మహిళల హక్కులకు చర్చనీయాంశాలలో ఉన్నతస్థానం కల్పించే 'నేషనల్ రికన్సిలేషన్ విధానాన్ని' అవలంబించింది. ఈ విధానాన్ని అమెరికా దన్నుతోనున్న ముస్లిమ్ మతతత్వవాదులు - (వీరిలో అనేకమంది ఈనాటికీ అధికారంలో వున్నారు) నిరాకరించారు.

ఈ చరిత్రనుండి అమెరికా ఏవిధమైన గుణపాఠాలు నేర్చుకోవటంలేదు. అమెరికా 'ఉపసంహరణ' జరుగుతుంది కానీ చైనా, రష్యాలను నిలువరించే తన వారిని, తన ఆస్తులను అక్కడే వుంచి వెళ్ళటం జరుగుతుంది. ఈ భౌగోళిక రాజకీయ ఆలోచనల గ్రహణం, ఆఫ్ఘనిస్తాన్ ప్రజలకు సమస్యాత్మకంగానే నిలిచి పోతుంది.

**(న్యూస్‌క్లిక్, 06-05-2021 నుండి అనువాదం)**

# జూన్ 26న ' సేవ్ అగ్రికల్చర్, సేవ్ డెమోక్రసి' నినాదంతో ఆందోళనకు సంయుక్త కిసాన్‌మోర్చా పిలుపు

**ఢిల్లీ** సరిహద్దులనే ఆవాసంగా చేసుకొని మూడు నల్లచట్టాల రద్దే ప్రధాన డిమాండ్‌గా రైతాంగం ఆందోళన ప్రారంభించి 7 మాసాలు పూర్తవుతున్న సందర్భాన్ని; 1975 నాటి 'అత్యయిక పరిస్థితి'కి 46 సం॥లు అయిన సందర్భాన్ని పురస్కరించుకొని రైతాంగ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న వివిధ రైతు,కూలీసంఘాల ఐక్యవేదిక సంయుక్త కిసాన్‌మోర్చా ఆందోళనకు పిలుపునిచ్చింది. 'సేవ్ అగ్రికల్చర్, సేవ్ డెమోక్రసి' నినాదంతో జూన్ 26వ తేదీన దేశంలోని అన్ని రాష్ట్రాలలోనూ గవర్నర్ కార్యాలయాల వద్ద నిరసన ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించి, గవర్నరు ద్వారా రాష్ట్రపతికి విజ్ఞాపనపత్రాన్ని అందజేయాలని పిలుపునిచ్చింది.

గత 7 నెలలుగా తీవ్రమైన చలి, ఎండ, వానలను, వాతావరణ ప్రతికూలతలను రైతాంగం ఎదుర్కొని ముందుకు సాగుతున్నారు. రిపబ్లిక్ దినోత్సవాన పాలకులే సృష్టించిన గందరగోళాన్ని సాకుగా చేసుకొని, రైతాంగ ఉద్యమంపై తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించారు. దేశద్రోహం నేరంతో సహా పలు కేసులు రైతాంగంపై మోపి అరెస్ట్‌చేసి నిర్బంధించారు. రైతాంగ ఆందోళన శిబిరాలను తొలగింపజేసే ప్రయత్నాలు చేశారు. మరోవైపున కరోనా దేశవ్యాపితంగా వ్యాపిస్తున్న విపత్కర పరిస్థితులను కూడా లెక్కచేయకుండా రైతాంగం నిశ్చయాత్మకంగా తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎస్‌కెఎమ్ ఇచ్చిన జూన్ 26వ తేదీ పిలుపును విజయవంతం చేయాలని ఏఐకెఎమ్‌కెఎస్ విజ్ఞప్తిచేస్తోంది.

**యస్.ఝాన్సి**
**కో కన్వీనర్, ఏఐకెఎమ్‌కెఎస్**

# బడా ఫార్మా కంపెనీల సేవలో నయా ఉదారవాద విధానాలు

**వలసరాజ్యాల** కాలంలో గుత్తాధిపత్యం పెరగడానికి తోడ్పడిన అత్యంత విలువైన వస్తువులు రెండు. ఒకటి బంగారం, రెండవది వెండి. యూరోపియన్ వలసవాదులు అన్ని క్రూరమైన మార్గాలను ఉపయోగించి లాటిన్ అమెరికా నుండి ఆ సంపదను దోచుకున్నారు. దోచుకున్న ఆ సంపద పారిశ్రామిక విప్లవానికి దారితీసింది. సాధారణంగా పెట్టుబడిదారీ యుగంలో వస్తువులు భారీఎత్తున ఉత్పత్తి అయ్యి ప్రపంచవ్యాప్తంగా అమ్ముడవుతాయి. పెట్టుబడిదారీ 'అక్షయపాత్ర', అభివృద్ధి క్రమంలో దాని గుత్తాధిపత్యానికి దారితీసింది, పరిశ్రమ ఉత్పత్తి చేసిన వస్తువు కాదు; దాని 'ఉత్పత్తి ప్రక్రియ'. సామ్రాజ్యవాద వ్యవస్థ అది సాధించుకున్న గుత్తాధిపత్యాన్ని శాశ్వతం చేసుకోడానికి అత్యంత కీలకం ఈ 'ఉత్పత్తి ప్రక్రియ'- అందులోని గోప్యత. ఎప్పుడైతే సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిందో, ఎప్పుడైతే ఈ కార్పొరేట్‌లు ఇతర దేశాల్లో పరిశ్రమలను స్థాపించడం ప్రారంభించారో అప్పట్నుంచి వారి అభివృద్ధి ప్రక్రియలకు చెందిన పరిజ్ఞానాన్ని దాచుకోవడం వారికి మరింత కష్టమైంది. దానితో గుత్తాధిపత్యాన్ని, దోపిడీని విస్తరించడం కోసం, ప్రపంచాన్ని కొల్లగొట్టడం కోసం యుద్ధాలను ఆశ్రయించారు. వారి మధ్య ఏర్పడబోయే వివాదాలను పరిష్కరించడానికి అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఒక్కొక్కటిగా అంతర్జాతీయ సంస్థలు వచ్చాయి. అన్నీ సామ్రాజ్యవాదానికి సేవ చేయడంకోసం, వారి మధ్య వచ్చే వివాదాలను పరిష్కరించడం కోసం, అభివృద్ధిచెందుతున్న దేశాలుగా మారిన అప్పటి వలస దేశాలను దోచుకోవడం కోసం ఏర్పడ్డవే. సమాచార సాంకేతిక వ్యవస్థలో వచ్చిన పెనుమార్పుల నేపథ్యంలో తమ గుత్తాధిపత్యానికి ఆయువుపట్టు అయిన సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఉత్పత్తి పద్ధతులను ఇంకెంతమాత్రం దాచుకోవడం సాధ్యంకాదని వారికి అర్థమైంది. ఇది జరగాలంటే వారికి అంతర్జాతీయ చట్టాలు కావాలి. వాటికి దేశాలు కట్టుబడి ఉండేట్లు చేసే వ్యవస్థ కావాలి. ఆ చట్టాలే పేటెంట్ చట్టాలు(మేధో), ఆ వ్యవస్థే నయా ఉదారవాద ప్రపంచీకరణ. శతాబ్దాల తరబడి వివిధ సమూహాలు, వివిధ సమాజాలు సాగించిన సమష్టి ప్రయత్నాల ద్వారా, కృషి ద్వారా రూపొందిన ఈ 'జ్ఞానం' మేధోసంపత్తి హక్కుల, పేటెంట్ హక్కుల రూపంలో ప్రైవేటుశక్తుల చేతుల్లోకి వెళుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థకు ఈ 'మేధో సంపద', వస్తువు యొక్క 'ఉత్పత్తి సంక్లిష్టత' ప్రధానం కాదు; దాని అవసరం, దానికి ఎంత మార్కెట్ ఉంది అన్నదే ప్రధానం. ఈ మేధోసంపద సృష్టించిన వస్తువుపై ఎన్ని జీవితాలు, ఎంత తీవ్రంగా ఆధారపడితే అంత 'సంపద'గా మార్చుకోవచ్చు కనుక ఈ చట్టాలు చాలా 'బలం'గా అమలుచేయబడతాయి.

### సామ్రాజ్యవాద ఆయుధంగా పేటెంట్లు

పేటెంట్ అనేది యాజమాన్య హక్కు, ఒక రకమైన ఆస్తి హక్కు. ఒక భౌతిక వస్తువు ఒకరికి ఆస్థిగా ఉన్నదంటే అదే వస్తువుని మరొకరు పొందలేరు. కాని 'ఆలోచనలు' భౌతిక వస్తువులు కావు కాబట్టి వాటిని ఎంతమందితో పంచుకున్నా తరగవు. పైగా మానవాళి మొత్తంగా ముందుకెళుతుంది. ఈ 'ఆలోచనల' పై హక్కు చట్టాలు తేవడంతో అవి అందుబాటులో ఉన్నా కూడా ఉపయోగించలేని స్థితి ఏర్పడుతుంది. అంటే ఇతరులకు వాటి అవసరం ఉన్నా, అవి అందుబాటులోనే ఉన్నా ఈ మేధో చట్టాలు సృష్టించిన కృత్రిమ కొరత వల్ల వాటిని అందరూ వాడుకోలేరు. ఈ చట్టాలు హక్కుదారునికి తాను పేటెంట్ పొందిన ఉత్పత్తి పైన కానీ, ఉత్పత్తి ప్రక్రియ పైన కానీ 20 సంవత్సరాల పూర్తికాలపు హక్కును కల్పించి అత్యంత లాభాలను అందిస్తాయి. అదే సందర్భంలో సామాన్యునికి ప్రాణాలను రక్షించే మందులను సైతం కొనలేని స్థితిని, దేశాలకు తమ సార్వభౌమత్వాన్ని పణంగా పెట్టాల్సిన పరిస్థితినీ సృష్టిస్తాయి.

ఈ గుత్తాధిపత్య పేటెంట్ చట్టాలే పునాదులుగా ఫార్మా వ్యాపార రంగం మొత్తం నిర్మించబడింది. బయోటెక్నాలజీ పరిశ్రమలో పేటెంట్ రక్షణ కారణంగా గుత్తాధిపత్యం, దానివల్ల పొందే విపరీతమైన రాబడులు పాశ్చాత్య పెట్టుబడిదారులను చాలా సంవత్సరాలుగా ఆకర్షిస్తున్నాయి. ఎంజెన్ కంపెనీ ప్రారంభ పెట్టుబడిదారులకు కేవలం 3 సంవత్సరాలలో దాదాపు 100 రెట్ల లాభాలొచ్చాయి. జెనెన్టెక్ కంపెనీకి (ఇప్పుడు ఇది కోవిడ్ చికిత్సలో ఉపయోగించే టోసిలిజుమాబ్, కాక్టెయిల్ యాంటీబాడీ ఔషధాలను అభివృద్ధి చేసిన రోచే అనుబంధ సంస్థ)ఉన్న పేటెంట్లు వందల మిలియన్ డాలర్లను రాయల్టీగా తెచ్చిపెట్టాయి.

WTO మేధోసంపత్తి హక్కుల TRIPS ఒప్పందం రాకముందు ఔషధ ఉత్పత్తులపై పేటెంట్లు ఇవ్వాలా, వద్దా అనే ప్రశ్న ఆయా జాతీయ ప్రభుత్వాల చేతిలోనే ఉండేది. భారతదేశం వంటి కొన్ని దేశాలు గతంలో ఎటువంటి వస్తు (product) పేటెంట్లను ఇవ్వలేదు. దాంతో జెనెరిక్ మందుల కంపెనీలకు కొన్ని అత్యవసర ఔషధాలను కాపీ చేసి ఉత్పత్తి చేసే అవకాశం దొరికింది. ప్రజలకు కొంతమేరకు తక్కువ ధరలలో మందులు లభ్యమయ్యాయి. కానీ ఈ జాతీయ చట్టాలను, వాటి ప్రయోజనాలను పక్కనపెట్టి ఔషధ ఉత్పత్తులకు (Product) మరియు ఉత్పత్తి ప్రక్రియ (process) లకు కూడా పేటెంట్లను వర్తించేలా TRIPS ఒప్పందాన్ని WTO సభ్యదేశాలపై రుద్దింది. ఈ సభ్యదేశాల 'ఉమ్మడి చట్టాలను' అమలుచేయని దేశాలు కఠినమైన ఆంక్షలు (sanctions), వివాద పరిష్కార 'యంత్రాంగం' ద్వారా ఎదుర్కోవలసి వుంటుంది.

ట్రిప్స్ ఒప్పందం సామ్రాజ్యవాద దేశాలకు అనుకూలంగా చట్టబద్ధమైన అవకాశాలను కలిగించినప్పటికీ, అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రజలు చేసిన అనేక పోరాటాలవల్ల దోహా డిక్లరేషన్ ద్వారా ఓ రక్షణ పొందగలిగారు. అదే అత్యవసర లైసెన్సింగ్ విధానం (compulsory license). ఏ దేశమైనా అత్యవసర పరిస్థితులలో పేటెంట్లను పక్కన పెట్టవచ్చు. దీనినే 'ట్రిప్స్ ఫ్లెక్సిబిలిటి' అన్నారు. ఈ చిన్న వెసులుబాటు కూడా అమెరికా ఇష్టానికి విరుద్ధంగా ఉంది కాబట్టి, అభివృద్ధిచెందుతున్న దేశాలను ఎప్పుడూ ట్రిప్స్ ఫ్లెక్సిబిలిటీని ఉపయోగించకుండా బెదిరించడానికి అమెరికా స్పెషల్ 301 నివేదికను రూపొందించడం మొదలుపెట్టింది.

వాస్తవానికి 1970లో పేటెంట్ల చట్టం ప్రారంభమైనప్పటి నుంచి, ఈ అత్యవసర లైసెన్సింగ్ అత్యల్పంగానే వినియోగించబడింది. పేటెంట్స్ చట్టం ప్రవేశపెట్టిన మొదటి నాలుగు దశాబ్దాలలో, భారతదేశం నుంచి ఈ తప్పనిసరి లైసెన్స్ కోసం ఒక్కసారి కూడా దరఖాస్తు చేసుకోలేదు.

1995-2006 మధ్య నమోదైన 80 శాతం కంటే ఎక్కువ ఫార్మాస్యూటికల్, ఫార్మా-కెమికల్, బయో - టెక్నికల్ పేటెంట్ దరఖాస్తులు కేవలం ఆరు దేశాలనుండి - అమెరికా, జపాన్, జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్ మరియు స్విట్జర్లాండ్-మాత్రమే ఉన్నాయి. అంటే కేవలం 5-6 దేశాల సామ్రాజ్యవాద గుత్తాధిపత్యాన్ని కాపాడటానికి వచ్చినవే ఈ ట్రిప్స్, పేటెంట్ చట్టాలన్నమాట!

పేటెంట్లకు ద్వైపాక్షిక మరియు ప్రాంతీయ ఒప్పందాలు జోడించబడ్డాయి.

ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందాలు (Bilateral Investment Treaties, BITs), ప్రభుత్వాల మధ్య ఒప్పందాలు, ఇవి మెల్లగా కనుమరుగవుతున్నాయి. సామ్రాజ్యవాద కంపెనీలు, 'పెట్టుబడిదారులు- దేశాల వివాద పరిష్కార (Investor-State Dispute Settlement ఐ.ఎస్.డి.ఎస్) ఒప్పందాల' వైపు మొగ్గుచూపుతున్నాయి. ఇక్కడ పెట్టుబడిదారుడు తన మాతృదేశ మధ్యవర్తిత్వం లేకుండానే నేరుగా మరొక దేశంపై పెత్తనం చేయవచ్చు, దావాలు వేయవచ్చు.

## మందుల పేర దాస్య శృంఖలాలలోకి నెట్టబడుతున్న ప్రభుత్వాలు

దీర్ఘకాలిక కాలేయ వ్యాధి అయిన హెపటైటిస్-సి చికిత్సకు గిలియడ్ సైన్సెస్ కంపెనీ (రెమ్‌డెసివియర్‌ని కూడా ఇదే తయారుచేసింది) సోవాల్డి (సఫోస్బువియర్) అనే ఔషధాన్ని అభివృద్ధి చేసింది. అమెరికాలో ఒక్క మాత్రకు ($ 1,000, నెలకు $ 60,000-80,000 (రూ. నెలకు 42-56 లక్షలు) ఖర్చవుతుంది. (అత్యంత ధనిక దేశమైన అమెరికాలో సగటు నెల జీతం $2500)పేదదేశాలలో అమ్మకానికి భారతదేశపు జెనెరిక్ మందుల కంపెనీలకు గిలియడ్ సంస్థ లైసెన్స్‌లు ఇచ్చింది. కానీ ఉక్రెయిన్ లాంటి మధ్యతరహా ఆదాయ దేశాలలో అమ్మడానికి వీలులేదు.

తమ గుత్తాధిపత్య ధరలకు ఈ అత్యవసర లైసెన్సు అడ్డువస్తుంది కనుక నయా ఉదారవాదం ముసుగులో ఉక్రెయిన్ లాంటి దేశాలలో మరో క్రొత్త ఒప్పందాన్ని రుద్దింది. ఈ విధానం ప్రకారం ఆయా దేశాలలో ఏ ఔషధమైనా అది రిజిస్టర్ అయిన తేదీనుంచి 5 ఏళ్ళ వరకు దాని జెనెరిక్ ఔషధాన్ని రిజిస్టరు చేయడానికి వీలులేదు. అంటే ఇతర దేశాలలో ఆ ఔషధం తక్కువ ధరలకు అందుబాటులో ఉన్నా కొనుక్కోవడానికి వీలులేదు. అంటే 5 ఏళ్ళ వరకు గుత్తాధిపత్యం అన్నమాట.

ఉక్రెయిన్‌లో 20 లక్షల మంది హెపటైటిస్-సి తో బాధపడుతున్నారు. సగటు అమెరికా పౌరుడు కూడా కొనలేని ఆ ధరలను ఉక్రెయిన్ భరించలేక ఈజిప్ట్ జెనెరిక్ కంపెనీకి అత్యవసర లైసెన్సు మంజూరు చేసింది. గిలియడ్‌కు ఆ మందుపై ఉక్రెయిన్‌లో పేటెంట్ కూడా లేదు. అయినా స్థానిక కోర్టులలో 80 కోట్ల డాలర్లకు (5600 కోట్ల రూపాయలు) నష్టపరిహారం వేసింది గిలియడ్ సంస్థ. కోర్టులలో సానుకూల స్పందన రాకపోవడంతో అమెరికా - ఉక్రెయిన్ ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందాల (BIT) కింద వివాద పరిష్కారానికి తెరతీసింది. తప్పని పరిస్థితుల్లో ఉక్రెయిన్ కోర్టుల వెలుపల వివాదాన్ని పరిష్కరించుకోవలసి వచ్చింది.

యుఎస్ సిగరెట్ తయారీదారు ఫిలిప్ మోరిస్ (ఫోర్ స్క్వేర్, మార్ల్ బోరో), సిగరెట్లపై పొగాకు హెచ్చరికలు, సాదా ప్యాకింగ్ వంటి నియమాలు ట్రేడ్ మార్క్‌ల ఉల్లంఘనలే అని, ట్రేడ్ మార్క్‌లు పెట్టుబడులకు సమానమని, ఈ నియమాలు వాటికి విఘాతం కలిగించాయని ఆరోపిస్తూ ఉరుగ్వే, ఆస్ట్రేలియాలపై కేసులు దాఖలు చేసింది. ఈ సంస్థ రెండు దేశాలలో కూడా ఓడిపోయింది. కానీ రెండు దేశాల ప్రభుత్వాలు కోర్టులలో పోరాడటానికి కోట్ల రూపాయలు ఖర్చు చేయవలసి వచ్చింది.

బిగ్ ఫార్మా, పేటెంట్ ఉపసంహరణను ఆస్తి హక్కు లాక్కోవడంగా ప్రచారం చేస్తుంది. కెనడా పేటెంట్ చట్టం ప్రకారం పేటెంట్ పొందిన ఔషధ 'ఉపయోగాన్ని' నిరూపించాలి. ఇందులో విఫలమైన కారణంగా రెండు ఔషధాలపై ఎలీ లిల్లీ కంపెనీ పేటెంట్లను కెనడా రద్దు చేసినప్పుడు -- ఇది తమ ఆస్తి హక్కు ఉల్లంఘనే అనీ, WTO TRIPS ఒప్పందం, NAFTA మేధో సంపత్తి హక్కులు, పేటెంట్ సహకార ఒప్పందం, మేధో సంపత్తి రక్షణ కోసం పారిస్ కన్వెన్షన్ ఒప్పందాలను ఉల్లంఘించారని ఆరోపిస్తూ 50 కోట్ల కెనడా డాలర్ల పరిహారం ఇవ్వాలని ఎలీ లిల్లీ వారు డిమాండ్ చేశారు. ఎలీ ఈ కేసును ఓడిపోయింది. ప్రజల ఉద్యమాలే ఈ తీర్పుకు దారితీసాయి.

కొలంబియా ప్రభుత్వం నోవార్టిస్ తయారుచేసే క్యాన్సర్ ఔషధం, ఇమాటినిబ్ ధరలను తగ్గించాలని ఆదేశించింది. దానిపై నోవార్టిస్ స్విస్-కొలంబియన్ ద్వైపాక్షిక పెట్టుబడుల ఒడంబడిక (BIT) వివాదంగా చూపుతానని బెదిరించి 'దారికి' తెచ్చుకుంది.

అబట్ కంపెనీ తన హెచ్ఐవి ఔషధం కలిట్రా (లోపినావిర్/రిటోనావిర్) ధర తగ్గించకుండా వుండడానికి మార్కెట్ నుండి జనరిక్ వెర్షన్లను బ్లాక్ చేయాలని థాయిలాండ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. థాయ్‌లాండ్‌ను తన కాళ్ళ బేరానికి తెచ్చుకోవడానికి క్యాన్సర్ ఔషధంతో సహా మరో ఆరు అత్యవసర ఔషధాలను నిలిపి వేసింది. ఇందులో 'అలూవియా', వేడిని తట్టుకోగల కొత్త కలిట్రా కూడా ఉంది. థాయ్‌లాండ్ వంటి ఉష్ణమండల దేశానికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది. ఎనిమిది సంవత్సరాల లాబీయింగ్ తరువాత, థాయ్ ప్రభుత్వం రెండు యాంటీరెట్రో వైరల్ ఔషధాలు - అబట్ కలిట్రా, మెర్క్ ఎఫావిరెంజ్ లకూ, సనోఫీ - అవెంటిస్ గుండె మందు అయిన క్లోపిడెగ్రెల్‌కు అత్యవసర లైసెన్స్‌లను జారీచేసింది.

థాయ్‌లాండ్ ప్రభుత్వం ఈ లైసెన్సు ఇవ్వకుండా ఉండడానికి అమెరికా, స్విస్ రాయబారుల నుండే కాకుండా థాయ్ ఫార్మాస్యూటికల్ రీసెర్చ్ అండ్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (PReMA) నుండి కూడా తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంది. ఒక్క కలిట్రాకు అత్యవసర లైసెన్స్ జారీచేయడం వల్లే థాయ్‌లాండ్‌కు సంవత్సరానికి రూ.170 కోట్లు ఆదా అవుతుంది. యుఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ ఆఫీస్ (USTR) థాయ్‌లాండ్‌ను తమ '301 నివేదికలో' "వాచ్ లిస్ట్" నుండి "ప్రాధాన్యత వాచ్ లిస్ట్"కు మార్చింది. ఈ 'నివేదిక' గురించి క్రింద చూద్దాం.

మెర్క్ ఎఫావిరెంజ్ ధర $43 తో పోలిస్తే రాన్ బాక్సీ జనరిక్ ధర సగం $20. అంటే సంవత్సరానికి అదనంగా 20,000 మంది రోగులకు చికిత్స చేయవచ్చు. అత్యవసర లైసెన్స్ జారీకి ఎంత శక్తి ఉందో ఋజువు చేసేలా మెర్క్, అబట్ రెండూ తమ ధరలను గణనీయంగా తగ్గించాయి.

మెర్క్ బ్రెజిల్ ప్రభుత్వానికి ఎఫావిరెంజ్ ఔషధాన్ని థాయ్ ధరకే విక్రయించడానికి మెర్క్ నిరాకరించడంతో బ్రెజిల్ ప్రభుత్వం కూడా అత్యవసర లైసెన్స్ జారీచేస్తానని ప్రకటించింది. ఎఫావిరెంజ్ ప్రస్తుతం బ్రెజిల్‌లో 75,000 మంది రోగులచే ఉపయోగించబడుతోంది, బ్రెజిల్ ప్రభుత్వానికి సంవత్సరానికి 4.4 కోట్ల డాలర్లు ఖర్చు అవుతుంది.

## కథలో మలుపు

థాయ్‌లాండ్ వ్యవహారంతో ప్రపంచవ్యాప్తంగా ఉద్యమాలు తలెత్తడంతో పోయిన ప్రతిష్టను తిరిగి పొందడానికి అబట్ థాయ్‌లాండ్‌లో మరియు ఇంకో 40 పేద, పేద-మధ్య తరహా దేశాలలో కలిట్రా ధరను, ఖర్చును సగానికి పైగా తగ్గిస్తానని ప్రకటించింది.

వాస్తవం ఏంటంటే ఈ 40 దేశాలలో చాలా వాటిల్లో కలిట్రా నమోదు చేయబడలేదు, అంటే ఔషధం అక్కడ అందుబాటులో ఉండదు. అందుబాటులో లేని మందులకు ధరలు తగ్గించారన్నమాట! డబ్ల్యుటివో చట్టాల ప్రకారం అత్యవసర లైసెన్స్ జారీ చేసే హక్కు థాయ్‌లాండ్‌కు ఉన్నప్పటికీ, అందరి ఆరోగ్యాన్ని కాపాడడమే తన భాధ్యతగా తెరపైకి వచ్చిన డబ్ల్యు.హెచ్.వో (అప్పటి అధిపతి) కూడా థాయ్‌లాండ్ చర్యను ఖండించింది. అంతర్జాతీయ సంస్థలని చెప్పుకునే ఈ సంస్థలన్నీ కూడా పెట్టుబడిదారీ దేశాల లాభాల కోసం నయా ఉదారవాద విధానాలను వారి పనుపున అమలు చేయడానికి ఉన్నవే నని ఈ వ్యవహారం ఋజువు చేస్తుంది.

అమెరికాకు అత్యవసర లైసెన్సులు ఇవ్వడానికి 15 వేర్వేరు చట్టాలే ఉన్నాయి. ఇప్పటివరకు, అత్యవసర లైసెన్స్‌లను అత్యంత తరచుగా ఉపయోగించిన దేశం అదే. దానిపైన ఏ అంతర్జాతీయ సంస్థ నోరు మెదపదు. పైగా ఇది ఇతర దేశాలను ఆంక్షలతో బెదిరిస్తుంది. W.T.O వివిధ దేశాలకు ఎన్ని వెసులుబాట్లు ఇచ్చానని చెప్పినా, 1995 మరియు 2011 మధ్య, 15 ఏళ్ళలో, ప్రపంచవ్యాప్తంగా కేవలం 12 అత్యవసర లైసెన్స్ లు మాత్రమే మంజూరు చేయబడ్డాయి. అంటే అమెరికా వంటి పెట్టుబడిదారీ దేశాలు బడా ఫార్మా కంపెనీలు ఎంతగా బెదిరిస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు.

## అమెరికా స్పెషల్ 301 రిపోర్ట్

1989 సం॥ నుండి అమెరికా చట్టసభల ఆమోదంతో ఒక వార్షిక నివేదిక జారీచేయడం జరుగుతోంది. అదే యూఎస్‌టిఆర్ స్పెషల్ 301 రిపోర్ట్. ప్రపంచంలోని వివిధ దేశాల్లో వుండే మేధో సంపత్తి హక్కులు, వాటిలో భాగమైన ట్రేడ్ మార్క్‌లు, పేటెంట్‌లు, కాపీ రైట్‌లు, ట్రేడ్ సీక్రెట్‌లు మొదలగు వాటివలన అమెరికా కంపెనీలు, ఉత్పత్తులు ఏవైనా వాణిజ్యపర అడ్డంకులు ఏఏ దేశాలనుంచి ఎంతగా ఎదుర్కొంటున్నాయో ఆ దేశాల జాబితాతో ఈ రిపోర్ట్ తయారు చేస్తారు. ఈ జాబితా ఆధారంగా అమెరికా ఏకపక్షంగా ఆ దేశాలమీద వాణిజ్య ఆంక్షలు అమలు చేస్తుంది.

1991 సం॥లో స్పెషల్ 301 రిపోర్ట్‌లో 'నిఘా పెట్టాల్సిన విదేశాల' జాబితాలో మొదటిసారిగా భారతదేశం చేర్చబడింది. ఈ చేరిక ఆధారంగా ఏప్రిల్, 1992 సం.లో భారత దేశానికి వున్న ఉచిత పన్నుల వెసులుబాటును (duty-free privileges) రద్దు చేశారు. ప్రధానంగా ఔషధ పరిశ్రమలు, కెమికల్సు సంబంధిత ఉత్పత్తులకు ఈ రద్దు అమలైంది. 27 సంవత్సరాలుగా భారతదేశం ఈ 'నిఘా పెట్టాల్సిన దేశాల జాబితా'లో కొనసాగుతోంది. 2012 సం.లో మొట్టమొదటిసారి కంపల్సరీ లైసెన్సును జారీ చేసినప్పటికీ, మళ్ళీ అలా చేసే సాహసానికి పూనుకోలేదు.

2012 సం.లో వాణిజ్యేతర ప్రభుత్వ ప్రజా అవసరాలకోసం కంపల్సరీ లైసెన్స్ జారీ చేసినందుకుగాను, మరో దేశమైన ఇండోనేషియాను 301 'నిఘా జాబితా'లో 2013-2017 సం. వరకు ఉంచారు.

ఏ దేశమైనా తమ ప్రజారోగ్యం పెంపొందించుకోవడానికి సామ్రాజ్యవాద దేశాలకు వ్యతిరేకంగా తమ చట్టపరమైన హక్కును వినియోగించ ప్రయత్నిస్తే ఆ దేశం ఈ స్పెషల్ 301 నివేదికలో చేర్చబడుతుంది. ఈ నివేదికలో పేరు రావడం అంటేనే ఆంక్షలు విధించడం గాను, అనుచిత హెచ్చరిక జారీ చేసినట్టుగాను భావింప బడుతుంది. ప్రతి సంవత్సరం అమెరికా ఈ యు.ఎస్.టి.ఆర్ స్పెషల్ 301 నివేదికను సమీక్షించే సమయం దగ్గరపడే కొద్దీ వివిధ దేశాలు తమ మేధో సంపత్తి హక్కుల చట్టాలలో సవరణలు చేయడమో, కొందరు నకిలీలను జైలు పాలు చేయడమో, అపరాధ రుసుములు పెంచడమో లేక మరోరకమైన చర్యలతో హడావుడి చేస్తూ తాము అమెరికా మేధో సంపత్తి హక్కును గౌరవిస్తున్నామని తమ చిత్తశుద్ధి చాటుకోవడానికి ప్రయత్నిస్తుంటాయి.

## సామ్రాజ్యవాదుల ఆయుధాలుగా ఒడంబడికలు

జాతీయ ఆరోగ్య విధానాలకు సవాళ్ళుగా ఉన్నది ఐ.ఎస్. డి.స (ఇన్వెస్టర్- స్టేట్ డిస్ప్యూట్ సెటిల్మెంట్) లోని మేధో సంపద' నియమాలు మాత్రమే కాదు. పబ్లిక్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రైవేటీకరణను అడ్డుకో ప్రయత్నించిన పోలాండ్ దేశాన్ని బెదిరించడానికి, ఆరోగ్య సమస్యలకు కారకమైన కెమికల్స్‌ను నియంత్రించేందుకు ప్రయత్నించిన కెనడాను నిలువరించడానికి పెట్టుబడి నిబంధనలను వాడుకొన్నారు. ఆయా దేశాల ప్రభుత్వాలు తమ దేశ సరిహద్దులలో పనిచేసే కంపెనీల పనితీరును అదుపుచేసే ప్రయత్నాలను పెట్టుబడిదారులు బి.ఐ.టి (ద్వైపాక్షిక పెట్టుబడుల ఒడంబడిక), ఎఫ్.టి.ఏ (స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాలు) వంటి పెట్టుబడిదారీ వివాద పరిష్కార ఒడంబడికలలో పొందుపరచిన హక్కులతో అడ్డుకుంటున్నారు.

పోలాండ్, నెదర్లాండ్ దేశాల ద్వైపాక్షిక పెట్టుబడుల ఒడంబడిక ఆధారంగా 2003 సం.లో యురేకో కంపెనీ, పోలాండ్ మీద UNCITRAL (యునైటెడ్ నేషన్ కమిషన్ ఆన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ లా) ఆర్బిట్రేషన్‌ని లేవనెత్తింది. మార్కెట్ పరిస్థితులు బాగాలేదనే సాకుతో పోలాండ్ ప్రజలకు షేర్ జారీ చేయకుండా వాయిదా వేస్తోందని యురేకో ఆరోపించి 1260 కోట్ల డాలర్ల నష్టపరిహారాన్ని కోరింది. ఎనిమిది సంవత్సరాల సుదీర్ఘ పోరాటం తర్వాత పోలాండ్ 2009 సం॥లో ఇన్సూరెన్స్ కంపెనీని ప్రైవేటీకరించడం ద్వారా మాత్రమే వివాదాన్ని పరిష్కరించుకుంది.

నెలకు రు.2 .84 లక్షలు ఖరీదు చేసే బేయర్ కంపెనీకి చెందిన లివర్, కిడ్నీ కాన్సర్ మందు, నెక్సవర్‌పై 2011 సం.లో కంపల్సరీ లైసెన్స్ విధానంలో అప్లికేషన్ పెట్టి భారత్ కంపెనీ నాట్కో విజయం సాధించింది. కంపల్సరీ లైసెన్స్ కింద నాట్కో , బేయర్‌కు 6 శాతం రాయల్టీ చెల్లిస్తూ కూడా నెలకు రోగులకు అవసరమయ్యే మందులను రు.8,800 లకే అమ్మింది. నెక్సవర్ లైసెన్స్ ప్రపంచంలోనే మొదటి "మార్కెట్ చొరవతో పొందిన కంపల్సరీ లైసెన్స్" గావడంతో అమెరికా నుండి తీవ్ర ఆగ్రహావేశాలను ఎదుర్కోవాల్సి వచ్చింది. అప్పటినుండి కొన్నిఏళ్లుగా సెక్షన్ 84 (మార్కెట్ చొరవతో కంపల్సరీ లైసెన్స్) క్రింద రెండంటే రెండు అప్లికేషన్‌లు మాత్రమే వచ్చాయి. ఒకటి, భారత జనెరిక్ కంపెని బి.డి.ఆర్ ఫార్మా రోజుకు 108 డాలర్లు ఖరీదు చేసే బ్రిస్టల్ మైయర్స్ స్క్విబ్ బ్లడ్ కాన్సర్ మందు దాస్తానిబ్ కోసం అప్లికేషన్ పెట్టింది. రెండు, ఆస్ట్రాజెనెకా డయాబెటిక్ మందు సాక్సగ్లిప్టిన్ కోసం 'లీ ఫార్మా లిమిటెడ్' అప్లికేషన్ పెట్టింది. ఈ రెండింటిని కూడా భారత పేటెంట్ ఆఫీస్ తిరస్కరించింది.

పేటెంట్ మందులకు కంపల్సరీ లైసెన్స్‌లు జారీ చేయడంలో కఠిన వైఖరి అవలంబిస్తామని భారతప్రభుత్వం యూ.ఎస్.టి.ఆర్‌కు వ్యక్తిగతంగా హామీ ఇచ్చిందనే ఆరోపణలు ఉన్నాయి.

## ఐ.ఎస్.డి.ఎస్ కు వ్యతిరేకంగా నిరసన గళాలు

ఆస్ట్రేలియా లాంటి అభివృద్ధి చెందిన దేశాలు మొదలుకొని దక్షిణ కొరియా న్యాయమూర్తుల దాకా ఎందరో ఐ.ఎస్.డి.ఎస్‌కు వ్యతిరేకంగా తమ దేశాల సార్వభౌమత్వానికి ప్రమాదకరమని నిరసన గళాలు వినిపించారు.

అమెరికా, యూరోప్ యూనియన్ మధ్య ఐ.ఎస్.డి.ఎస్ కోసం అమెరికా ఒత్తిడి చేయడంతో యూరోప్ యూనియన్ వెనకడుగు వేసింది.

ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూ.టి.ఓ)లో ఐ.ఎస్.డి.ఎస్‌ను చేర్చాలన్న కెనడా, యూరోప్ యూనియన్ ల ఒత్తిడిని భారతదేశం, బ్రెజిల్, జపాన్, అర్జెంటీనాలు తిరస్కరించాయి.

సౌత్‌ఆఫ్రికా, ఇండోనేషియాలు ద్వైపాక్షిక పెట్టుబడుల ఒడంబడిక (బి.ఐ.టి)ల నుండి వైదొలగి, జాతీయ పెట్టుబడిదారుల రక్షణ చట్టాలకు మళ్లుతున్నాయి.

"ద్వైపాక్షిక, బహుళపాక్షిక పెట్టుబడి ఒడంబడికలు తీవ్ర పేదరిక సమస్యను పెంచేవిగాను, విదేశీ అప్పులపై న్యాయంగా, సహేతుకంగా చర్చించే అవకాశాలను స్తంభింప చేసేవిగానూ, మూలవాసులు, మైనారిటీలు, దివ్యాంగులు, వృద్ధులు, అరక్షితులైన ఇతర ప్రజల హక్కులను కాలరాసి వారి జీవితాలను అగమ్యగోచరంగా చేసేవిగాను వున్నాయి అనుకోవడంలో న్యాయముందని" ఐక్యరాజ్యసమితి నిపుణులు పేర్కొన్నారు.

"ఈ దోపిడీ దొంగల్లాంటి పెట్టుబడిదారులు, సట్టావ్యాపారులు, ట్రాన్స్ (మల్టీ) నేషనల్ కంపెనీల నుండి దేశాలు, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు, వాటి ప్రజలకే రక్షణ కావాలి. అవి పనికిమాలిన, విసుగు విరామం లేని అతి ఖరీదైన వ్యాజ్యాలలోకి లాగడానికి ఏ మాత్రం సంకోచించవు. కోట్ల డాలర్లు వ్యాజ్యాల మీద ఖర్చుచేసి వేల కోట్ల డాలర్లు పరిహారంగా పొందుతారు." అని కూడా వాళ్ళు చెప్పారు.

ఈ మహామహులు ఇంత చెప్పారే గాని వాటి రద్దుకు మాత్రం పిలుపునివ్వలేదు. ద్వైపాక్షిక (బి.ఐ.టి), స్వేచ్ఛా వాణిజ్యా (ఎఫ్.టి.ఏ)లలో సంస్కరణలు కావాలని సూచించారు.

## భారతీయ ఫార్మా X బడా ఫార్మా

వస్తువు (Product) మీద పేటెంట్‌లను మినహాయించిన ఇండియన్ పేటెంట్ యాక్ట్, 1970 వల్ల భారత ఔషధ పరిశ్రమ పెరిగింది. కానీ ట్రిప్స్ ఒడంబడిక దానికి ఓ కుదుపునిచ్చింది. దానికి తోడు భారతదేశంలో కంపల్సరీ లైసెన్స్ అప్లికేషన్‌లను తిరస్కరించడం ఒక ధోరణిగా మారడం,స్థానిక జనరిక్ ఔషధ తయారీదారులకు ప్రతికూలంగా మారింది.

ట్రిప్స్ ప్రకారం 2005 సం.లో పేటెంట్ చట్టంలో సవరణలు చేశారు. అయితే ఆ సవరణలలో ఒక నిబంధన చేర్చబడింది. దాని ప్రకారం పేటెంట్ అప్లికేషన్ ఆమోదం పొందేందుకు ముందు కానీ, ఆమోదం పొందాక కానీ ఎవరైనా వ్యతిరేకించవచ్చు. బడా ఫార్మాలు తీవ్రంగా ప్రతిఘటించినప్పటికీ భారత ఫార్మా ఈ సవరణను చేర్చడంలో విజయం సాధించింది.

పేటెంట్ అప్లికేషన్‌ను సమర్పించిన 18 నెలల కాలం పూర్తయిన తర్వాత అది అధికారికంగా ప్రచురణకు నోచుకుంటుంది. దరఖాస్తుదారు తన అప్లికేషన్‌లో ఏమైనా మార్పులు చేసుకోవాలనుకుంటే అవకాశం కల్పించడానికే ఈ కాల వ్యవధి ఇవ్వబడింది. ప్రచురించబడిన తరవాత ఎవరైనా సరే నిర్దిష్ట ప్రాతిపదికల మీద దాన్ని వ్యతిరేకించ వచ్చును. ఈ వ్యతిరేకించడాన్నే 'ఆమోద పూర్వ వ్యతిరేకత' (pre-grant opposition) అంటారు. పేటెంట్‌ను జారీచేసిన తేదీ నుండి 12 నెలల లోపల కూడా వ్యతిరేకించ వచ్చును. దాన్ని 'ఆమోదానంతర వ్యతిరేకత' (post-grant opposition) అంటారు. ఆమోదం పొందిన తర్వాత వ్యతిరేకించే ప్రక్రియ వలన ఆ పేటెంట్ దారుడు, పేటెంటుతో పాటు అన్ని హక్కులు కోల్పో వచ్చును. ఆమోదానికి ముందు వ్యతిరేకించడం వలన దరఖాస్తుదారుడికి పేటెంట్ రాకుండా అడ్డుపడవచ్చును.

భారత ఔషధ పరిశ్రమలు ఈ నిబంధనలో గల గొప్ప అవకాశాలను గుర్తించాయి. పేటెంట్‌ను వ్యతిరేకించడానికి పలు కారణాలు వుండవచ్చును. ఉదాహరణకు బాస్మతి, వేప, పసుపుపై పేటెంట్‌లను మనం అవి భారతీయ సాంప్రదాయక జ్ఞానంలో భాగమైనవని చెప్పి వ్యతిరేకించడం జరిగింది. అదేవిధంగా పేటెంట్ ఉల్లంఘన దావాల నుండి కాపాడుకోవడానికి కూడా జెనెరిక్ కంపెనీలు ఈ చట్టంలోని 'పేటెంట్ వ్యతిరేకతను' లేవనెత్తుతాయి. ఒక పేటెంట్ ను చెల్లుబాటు కాకుండా చేయడానికి లేదా రద్దు చేయడానికి దాన్ని 'వ్యతిరేకించడ' మనేది మార్గంగా మారింది.

చాలామటుకు పేటెంట్ అప్లికేషన్‌లు పేటెంట్ పొందడానికి ఎటువంటి అర్హత లేనివిగాను, పనికిమాలినవిగాను ఉంటున్నాయి. 1995-2004 మధ్య పది సంవత్సరాల కాలవ్యవధిలో దరఖాస్తు చేసుకొన్న 6000 ఔషధ పేటెంట్ అప్లికేషన్‌లలో 250 మాత్రమే వాస్తవిక ఔషధాలుగా తేలాయి. ఎదో ఒక కెమికల్ కాంపౌండ్ రాకపోతుందా అని కంపెనీలు అప్లికేషన్‌లు వేసాయి. తప్పుడు పేటెంట్ కనుక జారీ అయితే అది న్యాయమైన పోటీని నివారించి, అనవసరమైన గుత్తాధిపత్యాన్ని కట్టబెడుతుంది.

మొట్టమొదటిసారి ఈ 'పేటెంట్ వ్యతిరేకత' రోచె అనే స్విస్ కంపెనీ హెపటైటిస్-బి, హెపటైటిస్-సి ల చికిత్సకు పేటెంట్ చేసిన పెగాసిస్ అనే మందుపై వేయబడింది. ఈ మందు ఇతర వేరియంట్లతో దీనిని పోలిస్తే సమర్ధవంతంగా లేదని గుర్తించడం వలన, ఈ నిబంధన ప్రకారం ఆ పేటెంట్ రద్దు చేయబడింది.

కాన్సర్ చికిత్స కోసం నెలకు రు.1లక్ష 25వేల ఖరీదు చేసే గ్లివేక్ అనే మందుపై పేటెంట్ సంపాదించి, గుత్త మార్కెటింగ్ హక్కులను నోవార్టిస్ కంపెనీ నవంబర్, 2003 సం॥లో పొందింది. దీనితో నెలకు రు.6,000లకే దొరికే జనరిక్ మందు లభ్యత ప్రమాదంలో పడింది.

కాన్సర్ పేషెంట్‌ల సహాయ సంస్థ (కాన్సర్ పేషెంట్స్ ఎయిడ్ అసోసియేషన్) ఈ 'పేటెంట్ ఆమోద పూర్వ వ్యతిరేకత' దావా వేయడంతో ఆ పేటెంట్‌తో పాటు, ప్రత్యేక మార్కెటింగ్ హక్కులు కూడా రద్దు చేయబడ్డాయి.

'ఉత్పత్తి ప్రక్రియ' పేటెంట్‌ల నుండి 'ఉత్పత్తి (ప్రాడక్ట్) మీద పేటెంట్'ల విధానంలోకి భారతదేశం మారడం వలన, భారత ఔషధ పరిశ్రమలకూ, బడా ఔషధ పరిశ్రమల మధ్య సాగబోయే దీర్ఘకాల యుద్ధంలో ఈ అవకాశం ప్రధానమైనదిగా మారింది.

ఈ 'వెసులుబాటు' రాక ముందు భారత ప్రభుత్వం (దేశీయ పరిశ్రమల తరఫున) బడా కంపెనీలతో పేటెంట్‌లపై పోరాడాల్సి వచ్చేది. ఈ చట్ట వెసులబాటుతో జాతీయ ఔషధ పరిశ్రమలు బహుళజాతి పరిశ్రమలతో నేరుగా తలపడుతున్నాయి. ఇక్కడ ప్రజల ఆరోగ్యంతో, ఆకాంక్షలతో ఎవ్వరికీ పనిలేదు. ఎవరి లాభాల కోసం వారు తలబడతారన్నమాట.

పేటెంట్ దావాలను వేయడం ప్రధాన ఎత్తుగడగా భారత జనరిక్ ఔషధ పరిశ్రమలు నేడు ముందుకెళ్తున్నాయి.

బెయెర్ కిడ్నీ కాన్సర్ ఔషధం నెక్సవర్ పై కంపల్సరీ లైసెన్స్ పొందిన నాట్కో దాన్ని నెలకు రు.8,800లకు అమ్ముతోంది. బెయెర్స్ కంపెనీకి 6 శాతం రాయల్టీ చెల్లిస్తోంది. సిప్లా కంపెనీ, కంపల్సరీ లైసెన్సు తీసుకోకుండానే అదే మందుకు జనరిక్ తీసుకు వచ్చి నాట్కో కన్నా తక్కువగా నెలకు రు.6,500కే విడుదల చేసింది, అదేవిధంగా ఆస్ట్రా జెనెకా లంగ్ కాన్సర్ మందు ఇరెస్సా (జెఫీటినిబ్) జనరిక్‌ను 60శాతం తక్కువగా రు.4,250 లకే విడుదల చేసింది; అదేవిధంగా 2008 సం.లో విడుదల చేసిన జెనెటిక్ & రోచెల కాన్సర్ చికిత్స మందు టర్సీవ (ఎర్లో టినిబ్) జనరిక్‌ను మూడవవంతు ధరకే అందించింది. వీటన్నింటిలోనూ సిప్లా 'పేటెంట్ ఆమోద వ్యతిరేక' చట్టాల వెసులుబాటు తోనే ముందుకెళ్లింది.

'పేటెంట్ ఆమోద పూర్వ వ్యతిరేకత' ద్వారా ఆస్ట్రా జెనెకా (యు.కె) వారి కొలెస్ట్రాల్ తగ్గించే "క్రెస్టర్"ను టొరెంట్ ఫార్మస్యూటికల్స్ (అహమ్మదాబాద్), ఎలి లిల్లీ (అమెరికా) వారి "సియాలిస్"ను ముంబైకు చెందిన అజంతా ఫార్మా, ఫైజర్ (అమెరికా) వారి యాంటీ ఫంగల్ "వీ ఫెండ్"ను న్యూ ఢిల్లీకి చెందిన రాన్‌బాక్సీ లాబొరేటరీస్ సవాలు చేస్తున్నాయి.

భారతదేశంలో 'పేటెంట్ ఆమోదానంతర వ్యతిరేకత' కేసులలో హెపటైటిస్- సి మందు "పెగసిస్" మీద రోచె కంపెనీ పేటెంట్ ను ముంబైకు చెందిన వాక్‌హర్ట్ (wockhardt) కంపెనీ, బర్డ్ ఫ్లూ మందు 'ఒసల్ టమివీయర్' మీద గిలియడ్-రోచె లకు సంయుక్తంగా ఇచ్చిన పేటెంట్‌ను ముంబైకు చెందిన మేడి టాబ్ స్పెషలిటీస్, యాంటీ-ఇన్ఫెక్షన్ మందు "వేల్ సైట్" మీద రోచె కు పేటెంట్ ఇవ్వడాన్ని రాన్ బాక్సీలు సవాలు చేశాయి.

ఈ పేటెంట్ యుద్ధం, బహుళజాతి సంస్థల మీద మాత్రమే జరగడం లేదు. వందకోట్లకు పైగా జనాభా గల భారతదేశంలో ఆధిపత్యం కోసం స్వదేశీ కంపెనీలు కూడా ఒకరి మీద ఒకరు దావాలు వేసుకొంటున్నాయి. ఉదా: యాంటీ-బాక్టీరియల్ మందు "నాడిఫ్లక్ససిన్" మీద వాక్ హర్ట్ కంపెనీ పేటెంట్ అప్లికేషన్‌ను సిప్లా, హెటెరోలు వ్యతిరేకించాయి. భారత దేశానికి చెందిన ప్రముఖ ఫార్మాస్యూటికల్ కంపెనీలు రాన్ బాక్సీ లాబొరేటరీస్, సిప్లాలు దాదాపు 70 పేటెంట్ వ్యతిరేక దావాలు వేశాయి (రాన్ బాక్సీ-55, సిప్లా-15). వాటిలో కొన్ని పరస్పరం వ్యతిరేకంగాను, కొన్ని ఇతర స్వదేశీ కంపెనీలకు వ్యతిరేకంగాను వున్నాయి.

అమెరికాలోని బడా ఫార్మా కంపెనీల అనుకూల పేటెంట్ వ్యవస్థ స్వల్పమైన మార్పులను కూడా పేటెంట్ చేసుకొనే అవకాశం కల్పిస్తోంది. దీన్నే నిత్య హరితం (ఎవర్ గ్రీనింగ్) అంటారు. ఇది పశ్చిమ దేశాల్లో సాధారణం. కానీ భారతదేశం పేటెంట్ చట్టాలు నూతన లక్షణాల ఆవిష్కరణలకు మాత్రమే అనుమతిస్తారు. ఇది శాస్త్రవిజ్ఞాన అభివృద్ధికి తోడ్పడడమే కాక, వినియోగదారుడు - ఆవిష్కర్తల ప్రయోజనాల మధ్య సమతూకాన్ని కాపాడుతుంది.

కాన్సర్ మందు అయిన "జేఫీటినిబ్" కు పేటెంట్ నిరాకరించబడడం వలన, దాని సహ ఉత్పత్తి అయిన ఈర్లోటినిబ్ పేటెంట్‌ను కూడా, 'పేటెంట్ ఆమోదనంతర వ్యతిరేకత' ద్వారా రద్దు చేయవచ్చు. జనరిక్ ఫార్మా కంపెనీలను దెబ్బతీయడానికి, బడా ఫార్మా కంపెనీలు అన్ని ప్రయత్నాలు చేస్తుండగానే వాటికి మరో సమస్య ఎదురైంది. అభివృద్ధి చెందిన దేశాల్లోని డాక్టర్లు, ఇన్సూరెన్సు కంపెనీలు, కార్పొరేట్ ఆసుపత్రులు తమ లాభాలు పెంచుకోవడానికి జనరిక్ మందుల వైపు ఎక్కువగా మళ్లుతున్నారు. 2018 సం॥లో అమెరికాలో రాసిన మందులలో 89 శాతం జనరిక్ మందులే ఉన్నాయని అంచనా వేశారు. 2017 సం॥లో జనరిక్ మందుల వల్ల 265 బిలియన్ డాలర్లు (రు.18 లక్షలకోట్లు) ఆదా అయ్యింది. అమెరికాలో ప్రధాన ప్రజారోగ్య వ్యవస్థలైన మెడికేర్ 8270 కోట్ల డాలర్లు, మెడిక్ ఎయిడ్ 4060 కోట్ల డాలర్లు పొదుపు చేసుకోగలిగాయి. మెడికేర్ లో నమోదయ్యే ప్రతి వ్యక్తిమీద 1952 డాలర్లు, మెడిక్ ఎయిడ్‌లోనైతే 568 డాలర్లు సగటున పొదుపు చేయ బడుతోంది.

ఈ ధోరణి భారీ ఏకీకరణలకు దారి తీస్తోంది. ఈ ఏకీకరణలకు చోదకశక్తిగా జనరిక్ కంపెనీల చౌకధరలు పనిచేస్తున్నాయి. ఈ ఏకీకరణల ద్వారా ఏర్పడే అత్యంత భారీసంస్థల ద్వారా తక్కువ ధరలకు ఇస్తూనే ఎక్కువ లాభాలు ఆర్జించడం వీరికి సాధ్యపడుతుంది. వీలుపడే ఆర్థికవ్యవస్థ నుండి ఈ లాభం పొందుతున్నారు. తద్వారా జెనెరిక్ కంపెనీల బెడద వదులుతుంది. ఈ ఏకీకరణలతో 10 కోట్ల డాలర్ల నుండి 100 కోట్ల డాలర్ల వరకు మిగులు సాధ్యపడుతుందని అంచనా.

ఈ మధ్య కాలంలో ఫార్మా హోల్ సేల్ కంపెనీలలో కేవలం మూడు (అమెరిసోర్స్ బెర్జెన్ కార్ప్, కార్డిన హెల్త్, మెఖేసన్ కార్ప్) మార్కెట్ వాటా 2013 సం.లో 87 శాతంగా ఉన్నది. 2018 కి 95 శాతంకు పెరిగింది. 7400 కోట్ల డాలర్లు (రు.5.2 లక్షల కోట్లు) చెల్లించి బ్రిస్టల్ -మై ఏర్ కంపెనీ సెల్జీన్ కంపెనీ తనలో కలిపేసుకోవడం, జపాన్‌కు చెందిన టకేడ కంపెనీ 6400 కోట్ల డాలర్లను చెల్లించి షైర్ కంపెనీని కొనేయడం ఈ రంగంలోని అతి పెద్ద ఏకీకరణలు. 2014 సం.లో ఫైజర్ కంపెనీ ఆస్ట్రా జెనెకాను స్వాధీనం చేసుకోవాలనుకుంది. కానీ ఆస్ట్రాజెనెకానే అలెక్సియాన్ అనే కంపెనీని కొనే పనిలో వుంది.

## ముగింపు

దేశాల మీద సామ్రాజ్యవాదం ఏవిధంగా పేటెంట్‌లను రుద్దుతుంది? కెనడా లాంటి అభివృద్ధి చెందిన దేశాలు కూడా తమ ప్రభుత్వ ఫార్మా కంపెనీలలో వాక్సిన్‌ను ఎందుకు ఉత్పత్తి చేసుకోలేక పోతున్నాయి? కెమికల్ కంపెనీల కాలుష్యాన్ని ఎందుకు నియంత్రించ లేక పోతున్నాయి? అత్యంత శక్తివంతమైన దేశమైన అమెరికా దేశ ప్రజలు ఔషధాల కోసం ఎందుకు 3 రెట్లు అధికంగా ధరలు చెల్లించాల్సి వస్తోంది? అమెరికా లోనూ, ఈ విపత్తు కాలంలో కూడా బడా ఫార్మా కంపెనీలు ఔషధాల ధరలను అసాధారణంగా ఎలా పెంచివేయగలిగాయి (ఇన్సులిన్ ధర 10 రెట్లు పెరిగింది)? పోలాండ్ లాంటి దేశం ప్రైవేటీకరణను ఎందుకు ఆపలేక పోయింది? ఆధునిక సాంకేతికత, మానవ వనరులు ఉన్నప్పటికీ, భారతదేశం వాక్సిన్ ఉత్పత్తిని ప్రభుత్వ రంగంలో ఎందుకు చేయలేక పోతోంది? ఉన్న 9 ప్రభుత్వ ఫార్మా కంపెనీలలో ఉత్పత్తి చేసి కృత్రిమ కొరతను ఎందుకు నివారించలేకపోతోంది?

ఈ ప్రశ్నలకు జవాబులు దేశాల మీద రుద్దబడిన సామ్రాజ్యవాద అనుకూల నయా ఉదారవాద విధానాలలో ఉన్నాయి. నయా ఉదారవాదం అంటే ధరలమీద ప్రభుత్వ నియంత్రణ తొలగింపు; మార్కెట్ల నియంత్రణ తొలగింపు; వాణిజ్య అవరోధాల తగ్గింపు; ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ ప్రభావాన్ని ముఖ్యంగా ప్రైవేటీకరణ, పొదుపు చర్యల ద్వారా తగ్గించడం, కార్పొరేట్ పన్నులతగ్గింపు, మెజారిటీ ప్రజల మీద పన్నులు పెంచడం. ఆనాడు ఐ.డి.పి.ఎల్.ని నాశనం చేసినప్పటి నుండి నిన్నటి పెట్రోల్, డీజిల్ డీ రెగ్యులేషన్, నేటి జివిస్టిలు అన్నీ నయా ఉదారవాద విధానంలో భాగంగా వచ్చినవే. అంటే ప్రజలచేత, ప్రజల కోసం ఎన్నికయిన ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు ఈ విధానాల ద్వారా మార్కెట్ లాభాల కోసం, పెట్టుబడిదారీ వ్యవస్థ కోసం పనిచేయక తప్పదు. 'ప్రజాస్వామ్యం' బూర్జువా వర్గాల కోసం, పెట్టుబడిదారుల కోసం మాత్రమే పనిచేస్తుంది.

నయా ఉదారవాద విధానాల ప్రవేశాన్ని వ్యతిరేకించే ఏ ప్రభుత్వాన్నయినా సామ్రాజ్య వాదులు క్రూరంగా అణిచివేసి, వాళ్ళ స్థానంలో తమ కీలుబొమ్మలైన నియంతలను నియమించు కుంటారు. లాటిన్ అమెరికా దేశాలు, ఒకనాటి చిలీలో అలెండీ దీనికి ఒక గొప్ప ఉదాహరణలు. గాట్ ఒప్పందం తర్వాత భారతదేశంలో నయా ఉదారవాద విధానాలు దూకుడుగా ప్రవేశించడం మొదలైంది. 1991 సు॥లో పి.వి.నరసింహారావు, మన్మోహన్‌సింగ్‌ల సారధ్యంలో ఉన్న కాంగ్రెస్ హయాంలో, 'నూతన ఆర్థిక విధానాలు' ఆమోదించాక అది అధికార విధానం అయింది. వెంటనే పటాటోపాల మధ్య అన్ని ప్రభుత్వ వ్యవస్థలను కుప్ప కూల్చడం మొదలైంది. ఐ.డి.పి.ఎల్ కూడా వాటిలో ఒకటి. ఐ.డి.పి.ఎల్ మరణం నుండే భారతదేశ ఫార్మా కంపెనీలలో అత్యధిక భాగం పురుడు పోసుకున్నాయి. కానీ అవి స్వతంత్రంగా వుండే వీలులేకుండా పోయింది. అవి ఒక్కసారి నిలదొక్కుకోగానే బడా ఫార్మా అంతర్జాతీయ చట్టాలు, పెట్టుబడులతో వాటిని కూల్చనారంభించాయి. శాంతా బయోటిక్ కంపెనీ ఛైర్మన్ అభీష్టానికి విరుద్ధంగా ఆ కంపెనీని సనోఫీ కొనుగోలు చేయడం దీనికి ఉదాహరణ! ప్రభుత్వాలు కానీ, జాతీయ బూర్జువాలు కానీ ఈ నయా ఉదారవాద విధానాలకు ఎదురు నిలవలేరని ఈ ఉదాహరణ ఋజువుచేస్తుంది.

నయా ఉదారవాద విధానాలకు, సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా ప్రజలు సాగించే ఐక్య, నిర్మాణాత్మక, ప్రభావశీల పోరాటాలు మాత్రమే దేశాల సార్వభౌమత్వాన్ని కాపాడుతాయి. అవి మాత్రమే ప్రజలను రకరకాల విపత్తులనుండి, పేదరికం నుండి రక్షించగలుగుతాయి. ★

# ఎల్ఐసి-ప్రభుత్వ బీమా సంస్థలను సామ్రాజ్యవాద, బడాకార్పొరేట్లకు కట్టబెట్టే పాలకుల విధానాలు

**కేంద్రంలో** వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం, ప్రభుత్వరంగంలోని అనేక సంస్థల్ని ప్రైవేటీకరించటానికో, తెగనమ్మి పారేయడానికో, లేదా మూసివేయటానికో వేగంగా చర్యలు తీసుకుంటున్నది. ప్రభుత్వ రంగంలోని బ్యాంకులను ప్రైవేటీకరించే నిర్ణయంతోపాటుగా, లాభాలలో నడుస్తున్న ప్రభుత్వరంగంలోని ప్రతిష్టాత్మక సంస్థ-ఎల్ఐసిని ప్రైవేటీకరించనున్నట్లు ప్రకటించింది. ఎల్ఐసిలోని ప్రభుత్వ పెట్టుబడులను ఉపసంహరింప బోతున్నట్లు ఈ సం॥ బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ ఆర్థికశాఖా మంత్రి ప్రకటించారు. జీవితబీమా సంస్థను మార్కెట్లో అమ్మకానికి పెట్టే పనిని ఆర్థికమంత్రిత్వశాఖకు అనుబంధంగా వుండే 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజిమెంట్ (డిఐపిఏఎమ్-'దీపం')' డెల్టాయిట్ అనే కంపెనీకి అప్పగించింది కూడా!

బడ్జెట్ ప్రకటన సందర్భంగా చెప్పిన దానిని బట్టి ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, వాటాల అమ్మకం తదితర రూపాల్లో 4.25 లక్షలకోట్ల డబ్బును సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ బడ్జెట్‌లో చూపిన దానిప్రకారం ప్రభుత్వ రాబడికి-ఖర్చుకు మధ్య 18.48 లక్షల కోట్ల రూ॥ వ్యత్యాసం వుంది. ఈ లోటును పూడ్చటానికి ప్రభుత్వం 12 లక్షల కోట్ల రూ॥లను రుణం ద్వారా సేకరించనున్నట్లు, మిగిలిన లోటును ప్రభుత్వరంగ సంస్థలను, వాటి ఆస్థులను తెగనమ్మటం ద్వారా పూడ్చుకోనున్నట్లు తెలిపింది.

## అంచెలంచెలుగా ఎదిగిన ఎల్ఐసి

1956 సం॥లో బీమారంగంలో ఐదుకోట్ల రూ॥ల ప్రారంభ పెట్టుబడితో ప్రభుత్వరంగ సంస్థగా ఎల్ఐసి ప్రారంభమైంది. అనతి కాలంలోనే దేశవ్యాపితంగా తన శాఖలను విస్తరింపజేసుకుంది. ఉద్యోగులు, చిరు వ్యాపారులు మొదలు అల్పాదాయవర్గాల వారు కూడా ఎల్ఐసిలో బీమాచేయటం పెరిగింది. క్లెయిమ్‌లను సత్వరం పరిష్కరించే విశ్వసనీయ సంస్థగా ఎల్ఐసి ప్రజలకు చేరువైంది. క్రమంగా లక్షలకోట్ల రూ॥ వ్యాపారం సాగించే స్థాయికి చేరుకుంది. తద్వారా లాభాలను కూడా గడిస్తోంది. ప్రస్తుతం దేశంలోని మొత్తం బీమా రంగంలో 70శాతం పైగా మార్కెట్‌ను ఎల్ఐసి కలిగి వుంది. ప్రారంభంలో మూలధనంగా ప్రభుత్వం పెట్టిన 5 కోట్ల రూ॥ పెట్టుబడికిగానూ, ఎల్ఐసి ఇప్పటికి ప్రభుత్వానికి డివిడెండ్‌ల రూపంలో 20 వేలకోట్ల రూ॥లను చెల్లించింది.

## బీమారంగంలోకి ప్రైవేటు చొరబాటు

సామ్రాజ్యవాద ప్రపంచీకరణను ఆమోదించి, నూతన ఆర్థిక విధానాలను అమలుచేసే దానిలో భాగంగా 1999లోనే బీమారంగంలో 26 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని పాలకులు అనుమతించారు. 2015 సం॥లో ఎన్‌డిఏ-1 ప్రభుత్వం బీమారంగంలో ఎఫ్‌డిఐ శాతాన్ని 49కి పెంచింది. ప్రభుత్వ బీమాసంస్థల్లో 74 శాతం వాటాలను విక్రయించేందుకు మోడీ నాయకత్వం లోని ఎన్‌డిఏ-2 ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ నిర్ణయాల పర్యవసానం తీవ్రంగా వుండబోతోంది. జీవిత బీమాచందాదారులు ప్రీమియంల రూపంలో చెల్లించిన, ఎల్ఐసి వద్దకు చేరిన భారీ నిల్వలను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆ సంస్థ అప్పుగా అందించేది. ఆయా ప్రభుత్వాల విధానాల అమలుకు పెట్టుబడిగా 7.8 శాతం కనీస వడ్డీతో ఇప్పటివరకూ ఎల్ఐసి అందిస్తూ వస్తోంది. దేశవ్యాపితంగా 31 లక్షలకోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులున్న, ప్రభుత్వ కార్యకలాపాలకు నిధులు సమకూరుస్తున్న ఎల్ఐసిలో వాటాలను అమ్మి వేయటమంటే, ఎల్ఐసిని బడాకార్పొరేట్‌లకు, సామ్రాజ్యవాద ఆర్థిక సంస్థలకు కట్టబెట్టటమే. ప్రజలు బ్యాంకులలో నిల్వచేసుకున్న కష్టార్జితం, బీమాసంస్థలలో ప్రీమియం రూపంలో పోగుపడిన సంపద, పెన్షన్ రెగ్యులేటరీ ఫండ్‌లో జమ అయిన ఉద్యోగుల, కార్మికుల పెన్షన్ నిధులు.... అన్నీ సామ్రాజ్యవాద, బడా కార్పొరేట్ల ప్రయోజనాలకే ఉపయోగపడతాయి.

ప్రభుత్వరంగంలోని మౌలిక పరిశ్రమలు గానీ, సేవారంగాలుకానీ - బడా కార్పొరేట్లు, బహుళజాతి కంపెనీలు బలపడటం కోసమే ఇంతకాలమూ తోడ్పడుతూ వచ్చాయనేది వాస్తవం. ఇక, ప్రభుత్వరంగంలోని ఈ పరిశ్రమలను, సంస్థలను ప్రైవేటుపరం చేయటమంటే, ప్రభుత్వ పథకాలకు లభించే కొద్దిపాటి సహాయం కూడా అందకుండా, మొత్తాన్ని బడాకంపెనీలకు, విదేశీ ద్రవ్యసంస్థలకే ప్రభుత్వం కట్టబెట్టదల్చుకున్నదన్నమాట!

"ఎల్ఐసి వంటి ప్రభుత్వద్రవ్య సంస్థలు విదేశీ బ్యాంకుల డిపాజిట్లకు బలం చేకూర్చు తున్నాయనే" విషయంపట్ల ఎవరూ ఆశ్చర్య పోనక్కరలేదు. ఎందుకంటే ఎల్ఐసి, ఐఎఫ్‌సిఐ, ఐసిఐసిఐ వంటి ద్రవ్య సహాయ సంస్థలు రసాయన ఎరువుల రంగంలో నోసిల్ (ఎన్‌ఓసిఐఎల్), పోల్యో లెఫిన్స్, కాన్పూర్ ఫెర్టిలైజర్స్ తదితర విదేశీ ప్రాబల్యం క్రిందనున్న సంస్థలకు సహాయం చేయడం మనం ఇదివరకే గమనించాం. విదేశీ పెట్టుబడి, నిరంకుశాధికార పెట్టుబడి 'సయాం కవలలు'(ఒక దానితో ఒకటి విడదీయరాని విధంగా వుండే కవలలు)లాగా నిర్దిష్ట లక్ష్యంతో, మంచి సమన్వయంతో కలిసి పనిచేస్తున్నాయి" అని కా॥టి.ఎన్. 1970లలోనే తన ప్రసిద్ధ 'తాకట్టులో భారతదేశం' గ్రంథంలో స్పష్టంగా పేర్కొన్న అంశాలు అక్షరసత్యాలుగా వున్నాయి.

## ప్రమాదంలో ఉద్యోగ భద్రత

ప్రభుత్వరంగ సంస్థ ఎల్ఐసిలో దేశ వ్యాపితంగా లక్షలాదిమంది ఉద్యోగులు సాపేక్షంగా ఉద్యోగభద్రతతో జీవిస్తున్నారు. బీమారంగ ప్రైవేటీకరణ ఫలితంగా వీరందరి ఉద్యోగభద్రత ప్రమాదంలో పడనుంది. అంతేగాక ప్రభుత్వరంగ సంస్థలలో ఇప్పటివరకూ రిజర్వేషన్ల అమలుకోసం డిమాండ్ చేసి ఏదో మేరకు అమలుచేయించుకోగల్గటం జరిగింది. ప్రైవేటు రంగంలో చట్టబద్ధంగానే రిజర్వేషన్ల అమలు లేదు గనుక, రిజర్వేషన్లకై డిమాండ్ చేయటానికి కూడా అవకాశం వుండదు.

ఎల్ఐసిలో 30 కోట్లమంది వ్యక్తిగత బీమా పాలసీలు కలిగిన వారు కాగా, 12 కోట్లమంది సమూహ బీమాపాలసీను కలిగివున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో వీరి భవిష్యత్తు అనిశ్చితిగా మారిపోయింది. ఇంతేగాక, ఈ నిర్ణయంతో ఎల్ఐసిపై ఆధారపడి చందాదారులుగా చేర్పించే దాదాపు 12 లక్షలమంది ఏజెంట్లు దెబ్బతింటారు. ఎల్ఐసిలో వాటాలను అమ్మేయడంద్వారా సంస్థ యాజమాన్యంలో బడా, బహుళజాతి పెట్టుబడిదారులు ఆధిపత్యం చెలాయిస్తారు. కోట్లాదిమంది జీవిత బీమా పాలసీదారులకంటే, వీరి ప్రయోజనాలకు, లాభాపేక్షకే ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది.

## స్టాక్ మార్కెట్ జూదంలో నిధులు

దేశవ్యాపితంగా ప్రభుత్వరంగంలో 53 లక్షలమంది ఉద్యోగులు, కార్మికులు పెన్షన్ నిధులను దాచుకునే 'పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ సంస్థ'లోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను పాలకులు ఆహ్వానించారు. తద్వారా 35 వేలకోట్ల రూ॥ల కార్పస్‌ఫండ్‌తో సహా పెద్ద మొత్తంలోని పెన్షన్ రంగంలోని నిధులు అన్నింటినీ

ప్రైవేటు, విదేశీ గుత్తసంస్థలకు- స్టాక్‌మార్కెట్‌ల జూదంలో పెట్టుబడులుగా పెట్టుకోవడానికి - కట్టబెడుతున్నారు. పెన్షన్ నిధులను ప్రభుత్వ సంక్షేమ →

# జోహార్ కామ్రేడ్ మహమ్మద్ గౌస్

**2021** ఏప్రిల్ 19న ఎంసిపిఐ(యు) ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ గౌస్ (60 సం॥లు) కరోనా కారణంగా మృతిచెందారు. కా॥గౌస్ కమ్యూనిస్టు సిద్ధాంతానికి కట్టుబడిన కామ్రేడ్. విద్యార్థి ఉద్యమ కార్యకర్తగా ఆయన తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. తెలంగాణా రాష్ట్రం-వరంగల్ జిల్లా-రాయపర్తి మండలంలోని కొత్తూరు గ్రామంలో ఆయన జన్మించారు. మా సిపిఐ(ఎం-ఎల్)తో సహా వామపక్ష, దళిత సంఘాలకు ఆయన ఓ మంచి మిత్రుడు. కామ్రేడ్ గౌస్ మృతిపట్ల మా సంతాపాన్ని ప్రకటిస్తూ, ఆయనకు జోహార్లర్పిస్తున్నాము.

**విశ్వం**
**ప్రధాన కార్యదర్శి, సిపిఐ(ఎం-ఎల్)**

→ కార్యకలాపాలకు వెచ్చించటం మానివేసి వ్యాపార కార్యకలాపాలుగా మలుస్తున్నారు. అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాలలో ఈలాంటి చర్యల ఫలితంగా పెన్షను మదుపరులైన కార్మికులు, ఉద్యోగులంతా ఉద్యోగ విరమణ అనంతరం ఎటువంటి భద్రతా లేక రోడ్లపైకి విసిరి వేయబడుతున్న ఉదాహరణలు మనకళ్ళెదుటే వున్నాయి.

## ప్రభుత్వరంగ సంస్థలను విక్రయించే వ్యూహాత్మక చర్యలు

'నీతి ఆయోగ్' ఇప్పటికే ప్రభుత్వరంగ సంస్థలలో 'వ్యూహాత్మక వాటాల అమ్మకం'గా పిలవబడుతున్న దానిని అమలుచేసేందుకు 34 సంస్థలను గుర్తించింది. గత ఆరు సం॥ల కాలంలో మోడి నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం నిర్దేశిత రైలు మార్గాలను, స్టేషన్లను; విమానాశ్రయాలను, జాతీయ రహదారులను, ఇంధన పంపిణీ కాంట్రాక్టులను బడా, ప్రైవేటు కంపెనీలకు అందజేసేవిధంగా వేగంగా చర్యలు చేపట్టింది. ప్రభుత్వరంగ బ్యాంకుల సంఖ్యను కుదించి, ఎల్‌ఐసిలో వాటాలను అమ్మివేసి, విశాఖస్టీల్, హెచ్‌పిసిఎల్‌లను విక్రయించేందుకు సిద్ధంగా వుంది.

ప్రభుత్వరంగ సంస్థలన్నీ భారీగా భూములను కలిగివుండి విలువైన స్థిర ఆస్థులను కలిగి వున్నాయి. ప్రభుత్వం తన అధీనంలోవున్న ఈ భూములను అమ్మకానికి పెట్టి, 'డబ్బు చేసుకోవాలని' చూస్తోంది. చమురు, సహజ వాయువు, నౌకాశ్రయాలు, ఇంధనం వంటి విభాగాలతో సహా 100 ప్రభుత్వరంగ సంస్థలను అమ్మివేయనున్నట్లు కేంద్రం ప్రకటించింది. తద్వారా క్రమంగా మనదేశ ఆర్థికవ్యవస్థ యావత్తు సామ్రాజ్యవాద అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి గుప్పెట్లోకి వెళ్ళిపోయి, మనదేశ ఆర్థిక సార్వభౌమత్వం అత్యంత దయనీయ స్థితికి చేరుకుంటుంది. సామ్రాజ్యవాద పెట్టుబడులపై మనం మరింతగా ఆధారపడేట్లుగా చేస్తుంది.

"గత 15 సం॥ల కాలంలో మనదేశంలోకి 23 లక్షల కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వస్తే, ఇదేకాలంలో బహుళజాతి కంపెనీలు మనదేశం నుండి 19 లక్షల కోట్ల రూ॥లను తరలించుకుపోయాయ'ని ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ స్వదేశీ జాగరణ్ మంచ్ కన్వీనర్ డా॥అశ్వనీ మహరాజ్ పేర్కొనటాన్ని గమనించాలి.

మోడీ ప్రభుత్వం - మరింత వేగంగా, ఉత్సాహంగా ఎల్‌ఐసి, బ్యాంకులు ఇతర ప్రభుత్వరంగ సంస్థలను వరుసబెట్టి ప్రైవేటీ కరించటం లేదా తెగనమ్మటం-సామ్రాజ్యవాదుల, బడాపెట్టుబడిదారుల ప్రయోజనాలకు మరింతగా దాసోహం చేయటమే.

మన దేశంలోని కార్మికులు, ప్రగతిశీల దేశభక్తియుతశక్తులందరూ మనదేశ ప్రజలందరికీ చెందిన ఆస్థులైన ఈ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను, వాటిని తెగనమ్మి వేయటంద్వారా సాగించే ఈ లూటీని-రైతాంగం, ఇతర సెక్షన్ల తోడ్పాటుతో సంఘటితంగా ప్రతిఘటించాలి. ★

# కామ్రేడ్ మధుకు విప్లవ నివాళులు

**విప్లవ** మేధావి, సిపిఐ(ఎం-ఎల్) కేంద్ర కార్యదర్శివర్గ సభ్యుడు, ఆ పార్టీ కేంద్రపత్రిక 'క్లాస్‌స్ట్రగుల్' సంపాదకులు కా॥మధు (78 సం॥లు)కు సిపిఐ(ఎం-ఎల్) జనశక్తి కేంద్రకమిటి విప్లవజోహార్లర్పిస్తోంది. సిపిఐ(ఎం-ఎల్) పార్టీశ్రేణులకు, కా॥మధు జీవిత భాగస్వామి కా॥పద్మకు, వారి కుమార్తె కా॥అజితకు తీవ్ర సంతాపాన్ని తెలియపరుస్తోంది. దీర్ఘకాలంగా తనతో సన్నిహితంగా పనిచేసిన కామ్రేడ్‌ను కోల్పోవటంపట్ల ప్రత్యేకించి కామ్రేడ్ విశ్వంకు మా హృదయపూర్వక సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నాము. అతితక్కువ కాలవ్యవధిలో సిపిఐ(ఎం-ఎల్) సంస్థలో చురుగ్గా సిద్ధాంత, రాజకీయ కృషి సాగించే కామ్రేడ్స్ జస్వంత్, మధుల అకాల మరణాలు, ఆ సంస్థకు మాత్రమేగాక, మొత్తంగా భారత విప్లవోద్యమానికే నష్టం. వారు తమ విలువైన యవ్వనాన్ని, తమ జీవితాల్ని విప్లవపార్టీ నిర్మాణంకోసం సంపూర్తిగా అంకితం చేశారు. భారత ప్రజల విముక్తికోసం వారు ప్రదర్శించిన మనోనిబ్బరం, అంకితభావం ఆదర్శప్రాయమైనవి. ఐక్యత-చీలికలు-తిరిగి ఐక్యతాక్రమంలో విప్లవోద్యమానికి కా॥మధు అందించిన తోడ్పాటు విస్మరింపవీలులేనిది. విప్లవ సంస్థల ఐక్యతకోసం కా॥మధు ప్రయత్నాలను తిరుగులేని అంకితభావంతో కొనసాగించటమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి.

కల్లోల దశాబ్దానికి చెందిన విప్లవ పుత్రుడు కా॥మధు. కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వరరావు నాయకత్వంలో విప్లవ విద్యార్థిగా ఆయన తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. తదనంతరం ఆయన యుసిసిఆర్ఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి కార్యదర్శి అయ్యారు. సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి కార్యదర్శివర్గ సభ్యునిగా 2021 ఏప్రిల్ 16 తెల్లవారుఝామున అంతిమశ్వాస విడిచేవరకూ ఆయన విప్లవకర జీవితం కొనసాగింది. ఆయన వీరోచిత తెలంగాణాలోని పాలమూరుజిల్లాలో జన్మించి, తన 15వ ఏటనే ఎర్రజెండాను గట్టిగా ఎత్తిపట్టారు. చిరుద్యోగం చేస్తూ న్యాయశాస్త్ర విద్యను అభ్యసించినప్పటికీ, ఆయనకు పార్టీ జీవితం తప్ప వ్యక్తిగత జీవితం లేదు. 1973లో యుసిసిఆర్(ఎం-ఎల్) రాష్ట్రకమిటి బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి, ఆయన తన తుదిశ్వాస వరకూ పార్టీ బాధ్యతల నిర్వహణలోనే నిమగ్నమైవున్నారు.

సిపిఐ(ఎం-ఎల్) రెసిస్టెన్స్, సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీలతో ద్విపక్ష, త్రైపాక్షిక ఐక్యతాచర్చల సందర్భంగా యుసిసిఆర్ఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి కార్యదర్శిగా కా॥మధు నిర్వహించిన పాత్ర, అందించిన తోడ్పాటు మరచిపోలేనివి. ఈ చర్చలు అంతిమంగా కొన్ని తీసివేతలు, మరికొన్ని కలయికలతో అనేక ఇతర గ్రూపులతో ఐక్యతా చర్చలకు, అంతిమంగా 7 విప్లవసంస్థల ఐక్యతతో సిపిఐ(ఎం-ఎల్) ఆవిర్భావానికి దోవతీసింది. సిపిఐ(ఎం-ఎల్)జనశక్తి కేంద్రకార్యదర్శివర్గ సభ్యునిగా, ఒడిషా రాష్ట్ర ఇన్‌ఛార్జ్‌గా వున్న 1996 కాలం వరకు మేము కామ్రేడ్ మధుతో కలిసి పనిచేశాము. చీలికకు దోవతీసిన రాజకీయ, నిర్మాణపర విభేదాలు ప్రాథమికంగా కొన్ని వున్నప్పటికీ, ఐక్యతకోసం సాగించిన ప్రయత్నాలు, భవిష్యత్తులో విప్లవకారుల ఐక్యతకు పలు గుణపాఠాలందించేవిగా వుంటాయని చెప్పటం అతిశయోక్తి ఎంతమాత్రం కాదు. భారత కమ్యూనిస్టు ఉద్యమం గతితార్కిక పద్ధతిలో ఐక్యత-పోరాటం-ఐక్యతల గుండా ఒకే ఒక్క ఐక్యవిప్లవ పార్టీని స్థాపించినపుడు మాత్రమే, కా॥మధుతో సహా వేలాదిమంది అమరవీరుల త్యాగాలకు సార్థకత చేకూర్చిన వారమౌతాం. భారత పీడిత ప్రజల కలలను అపుడు మాత్రమే సాకారం చేయగలుగుతాం.

జోహార్ కామ్రేడ్ మధు! అమరవీరుల ఆకాంక్షలను సాధించుదాం!

**విప్లవాభినందనలతో**

**2021 ఏప్రిల్ 20** **చంద్ర ప్రకాష్, ప్రధాన కార్యదర్శి**
**సిపిఐ(ఎం-ఎల్) జనశక్తి**

# అసమ్మతిని అణచేందుకు విస్తృతంగా 'రాజద్రోహ' చట్టాన్ని అమలుచేస్తున్న ప్రస్తుత కేంద్రపాలకులు

**ఇటీవలి** కాలంలో రాజద్రోహ చట్టాన్ని ప్రభుత్వాలు దుర్వినియోగం చేయటం ప్రమాదకర స్థాయికి చేరింది. అధికార రాజకీయపార్టీ బిజెపితో ఎవరైనా విభేధించినా, ప్రభుత్వ విధానాలపై భిన్నాభిప్రాయం వ్యక్తం చేసినా, ఆ పార్టీ రాజకీయ, సామాజిక సిద్ధాంతంపై భిన్నాభిప్రాయాలు కలిగివున్నా, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ నిరసన తెలిపినా, ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాలు వ్యక్తంచేసినా, దాని ఛాందస, మతభావాలతో, జాతీయ దురహంకార భావాలతో విభేధించే వారెవరిపైనైనా వలసవాద కాలంనాటి క్రూరమైన ఈ చట్టాన్ని ప్రభుత్వాలు ప్రయోగిస్తున్నాయి.

అది-ఓ రైతైనా, కార్మికుడైనా, సామాజిక కార్యకర్త అయినా, హక్కుల ఉద్యమకార్యకర్త అయినా, ఓ విదూషకుడైనా, నటుడైనా, మేధావి అయినా, విద్యావేత్త అయినా, చివరికి ప్రతిపక్ష రాజకీయపార్టీ నాయకుడైనా-వీరిపైన '124-ఏ' సెక్షను ప్రకారం కేసు నమోదు చేస్తున్నారు.

1857 నాటి మొదటి భారత స్వతంత్ర సంగ్రామం తదనంతర కాలంలో 1860లో 'రాజద్రోహం' గురించి వివరించే 124-ఏ సెక్షన్‌కు భారత శిక్షాస్మృతిలో చోటు కల్పించి, నాటి బ్రిటిష్ పాలకులు చట్టరూపం ఇచ్చారు. వలసవాద ప్రభుత్వంపట్ల అవిధేయులుగా వుండేవారిని; క్రూరమైన బ్రిటిష్ పాలన అంతమవ్వాలని, దేశానికి స్వాతంత్రం కావాలని ఆకాంక్షించిన వారిని నిర్బంధించి, అణచి వేసేందుకు ఈ చట్టం చేశారు.

జాతీయోద్యమ కాలంలో బాలగంగాధర తిలక్, గాంధీ, అనిబిసెంట్, మౌలానా అజాద్, మహ్మదాలీ సోదరులు, మరికెందరి పైననో-బ్రిటిష్ సామ్రాజ్యశక్తిని వ్యతిరేకించిన వారెందరి పైననో - ఈ చట్టం ప్రయోగించారు. ఈ రాజద్రోహ చట్టాన్ని 'పౌరుల స్వేచ్ఛను అణచివేసేందుకు రూపొందించిన భారత శిక్షాస్మృతిలోని రాజకీయ సెక్షన్లలో రాజు' వంటిదని గాంధీ వ్యాఖ్యానించాడు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అసమ్మతిని వ్యక్తంచేస్తూ రచనలు చేసిన వారిపై కూడా నాటి పాలకులు రాజద్రోహనేరం బనాయించారు. ఆనంద్‌మఠ్ నవలలోని బంకించంద్ర 'వందేమాతర' గీతం విప్లవకారులకు స్ఫూర్తిదాయకంగా నిలవటం 'రాజద్రోహ'మైంది! దానిని నిషేధించారు. జాతీయోద్యమ కాలంలో వివిధ భాషలలో ఎందరో రచయితలు చేసిన స్ఫూర్తిదాయకమైన రచనలను నాటి పాలకులు రాజద్రోహంగా పరిగణించి నిషేధించారు. పీడిత ప్రజల ఉద్యమాలను అణచివేసేందుకు రాజద్రోహ నేరం చట్టాన్ని బ్రిటిష్ వలస ప్రభుత్వం ఉపయోగించు కున్నది. కమ్యూనిస్టు అభిప్రాయాలతో కార్మిక సంఘాలను స్థాపించటాన్ని కూడా రాజద్రోహ నేరంగా పరిగణించి శిక్షించారు. మీరట్ కుట్రకేసు దానికి స్పష్టమైన ఉదాహరణ. ప్రసిద్ధిగాంచిన పెషావర్, కాన్పూర్, లాహోర్ కుట్రకేసులన్నింటిలోనూ 124-ఏ సెక్షన్‌ను బనాయించారు.

మన దేశంలో బ్రిటిష్ ప్రత్యక్ష పాలన అంతమైన 74 సం॥ తర్వాత కూడా, ఈ క్రూరమైన చట్టం ఉనికిలో వుండటమేగాక, పాలకుల ఆలోచనలు, అభిప్రాయాలు, విధానాలను వ్యతిరేకించే, నిరసించే, విభేధించే లేదా భిన్నాభిప్రాయం కలిగివుండే పౌరులు ఎవరైనా, సంస్థలు ఏవైనా-వారిని అణచి వేసేందుకు పాలకుల చేతిలో ఇది సాధనంగా అందుబాటులో వుంది.

నాగిరెడ్డి కుట్రకేసుగా ప్రాచుర్యంలో వున్న హైదరాబాద్ కుట్రకేసు, పాలకులు కమ్యూనిస్టులపై మోపిన కుట్రకేసులలో కెల్లా ప్రపంచంలోనే పెద్దదైన పార్వతీపురం కుట్ర కేసులతోపాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే గతంలో సెక్షన్ 121-ఏ రాజద్రోహ నేరంతో సహా పలుసెక్షన్లపై నేరారోపణలు చేస్తూ కేసులు బనాయించారు.

భారత రాజ్యాంగం పౌరుల భావప్రకటనా, వ్యక్తీకరణ స్వేచ్ఛ వంటి ప్రాధమిక హక్కులకు గ్యారంటీ చేసేదని, అది అమలులో వుందని మనకు బోధిస్తుంటారు. మరోవైపున పౌరుల స్వేచ్ఛను అణచివేసి, హరించే రాజద్రోహ చట్టాన్ని ఇంకా అమలుచేస్తూనే వున్నారు.

"రాజ్యాంగంలో ప్రాధమిక హక్కులన్నింటి గ్యారంటీకి పునాది"గా పేర్కొనే రాజ్యాంగంలోని 32వ అధికరణం ముఖ్యమైనదని, ప్రాధమిక హక్కులన్నింటికీ వాస్తవరూపమిస్తుందని కూడా మనకు చెబుతుంటారు. అయితే రాజ్యాంగంలోని ఈ అధికరణం కూడా రాజద్రోహనేరం ఆరోపించబడి హక్కులు హరించివేయబడుతున్న పౌరుల రక్షణకు ముందుకు రాలేకపోతున్నది.

2010లోనే బ్రిటన్‌లో రాజద్రోహ చట్టాన్ని రద్దుచేసినప్పటికీ, అసమ్మతిని అణచివేసే సాధనంగా మనదేశ 'స్వతంత్ర' పాలకులు దీనిని ఇంకా అమలు చేస్తూనే వున్నారు. బ్రిటిష్ పాలకులు భారతదేశం నుండి వెళ్ళిపోయిన తర్వాత కూడా రాజద్రోహ నేరం ఆరోపించబడిన మేధావుల, హక్కుల కార్యకర్తల, కమ్యూనిస్టుల ఇతర రాజకీయ నాయకుల జాబితా చాలా పొడవైందిగా వుంటుంది.

ప్రముఖ విప్లవ కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డిని 1940లో బ్రిటిష్ ప్రభుత్వం మొదటిసారిగా అరెస్ట్ చేసింది. తదనంతర కాలంలో భారత పాలకులు 1969లో కా॥టి.ఎన్‌ను అరెస్టు చేశారు. రెండు సందర్భాలలోనూ 1860 నాటి పీనల్‌కోడ్‌లోని 121-ఏ సెక్షను క్రింద రాజద్రోహం, కుట్ర నేరాలు మోపారు.

1969 నాటి హైదరాబాద్ కుట్ర కేసులో అడిషనల్ సెషన్స్ జడ్జి ముందు కా॥టి.ఎన్. తన వాదనలు వినిపిస్తూ "భారత దేశానికి స్వతంత్రం వచ్చిన 25 సం॥ల తర్వాత కూడా 100 సం॥ల క్రితం 1860లో చేసిన చట్టం ద్వారా నన్ను అరెస్టు చేయడంలో ఆశ్చర్యమేమీ లేదు" "భారతదేశంలో సామ్రాజ్యవాదుల పాలననాటి సాంఘిక, ఆర్థిక వ్యవస్థను పదిలంగా వుంచటానికి 1935 భారత ప్రభుత్వ చట్టం ద్వారా ఏర్పడిన రాజ్యాంగాన్నే స్వతంత్ర భారతదేశం కొనసాగించింది. అందువలన స్వతంత్ర భారత రాజ్యాంగం-అప్పటివరకు ఉనికిలోవున్న పాత రాజ్యాంగానికి భిన్నమైనదేమీ కాదు. పాలకవర్గాలు వారి తైనాతీలు ఈ రాజ్యాంగం అతి పవిత్రమైనదని నమ్మిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. స్వతంత్ర భారత రాజ్యాంగం-వలసవాదుల పాలనా యంత్రాంగాన్నీ, అన్ని చట్టాలను, న్యాయవ్యవస్థను బలపరిచే సాంఘిక ఆర్థిక వ్యవస్థను కొనసాగించటానికి సామ్రాజ్యవాద పునాదులమీద జాగ్రత్తగా నిర్మింపబడిన ఉపరితల నిర్మాణం మాత్రమే" "....కాబట్టి 1860లో రూపొందించిన చట్ట ప్రకారం నన్ను అరెస్టు చేయడంలో ఆశ్చర్యం లేదు" అని ప్రస్తుత రాజ్యాంగ స్వభావాన్ని, న్యాయవ్యవస్థ, చట్టాల 'స్వతంత్ర'లోని డొల్లతనాన్ని ఆయన తేటతెల్లం చేశారు.

2014లో మోడీ కేంద్రంలో ప్రభుత్వాధికారం చేపట్టిన తర్వాత నుండి రాజద్రోహ చట్టం దుర్వినియోగం కావటం మరింతగా పెరిగింది. గత పాలకులకంటే ఘోరంగా రాజద్రోహ చట్టాన్ని ఉపయోగిస్తున్నారు. ప్రభుత్వ విధానాన్ని ఆమోదించని ఎవరినైనా రాజద్రోహానికి పాల్పడిన వారిగా పరిగణిస్తున్నారు. జాతీయ నేర నమోదు సంస్థ(ఎన్‌సిఆర్‌బి) అందించిన గణాంకాల ప్రకారం 2014 నుండి రాజద్రోహ నేరం మోపిన కేసులను పరిశీలిస్తే, 2014లో ఐపిసి 124ఏ రాజద్రోహ నేరం మోపిన కేసులకంటే 2019 నాటికి 98శాతం పెరిగాయని తెలుస్తోంది.

2014 నాటికి అనేక రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఒక్క రాజద్రోహ కేసు కూడా నమోదు కాకుండా వుంటే, తర్వాత కాలంలో ఈ చట్టాన్ని ప్రయోగించిన రాష్ట్రాల సంఖ్య 19కి చేరింది. అనేక రాష్ట్రప్రభుత్వాలు ఈ దుర్మార్గమైన చట్టాన్ని ప్రయోగించటానికి సంసిద్ధంగా వున్నట్లు తెలుస్తోంది. బిజెపియేతర పార్టీలు పాలించే రాష్ట్రాలలో ప్రభుత్వాలకంటే, బిజెపి పాలిత రాష్ట్రాలలో ప్రభుత్వాలు ఈ చట్టాన్ని ఎక్కువగా ప్రయోగించాయి.

2019లో కర్ణాటక రాష్ట్రప్రభుత్వం 22 రాజద్రోహ కేసులు, అస్సామ్‌లో 17, జమ్ముకాశ్మీర్‌లో 11 కేసులు బనాయించారు. కాంగ్రెస్ పాలించిన కాలంలో కర్ణాటకలో 2018లో 2 కేసులు నమోదుకాగా, 2015, 2016లో 3 కేసులు చొప్పున నమోదయ్యాయి. 2017లో అస్సామ్‌లో 19 కేసులు నమోదు అయ్యాయి. (2016లో అస్సామ్‌లో బిజెపి అధికారంలోకి వచ్చింది)

జమ్ముకాశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన విధించటంతో అక్కడ రాజద్రోహం కేసులు పెరగటం ప్రారంభమైంది. 2014-17ల మధ్య 2 మాత్రమే రాజద్రోహం కేసులు నమోదుకాగా, కేవలం జమ్ముకాశ్మీర్‌లో రాష్ట్రపతిపాలన విధించిన 2018 సం॥లోనే 12 కేసులు నమోదు చేశారు. 2019లో 11 కేసులు మోపారు.

2018లో ఝార్ఖండ్‌లో బిజెపి ప్రభుత్వ పాలనలో 18 రాజద్రోహం కేసులు నమోదు అయ్యాయి. 2014లో బీహార్‌లో 16 కేసులు, 2015లో 9 కేసులు, 2018లో 17 కేసులు నమోదయ్యాయి. మరో రాజద్రోహం కేసులో బీహార్ పోలీసులు శ్యాంబెనగల్, మణిరత్నం వంటి దర్శకులతోపాటు 49 మంది ప్రముఖులపై రాజద్రోహం కేసు నమోదు చేశారు. మతతత్వ దాడులపై ప్రధానమంత్రికి బహిరంగ లేఖ రాయటమే వీరు చేసిన నేరం! బిజెపి పాలిత ఉత్తరప్రదేశ్‌లో 2019లో 10 కేసులు నమోదయ్యాయి. యోగి ఆదిత్య పాలనలో ఈ కేసుల నమోదు మరింత ఎక్కువైంది.

ప్రస్తుతం ఢిల్లీ పరిసరాల్లో రైతాంగం సాగిస్తున్న నిరవధిక ఆందోళన, రిపబ్లిక్‌డే దినోత్సవాన జరిగిన ఘటనల సాకుతో, దేశద్రోహం కేసులు మోపటం మరింత తీవ్రమైంది. నిరంకుశ ప్రభుత్వంగా భారత ప్రభుత్వం వ్యవహరించటం, దేశంలో ప్రజాస్వామ్యవ్యవస్థలను తక్కువజేసే ప్రయత్నాలు, హక్కుల రక్షణపట్ల గౌరవం లేకపోవటం వంటి కారణాలతో మనదేశం అంతర్జాతీయంగా తీవ్ర విమర్శలనెదుర్కొంటోంది.

కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఎన్‌ఐఎ, సిబిఐ, ఇడి, ఐటి మరియు రాష్ట్ర పోలీసు వ్యవస్థలు ప్రభుత్వంపట్ల విమర్శనాత్మకంగా వున్న వారిని దేశద్రోహ నేరం క్రింద అణచివేసే దుర్మార్గమైన పనికి వినియోగించబడుతున్నాయి. రాజద్రోహం కేసులు మోపటంతోపాటు, ఉపా, ఎన్‌ఎస్‌ఏ, మీసా, టాడా, పోటా, సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం వంటి నిర్బంధ చట్టాలను కూడా ప్రయోగిస్తున్నారు. ప్రజల నిరసనల ఫలితంగా వీటిలో కొన్నింటిని రద్దుచేసినా, తిరిగి మరిన్ని కోరలతో కొత్త నిర్బంధ చట్టాలను పాలకులు ముందుకు తెస్తూనేవున్నారు.

ప్రధాని నరేంద్రమోడి అతని ప్రత్యర్థులను దూషిస్తూ, వారికి దేశభక్తి అణుమాత్రం లేదంటూ కించపరుస్తున్నాడు. అసమ్మతి వాదులను జాతి వ్యతిరేకులు లేదా భారత వ్యతిరేక, విదేశీ సంస్థల మద్దతుదారులుగా లేక టెర్రరిస్టు అనుయాయులుగా చిత్రీకరిస్తున్నాడు. ఇదంతా ఫాసిజమ్ యొక్క ఒక చిహ్నమే.

బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత నిరంతర నిఘా సంస్కృతిని పెంపొందించి రాజద్రోహ చట్టాన్ని ప్రయోగించటం సాధారణ మనిపించే ఆచరణ సాగిస్తోంది. ఆశ్చర్యకరంగా అనేక ప్రాంతాలలో ఈ రాజద్రోహ నేరారోపణ ప్రభుత్వాల చొరవతో చేయబడుతున్నవి కాకుండా, దేశంలోని ఏ ప్రాంతంలోనున్న వ్యక్తి అయినా ఈ సెక్షన్ క్రింద కేసు నమోదు చేస్తున్నాడు.

తమ విధులు నిర్వర్తించే క్రమంలో అమరులైన సైనికుల మరణాలను ప్రచార మాధ్యమాలు సంచలనాలుగానో, లేదా ఉద్వేగాలు రెచ్చగొట్టే విధంగానో ప్రసారం చేయరాదని ట్వీట్ చేసిందని కొందరు బిజెపి కార్యకర్తల నివేదికల ఆధారంగా ఇటీవల కాలంలో అస్సామ్‌కు చెందిన శిఖాశర్మ అనే రచయిత్రిని రాజద్రోహ నేరంపై అరెస్టుచేసి జైలుపాలు చేశారు. రాజద్రోహ నేరారోపణ ఎంత విచ్చలవిడిగా దుర్వినియోగం చేస్తున్నారో ఈ ఘటన తెలుపుతోంది.

ఢిల్లీ జెఎన్‌టియుకు చెందిన కన్హయకుమార్ మొదలగు విద్యార్థి నాయకులపైనా, అరుంధతీ రాయ్, హార్దిక్‌పటేల్, దిశరవి మొదలైన వారిపైనా, కూడంకుళమ్‌లో అణువిద్యుత్ కేంద్ర స్థాపనకు వ్యతిరేకంగా ఉద్యమించిన వారిపైనా, వినాయక్‌సేన్, నారాయణసన్యాల్, షియూష్‌గుహ, అషీమ్ త్రివేది, దివ్యస్పందన, హిరెన్ గోహెన్‌లపైనా, శశిథరూర్, శ్రేయాసింఘాల్ తదితరులపైనా, వయోవృద్ధులైన వరవరరావు, పూర్తిస్థాయి అంగవైకల్యం, అనారోగ్యంతోనున్న ప్రొ॥సాయిబాబాపైన, బీమాకొరెగావ్ కేసు ముద్దాయిలపైనా రాజద్రోహ నేరం మోపారు. కేసును రుజువు పరిచే సాక్ష్యాధారాలేమీ లేకున్నా, ఈ నేరం మోపి జైలుకు పంపి దశాబ్దాలకాలం హింసకు గురిచేయటం జరుగుతోంది. తాజాగా లక్షద్వీప్ ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కాపాడాలన్న ఆయూషా సుల్తానా అనే సినీనటిపై రాజద్రోహం కేసు బనాయించారు.

ప్రజల ప్రాథమికహక్కులను పరిరక్షిస్తామన్న సుప్రీంకోర్టు తన పవిత్ర కర్తవ్యాన్ని నిర్వర్తించకుండా అలసత్వం ప్రదర్శించటం ఎప్పుడో ప్రారంభమైంది. కాశ్మీర్ అంశం, సిఏఏ, హెబియస్ కార్పస్ వంటి రాజ్యాంగపరమైన అంశాలకు సంబంధించి చర్యలు చేపట్టటంలో సుప్రీంకోర్టు విఫలమైంది.

మునావర్ ఫరూకి అనే హాస్యనటుని కేసులో మధ్యప్రదేశ్ హైకోర్టు కూడా అతని బెయిల్ పిటిషన్‌ను నిరాకరిస్తూ భావప్రకటనకు, వ్యక్తీకరణ హక్కుకు పరిమితులుంటాయని ప్రకటించి, వ్యక్తిగత స్వేచ్ఛపట్ల తన తిరస్కారాన్ని, నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది.

సుప్రీంకోర్టు గత ప్రధానన్యాయమూర్తి ఎస్ఏ బోబ్డే ఒక పిటిషన్ విచారణ సందర్భంగా ఫిర్యాది తరపు న్యాయవాదితో మాట్లాడుతూ రాజ్యాంగంలోని 32వ అధికరణం క్రింద వ్యక్తులు దాఖలు చేసే కేసులను సుప్రీంకోర్టు "నిరుత్సాహపరిచేందుకు ప్రయత్నిస్తోందని" వ్యాఖ్యానించాడు. ఈవిధంగా రాజ్యాంగం పేర్కొంటున్న, హామీ ఇస్తున్న వ్యక్తిగత స్వేచ్ఛను పరిరక్షించే తన కర్తవ్యాన్నుండి సుప్రీంకోర్టు సంపూర్ణంగా తప్పుకోవటానికే నిర్ణయించుకుందని స్పష్టమౌతోంది.

**(తరువాయి 14వ పేజీలో)**

# మేడే-2021 ప్రపంచ మహమ్మారిపై పోరులో అతలాకుతలమౌతున్న కార్మికవర్గం

సుబోధ్ వర్మ

ఈ సంవత్సరపు మేడే రోజున భారత కార్మికవర్గం కోవిడ్-19 సృష్టించిన భయంకర విలయంలో కొట్టుమిట్టాడుతోంది. ఇప్పటికే గత సంవత్సరకాలంగా ఎంతోమంది ఈ వ్యాధి కారణంగా ప్రాణాలు కోల్పోయారు. ఇది ఎవరికైనా వచ్చే అవకాశం వున్నప్పటికీ, దాని దుష్పరిణామాల నెదుర్కొంటున్నది ఎక్కువగా పేద వర్గాలే.

– ప్రజారోగ్య వ్యవస్థ మూడొంతులు పైగా ప్రైవేటు కబంధహస్తాల్లో చిక్కుకొని వున్న కారణంగా అనేకమంది శ్రామికులకు ఆరోగ్య రక్షణ అన్నది ఎండమావిగానే మిగిలింది. ఫలితంగా వివిధ ప్రాంతాల్లో అనేకులు కరోనా వైరస్ సృష్టించిన విధ్వంసానికి బలైపోయారు.

– అన్నిటికన్నా గత సంవత్సరం హటాత్తుగా, ఏవిధమైన ముందు చూపు లేకుండా నరేంద్రమోడీ ప్రభుత్వం విధించిన లాక్‌డౌన్ శ్రామికుల జీవితాలను అల్లకల్లోలం చేసింది. నిరుడు ఏప్రిల్‌లో ఫ్యాక్టరీలు, ఆఫీసులు మూతబడి నిరుద్యోగం ఒక్కసారిగా 24శాతం పైకెగసింది.

– 2021 ఆరంభంలో మహమ్మారి వెనుకంజవేసిందని మోడీ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టించింది. ప్రధానమంత్రి, ఆరోగ్య శాఖామంత్రి ఇండియాలో మహమ్మారి తుడిచి పెట్టుకుపోయిందని పలు ప్రకటనలు చేశారు. అంతేకాకుండా వ్యాక్సిన్లు అందరికీ త్వరలో అందుబాటులోకి వస్తాయని, భవిష్యత్తులో వైరస్ నుండి రక్షణ కల్పిస్తాయని చెప్పారు. ఇది చాలా అనర్థానికి దారితీసింది. చాలామంది శాస్త్రవేత్తలు ఊహించినట్లుగా కరోనా రెండవ అల చాలా ఉధృతంగా భారతదేశంపై విరుచుకుపడింది. ప్రతిరోజూ నాలుగు లక్షలకు దగ్గరగా కొత్తకేసులు నమోదవుతూ రోజు రోజుకూ ఆ సంఖ్య పెరుగు తున్నది. ప్రజలు ఆక్సిజన్ కొరకు, మందుల కొరకు, రవాణా సౌకర్యాల కొరకు, హాస్పిటళ్ళలో బెడ్లకొరకు అల్లాడి పోయారు. గౌరవప్రదమైన అంతిమ సంస్కారాలు కూడా కరువయ్యాయి.

గత సంవత్సరపు లాక్‌డౌన్ దుష్ఫలితాలను దృష్టిలో పెట్టుకుని లాక్‌డౌన్ విధించటానికి భయపడిన కేంద్రప్రభుత్వం ఈ మహమ్మారిని ఎదుర్కొనే బాధ్యతను రాష్ట్రప్రభుత్వాలపైకి నెట్టివేసింది. దానివల్ల ఒకచోట రాత్రిపూట కర్ఫ్యూ, ఒకచోట వారాంతపు లాక్‌డౌన్ ఇలా ఏ రాష్ట్రానికా రాష్ట్రం చర్యలు తీసుకున్నాయి. దుర్మార్గమేమంటే ఇప్పుడు కూడా గత సంవత్సరం మాదిరే శ్రమచేస్తే తప్ప గడవని కష్టజీవుల సమస్య పూర్తిగా నిర్లక్ష్యం చేయబడింది. వ్యాధి ప్రబలిన పరిస్థితుల్లో కూడా కుటుంబంలో ఎవరో ఒకరు పనిచేయకపోతే గడవని స్థితిలో వైరస్‌ను ఎదుర్కోవటానికి, తమ రోజువారీ అవసరాలు తీర్చుకోవటానికి ఆదాయాలు బాగా తగ్గిపోయి వారెన్ని అవస్థలకు గురయ్యారనేది మాటల్లో చెప్పలేనిది.

## ఆర్థికంగా చేయూతనివ్వటం

పది కార్మిక సంఘాలు, ఇంకా పలు విభాగాలకు చెందిన సంస్థలతో కూడిన కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక ఈ మేడే సందర్భంగా ఎంతో ముఖ్యమైన, సహేతుకమైన డిమాండ్లను ముందుకు తెచ్చింది. కోవిడ్ మహమ్మారి కారణంగాను, ప్రభుత్వాలు విధించిన వివిధ నిషేధాజ్ఞల ఫలితంగాను ఉపాధి కొరకు ప్రజలు బయటకు వెళ్ళలేని స్థితి వున్నందున ఆదాయపు పన్ను చెల్లించనవసరం లేని అల్పాదాయ కుటుంబాల వారందరికీ రాబోయే నెలల్లో నేరుగా నెలకు రూ.7500 లు చొప్పున చెల్లించాలని డిమాండు చేసింది. రాబోవు 6 నెలల్లో కుటుంబంలో ఒక్కొక్కరికి 10 కేజీల చొప్పున ఆహారధాన్యాలు సరఫరా చేయాలని డిమాండు చేసింది. ఇవి రెండూ పరిమితులతో కూడిన డిమాండ్లైనప్పటికీ కోవిడ్ కారణంగా విశాల ప్రజానీకం పనిచేయలేని పరిస్థితుల్లో వారికి సహాయకారిగా వుంటాయి.

గత సంవత్సరం కూడా ఆకలి, ఆర్తనాదాలు మిన్నంటాయి. జన్‌ధన్ ఖాతాల్లో ప్రభుత్వం 500 రూ॥ల అతి తక్కువ మొత్తాన్ని జమచేసింది. పేదప్రజల్లో చాలా తక్కువ మందికి మాత్రమే ఈ ఖాతాలున్నాయి. కొద్ది నెలలపాటు మనిషికి 5 కేజీల చొప్పున ఆహారధాన్యాలు సరఫరా చేసింది. ఇది ఏమాత్రం సరిపోయేది కానప్పటికీ అదే కోట్లాది మందికి ఎంతో ఊరటనిచ్చింది.

ఈ నేపథ్యంలో కార్మికసంఘాల ఉమ్మడి వేదిక గత సంవత్సరపు తప్పుడు విధానాల ఫలితంగా ఎంతో నష్టపోయిన, ఇప్పుడు ఉపాధి కోల్పోతున్న ప్రజానీకాన్ని ఆదుకోవటానికి సమగ్రమైన డిమాండ్లను రూపొందించింది.

## మేడే 2021 డిమాండ్లు

1. వ్యాక్సిన్ ఉత్పత్తిని వేగవంతంచేసి అందరికీ ఉచితంగా నిర్దిష్టకాల పరిమితిలో వ్యాక్సిన్ వేయాలి. ఆక్సిజన్ అందక రోగులు అల్లాడుతున్న స్థితిలో తక్షణమే ఆక్సిజన్‌ను ఉచితంగా అవసరమైన వారందరికీ అందజేయాలి.

---

**రాజద్రోహ...****(13వ పేజీ తరువాయి)**

ఈ మొత్తాన్ని పరిశీలించిన స్వీడన్‌కు చెందిన 'వి-డెమ్' అనే సంస్థ వేగంగా నిరంకుశ దేశాలుగా మారుతున్న పది ప్రపంచ దేశాల జాబితాలో మనదేశాన్ని పేర్కొంది. "ప్రచార మాధ్యమాలకు, పౌరసమాజానికి, ప్రతిపక్షానికి అవకాశాలను తీవ్రంగా కుంచించివేయటం ద్వారా ప్రజాస్వామిక వ్యవస్థగా అది తన హోదాను కోల్పోతూ చివరి అంచుపై నిలిచివుంద"ని పేర్కొంది.

'టైమ్' పత్రిక తన కథనంలో "విద్వేష భాషణమే జీవితం. శాంతియుత అసమ్మతి నేరపూరితం; భావప్రకటనా స్వేచ్ఛ, సమీకృతం కావడం అనేవి నూతన నిర్బంధాలను ఎదుర్కొంటున్నాయి. రాజకీయ ఖైదీలు, శాంతియుత అసమ్మతివాదులతో జైళ్ళని నింపివేయటమే న్యాయవ్యవస్థ పనిగా తోస్తోంది" అని సరిగ్గానే మనదేశ పరిస్థితిని చిత్రీకరించింది. మొత్తంగా చూస్తే మోడీ ప్రభుత్వం తన ఆధిపత్య పిడికిలిని బిగిస్తోందని అర్థమౌతోంది.

కామ్రేడ్ టి.ఎన్. తన ప్రసిద్ధ కోర్టు ప్రకటన 'తాకట్టులో భారతదేశం'లో పేర్కొన్న విధంగా భారతపాలనా వ్యవస్థ సహజ, మౌలిక స్వభావాన్ని దేశంలోని ప్రజాస్వామికశక్తులు అర్థంచేసుకున్నప్పుడు, భారతదేశంలో పాలక వర్గం, రాజ్యంయొక్క వివిధ దాడులను తట్టుకునే విధంగా, ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షల కనుగుణంగా నిలకడగా ప్రజాస్వామిక హక్కుల ఉద్యమం నిర్మితమై తీరుతుందన్నది వాస్తవం.

భావప్రకటన, వ్యక్తీకరణ స్వేచ్ఛ, ప్రాథమిక హక్కుల పరిరక్షణకోసం ప్రజలు పోరాడి తీరాల్సిన అవసరాన్ని ప్రస్తుత వాతావరణం నిర్దేశిస్తోంది. ఈ హక్కును సాధించుకోవాలంటే అనాగరికమైన రాజద్రోహ చట్టాన్ని మొత్తంగా రద్దుచేయాలి.

ప్రజాస్వామ్యశక్తులు, హక్కుల సంఘాలు ప్రజలలో ప్రజాస్వామిక చైతన్యాన్ని పెంపొందించి, వారిని సమీకరించి పోరాటాన్ని చేపట్టాలి. ✶

2. కోవిడ్ ముప్పును ఎదుర్కోవటానికి అవసరమైనన్ని హాస్పిటల్ బెడ్లను, ఇతర వైద్య సదుపాయాలను కల్పించాలి.
3. ప్రజావ్యతిరేకమైన, వివక్షతో కూడిన, కార్పొరేట్లకు అనుకూలమైన వ్యాక్సిన్ విధానాన్ని రద్దుచేయాలి.
4. ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయటానికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలి. అందుక వసరమైన సిబ్బందితో ప్రజారోగ్య వ్యవస్థను భర్తీచేయాలి.
5. విపత్తు నివారణా చట్టం కింద తీసుకునే కర్ఫ్యూ, లాక్‌డౌన్ వంటి నిబంధనలను అన్ని సంస్థలకు పటిష్టంగా అమలు చేయాలి. వేతనాల్లో కోతలు, రిట్రెంచ్ మెంట్లు, అద్దెఇళ్ళను ఖాళీ చేయించటం వంటి వాటిపై నిషేధాజ్ఞలు విధించాలి. వాటిని పటిష్టంగా అమలుచేయాలి.
6. కార్మిక వ్యతిరేక లేబరుకోడ్‌లను, ప్రజావ్యతిరేక వ్యవసాయ చట్టాలను, విద్యుత్‌బిల్లు 2020ని రద్దుచేయాలి.
7. పెట్టుబడుల ఉపసంహరణను, ప్రైవేటీ కరణను నిలుపుదల చేయాలి.
8. ఆదాయపు పన్ను పరిధిలోకి రాని కుటుంబాల అన్నింటికీ నెలకు రు.7500/- అందజేయాలి.
9. వచ్చే ఆరు నెలలకు ప్రతి మనిషికి నెలకు 10 కేజీల చొప్పున ఆహారధాన్యాలు సరఫరా చేయాలి.
10. కోవిడ్ మహమ్మారి నియంత్రణలో ముందు పీఠిన నిలబడి పనిచేసే వైద్య సిబ్బంది అందరికీ, అంగన్‌వాడీలు, ఆశావర్కర్లతో సహా రక్షణ సదుపాయాలు, బీమా సౌకర్యం కల్పించాలి.

## కోవిడ్ మహమ్మారిని నిలువరించటం

పైన పేర్కొన్న డిమాండ్లలో కోవిడ్-19 ను సమర్ధంగా ఎదుర్కొనేందుకు కొన్ని డిమాండ్లు వున్నాయి. వ్యాక్సిన్ ఉత్పత్తిని వేగవంతం చేయాలని, నిర్దిష్ట కాలపరిమితిలో అందరికీ ఉచితంగా వ్యాక్సిన్లు వేయాలని కార్మికసంఘాలు కోరుతున్నాయి. ఎవరికైనా ఇది సబబే అనిపిస్తుంది. కానీ కేంద్రప్రభుత్వం మాత్రం ఈ వ్యాక్సిన్ల ఉత్పత్తి, అమ్మకాలను ప్రైవేటు కంపెనీలకు కట్టబెట్టింది. ఆ కంపెనీలు ఎంత ఎక్కువ ధరకు రాష్ట్రప్రభుత్వాలకు అమ్మాలా అని ఆలోచిస్తున్నాయి.

ప్రపంచ వ్యాక్సిన్ తయారీ దిగ్గజ కంపెనీల్లో ఒకటిగా చెబుతున్న “సీరం ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా” కోవిషీల్డ్ వ్యాక్సిన్ (ఆక్స్‌ఫర్డ్ ఆస్ట్రాజనికా వ్యాక్సిన్ వంటిది)ను రాష్ట్రప్రభుత్వాలకు ఒక డోసును 300 రూ॥లకు అమ్ముతుండగా, భారత్ బయోటెక్ తన కోవాగ్జిన్‌ను 400 రూ॥లకు అమ్ముతోంది, ప్రైవేటు హాస్పిటళ్ళకు 1200 రూ॥లకు అమ్ముతోంది. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన వ్యాక్సినేషన్ ప్రక్రియ ఇది. కోవీషీల్డ్ యూరప్‌లో 1.78 యూరోలకు(160 రూ॥) లభిస్తుండగా, అమెరికా, బంగ్లాదేశ్‌లలో 4 డాలర్లకు (300 రూ॥)కు, బ్రెజిల్‌లో 237 రూ॥లకు, ఇంగ్లండులో 226 రూ॥కు లభిస్తోందని కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక తెలియజేసింది. ప్రజల కష్టాల నుంచి కూడా మోడీ ప్రభుత్వం ప్రైవేటు రంగానికి ఎలా లాభాలు చేకూర్చి పెడుతుందనే దానికి ఇది మరో ఉదాహరణ.

ప్రజలందరికీ ఉచిత వ్యాక్సినేషన్‌తో పాటు ప్రజారోగ్య వ్యవస్థలో మౌలిక సదుపాయాలను వేగంగా పెంపొందింపజేయాలని ఉమ్మడి వేదిక డిమాండు చేస్తోంది. శిక్షణపొందిన కొత్త సిబ్బందిని ఆసుపత్రుల్లోనూ, ఆరోగ్య కేంద్రాల్లోను విధుల్లోకి తీసుకోవాలని, ఆక్సిజన్ సరఫరాను పెంచి అవసరమైన వారందరికీ అందుబాటులోకి తేవాలని అది డిమాండు చేస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోనూ, పట్టణాల్లోని కార్మిక నివాస ప్రాంతాల్లోనూ ఆరోగ్య సలహాలనిచ్చి అవగాహన కల్పించే ఎంతో కీలకమైన పనిని నిర్వర్తిస్తున్న ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు కోవిడ్ నుండి, ఇతర ఇన్ఫెక్షన్ల నుండి రక్షణ కల్పించే సామాగ్రిని అందజేయాలని, వారికి బీమా సౌకర్యం కల్పించాలని డిమాండు చేస్తోంది. గత సంవత్సర కాలంగా వారు ప్రాధమిక ఆరోగ్యం, పోషకాహారం మొదలగు వాటిపై అవగాహన కల్పించటం మాత్రమే కాకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, సెకండరీ ఆరోగ్య కేంద్రాల్లో ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించేవారుగా అలుపులేకుండా పనిచేస్తున్నారు.

## ఉపాధి కోల్పోవటం, ఇళ్ళనుండి వెళ్ళగొట్టబడటం

ఉమ్మడి వేదిక మరో కీలకమైన అంశాన్ని డిమాండ్లలో చేర్చిందేమంటే విపత్తు నివారణా చట్టం కింద కదలికలపై నిషేధాజ్ఞలు విధించటం, పని స్థలాలను మూసివేయటం వంటివి జరిగినప్పుడు ఏ కార్మికుడు, ఉద్యోగి కూడా పనిని పోగొట్టుకోకుండా, పూర్తి జీతాన్ని పొందేలా చర్యలు తీసుకోవాలి. ఈ కారణంగా కార్మికులకు పనిపోయినప్పుడు, వారికి డబ్బు సంపాదించే అవకాశం లేనప్పుడు గృహ యజమానులు వారిని అద్దె చెల్లించనందున ఇళ్ళనుండి వెళ్ళగొట్టకుండా చూడాలి.

ఈ డిమాండ్లు గత సంవత్సరం కూడా వచ్చాయి. కానీ ప్రభుత్వం పెడచెవిన పెట్టిన ఫలితంగా దేశవ్యాప్తంగా లక్షలాదిమంది వలస కార్మికులు తమ పనిప్రదేశాలను వదలి వేల కిలోమీటర్ల దూరాన వున్న తమ స్వస్థలాలకు పయనమయ్యారు. రవాణా సౌకర్యాలు లేనందున కాలినడకన వెళ్తూ ఈ క్రమంలో ఎందరో ప్రాణాలు కోల్పోయారు. ప్రజలందరూ తీవ్ర కష్టనష్టాలు పడుతున్న ఇలాంటి స్థితిని కూడా ఉపయోగించుకొని మోడీ ప్రభుత్వం ఎవరి ఊహకూ అందని విధంగా పలు చట్టాలు చేసింది. ప్రజల ఉపాధి అవకాశాలను, ఆదాయాలను ప్రమాదంలో పడవేసే చట్టాలవి. కార్పొరేట్ వ్యవసాయానికి అనుకూలంగా, ఆహారధాన్యాల వ్యాపారాన్ని ప్రైవేటువాళ్ళకు అప్పజెప్పే చట్టాలవి. ఈ చర్యలు ఉపాధి అవకాశాలను, వేతనాలను తగ్గిస్తాయి. రైతులు, రైతుకూలీలు కార్పొరేట్ల వద్ద బానిసల్లా బ్రతకాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

## మౌనంగానే - కానీ, దృఢదీక్షతో-మేడే

గత సంవత్సరం మేడే కంటే ఈ మేడే మరింత నిశ్శబ్దంగా జరగబోతోంది. ఈసారి మహమ్మారి ఉధృతి మరింత తీవ్రంగా వుండి గత సంవత్సరం సంభవించిన నష్టాలకు మరింత తోడై ప్రజల జీవితాలను అతలాకుతలం చేసింది. దేశవ్యాప్తంగా ఎక్కడికక్కడ ఫ్యాక్టరీల గేట్ల ముందు చిన్న చిన్న సమూహాలు ఎర్ర జండాలను ఆవిష్కరించాలని, ఆన్‌లైన్ మీటింగులు కూడా ఏర్పాటు చేసుకోవాలని ఉమ్మడి వేదిక సూచిస్తోంది.

పైన పేర్కొన్న డిమాండ్లకు అనుగుణంగా, ప్రభుత్వరంగాన్ని ప్రైవేటీకరించే క్రమానికి వ్యతిరేకంగా, కార్మిక వ్యతిరేక, రైతువ్యతిరేక చట్టాల రద్దుకై, ఆర్థిక స్వావలంబనకోసం దృఢమైన పోరాటం కొనసాగుతుంది.

మహమ్మారి ఉధృతినుండి దేశ ప్రజలను రక్షించే పోరాటం ఆర్థిక పరిస్థితిని నిలకడగా వుంచే పోరాటంతో ముడిపడి వుంటుంది. దృఢమైన సంకల్పంతో, శక్తితో ఈ రెంటినీ సాధిద్దామని ఈ మేడే నాడు ప్రతినబూనుదాం. ✱

**Read !** **Subscribe!!**


Organ of Central Committee of CPI (ML)

# ‘గిగ్’ ఆర్థిక వ్యవస్థ, ‘అల్గారిధమ్’ నిఘాలతో కార్మికులపై మరింత తీవ్రమౌతోన్న శ్రమదోపిడి

**‘గిగ్’** అంటే తాత్కాలిక ఉపాధి; గిగ్ ఆర్థిక వ్యవస్థ అంటే తాత్కాలిక కార్మికులు; ప్లాట్‌ఫాం కార్మికులు, ఫ్రీలాన్సర్స్; స్వతంత్ర కాంట్రాక్టర్స్; ఒప్పంద కార్మికులు మరియు నిర్దిష్ట పనికోసం నియమించబడిన కార్మికులతో కూడిన స్వేచ్ఛా మార్కెట్ వ్యవస్థ. విద్యార్థులు చదువుకునే దశలో ప్రయోగాత్మకంగా చేసే ఇంటర్న్ షిప్స్ కూడా గిగ్ ఆర్థిక వ్యవస్థలో భాగమౌతున్నాయి.

‘గిగ్’ పని అనేది సాధారణంగా నాలుగు లక్షణాలను కలిగివుంటుంది. వాటిలో(1) నిర్దిష్ట పనివేళలు లేకపోవటం (2)కార్మికులే కొంత భాగం లేదా అవసరమైన మొత్తం పెట్టుబడిని (ఉదా:మొబైల్ ఫోన్లు, కార్లు, బైకులు) వంటి వాటిని సమకూర్చుకోవటం (3)పీస్ రేట్ పనివిధానం ద్వారా వేతనం పొందటం (4)కంప్యూటర్ వేదికలే (డిజిటల్ ప్లాట్ ఫార్మ్లు) ఈ పనినంతా అప్పగించటం లేదా సమన్వయం చేయటం. అందువలనే ఈ ‘గిగ్’ ఆర్థికాన్ని ప్లాట్ ఫాం ఆర్థికమని కూడా పిలుస్తారు.

సమాచార సాంకేతిక రంగానికి చెందిన స్వతంత్ర స్థిర ఉద్యోగులను పూర్తిస్థాయి ‘గిగ్’ కార్మికులుగా చూపటానికి, ఈ పనిలోని సౌలభ్యతను కార్మికులు గుర్తిస్తే భవిష్యత్తులో ఈ తరహా పనినే ఎంచుకుంటారనే విధంగా చిత్రీకరించటానికి కార్పొరేట్ ప్రసార సాధనాలు ప్రయత్నిస్తుండగా, వాస్తవం మాత్రం భిన్నంగా వుంది. గిగ్ ఆర్థిక వ్యవస్థలో కార్మికులకు–కనీస వేతనాలుండవు; ఓవర్‌టైమ్‌కు చెల్లింపులుండవు; వేతనంతో కూడిన వైద్య శలవులుండవు; వేతనంలో కోత జరగకుండా రక్షణలుండవు; వివక్షతా వ్యతిరేక చట్టాల నుండి, వృత్తిపరమైన భద్రతా రక్షణల నుండి దూరమౌతారు. వాస్తవానికి ఈ పనివిధానం – హక్కులే లేని పారిశ్రామిక విప్లవ ప్రారంభ దినాలలోకి కార్మికులను తీసుకు వెళ్తుంది. న్యూయార్క్ నగరంలోని అత్యధిక కార్మికులను ఇముడ్చు కుంటున్న ‘ఆన్ డిమాండ్’ ఫుల్‌ఫిల్‌మెంట్, ‘డెలివరీ’ మార్కెట్లలోని కార్మికులు అత్యధిక దోపిడీకి గురవతున్నారు. ఈ ‘సౌలభ్య’ ఉద్యోగ ఏర్పాట్లు – సామాజిక బాధ్యతలు, మార్కెట్ సమస్యలతో కార్మికులను అస్థిరతకు గురి చేస్తున్నాయి.

ఉబర్, లిఫ్ట్, టూరో/ఫైవర్, ఫుడోరా, డెలివరూ, అమెజాన్, స్విగ్గీ, జొమాటో మొదలైన కంపెనీలు గిగ్ ఆర్థికవ్యవస్థలో అత్యధిక పెద్ద యాజమాన్య సంస్థలుగా వున్నాయి.

## ప్లాట్‌ఫాం ఆర్థిక వ్యవస్థ నమూనా

జర్మనీకి చెందిన ఫుడోరా, ఇంగ్లండుకు చెందిన డెలివరూ సంస్థలు కోరిన వారికి ఆహారాన్ని ఇంటివద్దకే చేరవేసే ఆహార బట్వాడా సంస్థలు. ఈ సంస్థల ద్వారా వినియోగదారులు స్థానిక హోటళ్ళనుండి తమకు కావలసిన ఆహార పదార్థాలను తెప్పించుకోవచ్చు. ఈ రెండు ఆహార బట్వాడా సంస్థలలో కార్మికులు శ్రమచేసే క్రమమంతా ఒకటే విధంగా వుంటుంది. కార్మికులు ముందుగానే ఏర్పరచిన షిఫ్టుల ప్రకారం దీనికోసం నిర్దేశించిన ఒక ‘యాప్’ను తెరచి వుంచుతారు. ఈవిధంగా పనిని అందుకోవటానికి తాము అందుబాటులో వున్నామని తెలియజెప్తారు. ఎవరైనా ఒక వినియోగదారుడు తనకు కావాల్సిన ఆహార పదార్థాన్ని కోరిన వెంటనే, ఆ వినియోగదారుడు కోరుకున్న హోటల్ నుండి ఆమోదాన్ని తీసుకుని, బట్వాడాచేసే కర్తవ్యాన్ని అల్గారిధమ్ (ఎప్పటి కప్పుడు సమాచారాన్ని క్రోడీకరించి, వర్గీకరించే కంప్యూటర్‌లోని ఒక వ్యవస్థ) ద్వారా ఆటోమేటిక్‌గా ఎంపికగా చేయబడిన ఒక కార్మికునికి ఆదేశాన్ని పంపుతుంది. ఈ కర్తవ్యాన్ని గనుక ఒకసారి ఆమోదిస్తే, కార్మికుడు నిర్దేశిత హోటల్‌కు వెళ్ళటం, వినియోగదారుడు కోరిన ఆహార పదార్థాలను తీసుకోవటం, మోటార్ సైకిల్, మోపెడ్ లేదా కారుపై వినియోగదారుని ఇంటివద్దకు దానిని చేరవేయటం జరుగుతుంది. ఈ మొత్తం పని సాగే క్రమంలో కార్మికుని కదలికలన్నీ–అతను ఎక్కడవున్నదీ, అతని పనివిధానం ఎలా వున్నదీ–వంటివన్నీ కార్మికుని స్మార్ట్ ఫోన్‌ద్వారా ప్రత్యక్ష ప్రసారం అవుతూ, నమోదు చేయబడుతుంటాయి. కార్మికుని ఈ పనికి సంబంధించిన సమాచారాన్ని అల్గారిధమ్స్ సేకరించి, వినియోగదారునికి బట్వాడా చేసిన పదార్థం లేదా కార్మికునికి చెల్లించే పారితోషికం, శిక్ష లేదా జరిమానా లెక్కగడుతుంది. కొన్ని సమయాల్లో కార్మికుని శ్రమ పరిగణలోకే రాదు. ఈ అంచనాల ప్రాతిపదికలన్నీ ఏవిధంగా నిర్ణయిస్తారో తెలియని విధంగా చీకటిలో వుండి, కార్మికునితో సంబంధం లేకుండానే తరచుగా మారుతుంటాయి.

‘అల్గారిధమ్ నిఘా’ అనేది, ఈ లాంటి అత్యధిక సంస్థల సంస్థాగత పనివిధాని కంతటికీ కీలకంగా వుంది.

## ప్లాట్‌ఫాం కార్మికులను ముందుకు తెచ్చిన “అల్గారిధమ్”

దక్షిణ కొరియా దేశపు ‘అమెజాన్’ సంస్థగా పేర్కొనే ఆ దేశ అతిపెద్ద ఎలక్ట్రానిక్ వాణిజ్య ప్లాట్‌ఫామ్ కేపాంగ్ – బహుళ దొంతరల ఉద్యోగుల నిర్మాణాన్ని, అల్గారిధమ్ ద్వారా కార్మికులపై ఎల్లవేళలా నిఘా వుంచే విధానాన్ని కలగలిపి వినియోగిస్తూ యాజమాన్యానికి మరింత లాభాలను సమకూరుస్తూ, కార్మికులకు ప్రాణాంతకంగా పరిణమించింది. ఈ సంస్థలో పనిచేసే 8 మంది కార్మికులు (ఇద్దరు తాత్కాలిక సిబ్బందితోసహా) పనిభారం కారణంగా ఇటీవల చనిపోయారు. రాత్రి షిఫ్టులో పనిచేసే 48 సం॥ల వయస్సున్న ఫోర్‌మన్ దీనికి తాజా బాధితుడిగా వున్నాడు. ‘ఇ’ అనే అతని ఇంటిపేరు కారణంగా మాత్రమే అతనిని గుర్తించటం సాధ్యమైంది.

ఈ సం॥రం మార్చి మొదటి రోజుల్లో మెదడులో నరాలు చిట్లి అతను మరణించడానికి ముందు–రెగ్యులర్ ఉద్యోగి హోదా పొందటానికి అతను చాలా దగ్గరలో వున్నాడని ఒక సంవత్సరకాలంగా అతన్ని వూరించారు. అతను తన ఉద్యోగ కేంద్రంలో అవిశ్రాంతంగా కృషిచేస్తూ వచ్చాడు. అతని నిర్దేశిత పనిగంటల తర్వాత అతను కేపాంగ్ పర్యవేక్షణా యాప్ ద్వారా తన స్మార్ట్ ఫోన్‌లో అతను బట్వాడా చేసిన వస్తువుల ట్రాక్‌లను చెక్ చేసుకుంటూ వుండేవాడు. నిర్దిష్ట కాలపరిమితి ఒప్పందం క్రింద ఒక సం॥ర కాలం పైగా పనిచేస్తూ పూర్తికాలం కార్మికునిగా మారబోతున్నానని భావించాడు. తన తోటి కార్మికులను అధిగమించేందుకు మరో రెండు స్వల్పకాల ఒప్పందాలు కూడా కుదుర్చుకొని మరింత శ్రమించటం ద్వారా, 13 వేలమంది కార్మికులు పనిచేస్తున్న కేపాంగ్ సంస్థలో అగ్రభాగంలోనున్న 15.5 శాతం కార్మికులలోకి చేరుకోవాలని ఆశించాడు. అతను నూతన ఉద్యోగ ఒప్పందం కుదుర్చుకొని మరింతగా పనిచేస్తున్న రెండు రోజుల తర్వాత మరణించాడు.

కేపాంగ్ దక్షిణకొరియాలో 3వ అతిపెద్ద యాజమాన్య సంస్థగా వుంది. శామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్, హ్యూండాయ్ మోటార్స్ కూడా దీనితర్వాత స్థానంలోనే వున్నాయి. ‘ఇ’ వంటి ఒప్పంద కార్మికుల సేవకు తోడుగా, రోజువారీ

కూలీ ప్రాతిపదికన ఈ సంస్థ స్మార్ట్‌ఫోన్ యాప్ ద్వారా 'ఫుల్‌ఫిల్‌మెంట్' కేంద్రాలలో పనులకోసం 40 వేల మందిని తీసుకుంటున్నది. అస్థిర కార్మికులు అధికంగా వున్న కాలంలో 'యాప్'లపై ఆధారపడి పెద్ద సంఖ్యలో 'గిగ్' లేదా ప్లాట్‌ఫామ్ కార్మికులను తీసుకోవటం సాధ్యమౌతోంది. 2019 వరకు మెరుగైన జీవితాలకు మెరుగైన విధానాలకోసం పనిచేసే అంతర్జాతీయ సంస్థ అయిన 'ఆర్థిక సహకారం, అభివృద్ధి సంస్థ' (ఇసిడి) గణాంకాల ప్రకారం దక్షిణకొరియాలోని మొత్తం కార్మికులలో ప్రతి నలుగురిలో ఒకరు తాత్కాలిక కార్మికులుగా వున్నారు.

కేపాంగ్ సంస్థ తమ ప్లాట్‌ఫాంలో పనిచేసే కార్మికుల అనుపానులు, కదలికలపై ఆటోమేటిక్‌గా నిఘా వుంచగలిగే కార్యకలాపాలు అన్నింటినీ అల్గారిథమ్స్ వంటి ఉన్నత సాంకేతిక పరిజ్ఞానంపై ఆధారపడి నిర్వహిస్తోంది. ఆ సంస్థయొక్క ప్రజా సంబంధాల వీడియో పరిశీలించినా వారి 'ఫుల్‌ఫిల్‌మెంట్' కార్మికులు, అత్యంత వేగంగా భద్రతా చర్యలేమీ లేకుండా ఏవిధంగా పనులు నిర్వహిస్తున్నారో తెలుస్తుంది.

కార్మికులు ఎంతవేగంగా వస్తువులను వినియోగదారులకు, కోరుకున్నచోటుకు చేర వేస్తున్నారో, ఎంత మోతాదు పనిని నిర్వహిస్తున్నారో ఎప్పటికప్పుడు వారి ప్రతి ఒక్క కదలికను నమోదుచేసే ఒక ఎలక్ట్రానిక్ పరికరాన్ని ఆ కార్మికులు ఎప్పుడూ తమవెంటే వుంచుకోవాలి. వారి పని సామర్థ్యాన్ని యూనిట్స్‌లో కొలుస్తూ, ప్రతి గంటకూ ఎన్ని యూనిట్లు (యుపిహెచ్) పని నిర్వహించారో ఈ పరికరం నమోదు చేస్తుంది. యుపిహెచ్ అనేది గంటలవారీ కోటా కాదు; అందుకు బదులుగా కార్మికులందరినీ ఒకే వరుసలో ఒకరిపై ఒకరికి పోటీ బెట్టి, గంటవ్యవధిలో వారు సాధించిన పనిని కొలత వేయటం. ఈ విధానం కార్మికులందరినీ–కొత్తవారిని, అనుభవజ్ఞులైన వారిని–ఒకరితో ఒకరు పోటీపడి వేగంగానూ మరింత కష్టించి పనిచేసేలా చేస్తోంది. దీనిని అందుకునేందుకు వారు బాత్‌రూమ్‌కు వెళ్ళే సమయాన్ని కూడా వదులుకొని పనిచేస్తున్నారు. తరచుగా సూపర్‌వైజర్లు ఈ కార్మికులను బహిరంగంగా దూషించటం జరుగుతోంది. అంతిమంగా వీరికి నూతన ఒప్పందం లేదా 'గిగ్' పని నిరాకరించటం జరుగుతోంది.

కేపాంగ్ ఇదేతరహా మరొక విధానాన్ని అనుసరిస్తోంది. సరుకు బట్వాడా చేసేవారు మరింత అధికంగా, మరింత త్వరితంగా పనిచేసేందుకు గంటకు సగటు పని (ఏపిహెచ్)కొలతనుపయోగించి గంటల వారీగా కార్మికుల పనివిధానాన్ని పర్యవేక్షిస్తోంది.

'కేపాంగ్ ఈట్స్' సంస్థకు 2,10,000 మంది పైగా ఆహారం బట్వాడా చేసే కొరియర్లు వున్నప్పటికీ పరిస్థితి ఇంకా అధ్వాన్నంగా వుంది. కొరియర్లు (బట్వాడా చేసే కార్మికులు) పనిచేసే ప్రాంతం, పనివత్తిడి వుండే గంటల్లో చేసే పని మొదలైన అంశాలపై ఆధారపడి కేపాంగ్ సంస్థ తమ కొరియర్లకు వేతనం నిర్ణయించే సంక్లిష్ట విధానాన్ని ఉపయోగిస్తోంది. ఈ వేతనం ప్రతి ఐదు నిముషాలకు ఒకసారి కూడా మారే అవకాశం వుంది. ఆలీబాబా నుండి అమెజాన్ దాకా 'ఉబర్ ఈట్స్' నుండి 'డెలివరూ' వరకు వస్తురవాణా, సరఫరా సంస్థలన్నీ ప్రపంచ వ్యాపిత పెట్టుబడిదారులుంతా – కార్మికుల అనుపానులపై ఎల్లవేళలా నిఘా వుంచే 'అల్గారిథమ్స్'ను వుపయోగించి కార్మికులలో భయాందోళనలు కల్పించి, నిస్పృహ చెందిన కార్మికులనుండి మరింతగా శ్రమదోపిడీ సాగిస్తూ సూపర్ లాభార్జనలు సాగిస్తున్నారు.

కార్మికుల దుర్బలత్వం, అభద్రత, అస్థిరతలను సొమ్ముచేసుకుంటూ ఈ కంపెనీ లన్నీ చాలా దూకుడుగా ప్లాట్‌ఫామ్ కార్మికుల రూపంలో తాత్కాలిక, గిగ్ కార్మికులను దుర్మార్గంగా శుష్కించిపోయేలా తరచుగా వత్తిడి చేస్తున్నారు. కారుచౌకగా లభించే అనియంత్రిత గిగ్ కార్మికులే ఈ కంపెనీలకు లాభదాయంగా వుండి ముందుకు నడిపిస్తున్నారు.

ప్రపంచవ్యాపితంగా మరిన్ని కార్పొరేట్ సంస్థలు వారి వ్యాపార కార్యకలాపాలలో గిగ్ కార్మికులను నియమించుకోవాలని చూస్తున్నాయి. తద్వారా కార్మికులపట్ల వారి చట్టపరబాధ్యతల నుండి, కార్మికులకు కల్పించాల్సిన హక్కులనుండి నిర్భయంగా తప్పించుకోవచ్చని చూస్తున్నాయి.

## గిగ్ ఆర్థిక వ్యవస్థ గణాంకాలు

- అమెరికాలోని 36 శాతం కార్మికులు గిగ్ ఆర్థికంలో మునిగి వున్నారు. భారత దేశమేమీ వెనుకబడి లేదు; అమెరికా తర్వాత ప్లాట్‌ఫామ్ కార్మికుల సంఖ్యలో ఇండియా రెండవ స్థానంలో వుంది.
- అమెరికాలో ప్లాట్‌ఫామ్ కార్మికులు 2018 సం॥లో అమెరికా ఆర్థికవ్యవస్థకు 1.28 ట్రిలియన్ డాలర్లను సమకూర్చారు.
- గిగ్ ఆర్థికం ప్రస్తుతం సాగుతున్న నిష్పత్తిలో పెరిగితే 2027 నాటికి అమెరికాలోని 50 శాతంపైగా కార్మికులు దీని పరిధిలోకి వస్తారు.
- యువ జనాభాలో 42శాతం మంది ప్లాట్‌ఫామ్ కార్మికులుగా వున్నారు.
- భారతదేశ గిగ్ విభాగం 2024 నాటికి 17శాతం వార్షిక అభివృద్ధిరేటుతో 455 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని అంచనా.

సంఘటితపడే హక్కుకు రక్షణ కల్పించటం వంటి కార్మిక చట్టాల పునరుద్ధరణకోసం ఉద్యమాలను సాగించి, గిగ్ కార్మికులందరినీ ఒకే గొడుగు క్రిందకు తెచ్చేందుకు ట్రేడ్ యూనియన్ ఉద్యమం తీవ్రంగా ఉద్య మించాల్సిన అవసరం వుంది. ✶

# 'యాప్'లపై ఆధారపడిన టాక్సీ డ్రైవర్ల దుస్థితి

**'గిగ్'** (తాత్కాలిక కార్మికుల) ఆర్థికవ్యవస్థ మనదేశంలో విస్తరించటంతో, యాప్‌లపై ఆధారపడి పనిచేసుకునే 'ప్లాట్‌ఫారం కార్మికుల' సంఖ్య ఇటీవలి సంవత్సరాలలో అనూహ్యంగా పెరిగింది. ఈ కార్మికులకు హక్కులు, రక్షణ సౌకర్యాలేమీ వుండవు. యాప్ ఆధారిత సర్వీస్ కంపెనీల క్రూరమైన దోపిడీకి వీరు గురవుతున్నారు. మనదేశంలో యాప్ ఆధారిత ఉబర్, ఓలా టాక్సీ డ్రైవర్లుగా పనిచేస్తున్నవారు క్రూరమైన దోపిడీకి గురవుతున్నారు.

ఇటీవల కొత్తగా చట్టంగా రూపొందించిన నూతన కార్మికకోడ్‌లో 'గిగ్' కార్మికుల అంశాన్ని పరిగణలోకి తీసుకున్నామని కేంద్రప్రభుత్వం గొప్పగా ప్రకటించుకుంటున్నప్పటికీ, గిగ్ కార్మికులను, ప్లాట్‌ఫాం కార్మికులను నూతన వృత్తుల శ్రేణిలో వారిగా మాత్రమే నూతన లేబర్‌కోడ్ గుర్తించింది. కానీ వీరికెలాంటి హక్కులూ కల్పించలేదు. వీరు నిర్దిష్ట సామాజిక సౌలభ్యాలకు అర్హులని, వీటికోసం ఈ కార్మికులు అడగవచ్చునని మాత్రమే పేర్కొంది. ఈ ప్లాట్‌ఫాం లేదా గిగ్ కార్మికులు మెరుగైన, స్థిరమైన వేతనాల కోసం లేదా వారికి పనులను పురమాయించే 'అల్గారిథమ్స్' నియంత్రణకోసం న్యాయస్థానాలను ఆశ్రయించటానికి ఈ నూతన లేబర్‌కోడ్ అనుమతించదు. దీని అర్థం న్యాయస్థానాలు లేదా ప్రభుత్వాలు – యాజమాన్యాల చిత్తానుసారం వేతనాలు చెల్లించే లేదా అధిక గంటలు పనిచేయించే స్థితి నుండి – వీరిని బయట పడేయవు.

ఇటీవల అంతర్జాతీయ కార్మికసంస్థ యాప్ ఆధారిత టాక్సీడ్రైవర్ల గంటకు సగటు సంపాదన వివరాలను పరిశీలిస్తే అభివృద్ధి ➞

→ చెందుతున్న దేశాలతో పోలిస్తే, మనదేశం అత్యంత దిగువన వుందని కనుగొంది.

మనదేశంలో యాప్ ఆధారిత టాక్సీ డ్రైవర్లలో అత్యధికులు వారానికి సగటున 82 గంటలు పనిచేస్తారు. అభివృద్ధిచెందుతున్న దేశాలలో సాంప్రదాయకంగా టాక్సీలు నడిపే వారి యొక్క పనిగంటలకంటే, యాప్ ఆధారితంగా నడిపే టాక్సీ డ్రైవర్లయొక్క సగటు పనిగంటలు చాలా ఎక్కువ. ఈ అధ్యయనం ప్రకారం, మనదేశంలో యాప్ ఆధారిత టాక్సీడ్రైవర్లు రోజుకు సగటున 12 గంటలు పైగా పనిచేస్తున్నప్పటికీ, వారికి తగిన వేతనం లభించటంలేదు.

ఎక్కువ సంపాదనకు లేదా బోనస్ పొందటానికి డ్రైవర్లకు కొన్ని ఉచిత కొనుగోళ్ళు, లేదా ప్రేరేపకాలు వంటి అవకాశాలు కల్పించటం ఊరించటం జరుగుతోంది. దీనితో, విరామం లేకుండా త్వరగా పనిపూర్తిచేయటానికి డ్రైవర్లు సిద్ధపడుతున్నారు. అలా త్వరపడకపోతే, ఒక 'క్లయింట్'నో, ఒక 'ఆర్డర్'నో కోల్పోవలసి వస్తుందనే తొందరలో డ్రైవర్లు తరచుగా అధిక పనివత్తిడికి లోనవుతున్నారు. ఈ అధ్యయనం ప్రకారం, వేచివుండే సమయంతో సహా గంటల వారీగా మనదేశంలో డ్రైవర్ల సగటు సంపాదన- చిలీ, ఘనా, ఇండోనేషియా, కెన్యా, లెబనాన్, మెక్సికో, మొరాకో, యుక్రెయిన్ దేశాల డ్రైవర్ల సగటు సంపాదన కంటే అత్యంత తక్కువగా వుంది. మనదేశంలో గంటలవారీ సగటు సంపాదక 1.1. డాలర్లుకాగా, లెబనాన్‌లో అది 8.2 డాలర్లుగా వుంది.

వడ్డీ వ్యాపారుల నుండో లేదా బ్యాంకు నుండో అప్పుతీసుకొని అత్యధిక టాక్సీ డ్రైవర్లు వారి వాహనాలు కొనుగోలు చేస్తారు. పెరుగుతున్న ఇంధన ధరలు, వాహన నిర్వహణా ఖర్చులు, బ్యాంకులకు లేదా వ్యాపారులకు చెల్లించాల్సిన కిస్తీలు, వడ్డీలన్నీ కలిపితే ఖర్చులు భారమై రోజుకు 12, 13 గంటలపాటు పనిచేసి నప్పటికీ, ఆ ఖర్చులను అందుకోలేకపోతున్నారు.

క్యాబ్-అగ్రిగేటర్ ఫీజును ప్రస్తుతం వున్న 28 శాతం నుండి 10 శాతానికి తగ్గించాలని డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. అయితే, ఉబర్, ఓలా కంపెనీలు కార్మిక చట్టాలను ఎగవేసే తమ ఒప్పంద విధానాన్ని మార్చుకోవాలని భావించటంలేదు. యూనియన్లుగా సంఘటితమై తమ డిమాండ్లు పరిష్కరించాలని ఆందోళనలు చేసే డ్రైవర్లను ఈ యాజమాన్యాలు బెదిరిస్తూ, భయపెట్టే ఎత్తుగడలు అనుసరిస్తున్నాయి.

తమందరిని కార్మికులుగా గుర్తించాలని, తమ హక్కులను డిమాండ్ చేస్తూ అనేక దేశాలలో ఈ డ్రైవర్లు ఆందోళన సాగిస్తున్నారు. అయితే ఈ డ్రైవర్లందరూ తమకు వీలైన పనిగంటలను, పని ప్రదేశాన్ని వారే నిర్ణయించుకుంటూ స్వయం ఉపాధి పొందుతున్నారని ఈ కంపెనీలు నొక్కి చెపుతున్నాయి.

ఏమైనా, 2021 ఫిబ్రవరి 18న బ్రిటన్ సుప్రీంకోర్టు తన తీర్పులో, అమెరికా డ్రైవింగ్ కంపెనీ దిగ్గజం ఉబర్‌కు చెందిన డ్రైవర్లందరికీ కార్మికహక్కులు వర్తిస్తాయని పేర్కొంది. ఈ డ్రైవర్లు అందించే సేవలను 'అత్యంత సంక్లిష్టంగా నిర్వచించి, ఉబర్ అదుపు చేస్తోందని' అందువలన వారిని స్వయం ఉపాధి పొందుతున్న వారిగా పరిగణించజాలమని ఆ తీర్పులో పేర్కొంది. ఉబర్ యాప్ ఆధారిత సేవలందించే డ్రైవర్లను ఆ ఉద్యోగం చేస్తున్న వారిగానే పరిగణించాలని ఈ తీర్పు స్పష్టం చేసింది. కనీస వేతనాన్ని లెక్కగట్టటానికి, శలవుతో కూడిన వేతన చెల్లింపులకు ఈ తీర్పు తోడ్పడగలదు. భారతదేశంలోని యాప్ ఆధారిత డ్రైవర్లు తమ హక్కులకోసం పోరాడి, వాటిని సాధించుకోవటానికి ఈ తీర్పు దోహద పడుతుంది. ★

## కా॥ టి.ఎన్-మా విప్లవ జెండా

అజ్ఞాత

ఆకాశానికీ పెరాల్సిసే
సముద్రం వైపు వంగింది
ఉత్తరధృవం వంగింది
పెరాల్సిస్ లేనిదెక్కడ
ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలోనే
థీసిస్‌లో పెరాల్సిస్
28 తెల్లవారుఝామున
కాలానికి కందెన లేక
భారంగా తిరిగింది
మొయిలు చాటున నక్షత్రం
వెలుగునే మరచింది
ఈ రోజునే
12 సంవత్సరాలుగా
ప్రపంచం ఎరుగని రీతిలో
భూమి పగిలింది

కాలం క్షణకాలం
స్థంభించింది (జీరో అవర్లో)
భారత విప్లవ స్వీయశక్తి
కుంటుపడింది కొంతకాలం
కాలం ఆగలేదు
సూర్యుడు చీలుస్తుంటే
తొలిరేఖలు నింపుకుంది
విప్లవ స్వీయశక్తి ఆగబోదు
నీ కృషితో మారు రూపం పొందింది
ఔను
నిన్ను మట్టుబెట్టాలనుకున్న వేటకుక్కలకు
నీ మరణం ఆనందం
నీ ప్రాణాన్ని (విప్లవ సిద్ధాంతాన్ని)
తూట్లు పొడవాలనుకునే మితవాదులకు
ఈ దినం పర్వదినం

అతివాదులు
తమ మృతముఖంలో
సన్నని హాసరేఖను
చిందించవచ్చునేమో కూడా
కాని
లెనిన్ మరణించినా
లెనినిజం అజేయమని
జినోవివ్, కామెనీవ్‌కు
కాలం కొద్దిలోనే
ఎలుగెత్తి చాటింది
మనకు తెలుసు
మనకు, మృత్యువుకి
బుల్లెట్ దూరం
మాత్రమేనని
అయినా
మృత్యువుకి
ఎదురుగా కాదు
మన పయనం
మృత్యు శిఖరాలను కూల్చాలని
సర్వశాంతి నెలకొల్పాలని
కామ్రేడ్ నాగిరెడ్డీ
నీవు మాకు ఆదర్శం
మాకు ఉత్తేజం
నీ మరణం ఎవరెస్టు శిఖరం
కొద్ది మందే చేరగల దూరం
అందుకే
నీవు మా విప్లవ జెండా
ఎల్లప్పుడు మా హృదయం నిండా

# 'అమెజాన్'లో యూనియన్ ఏర్పాటు

**దాదాపుగా** గత సంవత్సర కాలంగా, ప్రాణాంతక మహమ్మారి నడుమనే, అమెజాన్ సంస్థకు చెందిన 'రీటైల్, హోల్‌సేల్, డిపార్ట్‌మెంట్ స్టోర్స్, గోడౌన్ల కార్మికుల, నిర్వాహకుల యూనియన్ (ఆర్‌డబ్ల్యుడిఎస్‌యు)' ఒక చారిత్రక విన్యాసానికి రంగం సిద్ధంచేసింది. అమెరికాలో మొదటి అధికారయుత అమెజాన్ యూనియన్‌ను కార్మికులు ఏర్పాటు చేశారు. అల్బామాలోని బెస్సెమర్ అమెజాన్ సెంటర్‌లో పనిచేసే దాదాపు 5,800 మంది కార్మికులకు ఈ యూనియన్ ప్రాతినిధ్యం వహిస్తోంది. అర్‌డబ్ల్యుడిఎస్‌యు మద్దతుతో, ఈ గోడౌన్లలో పనిచేసే కార్మికులు (వీరిలో 75-80 శాతం కార్మికులు నల్ల జాతీయులు) భద్రత లేని అసమంజసమైన తమ పని పరిస్థితులపై పోరాడి వాటిని వెనక్కు నెట్టివేయగలిగారు. ఇదే అమెజాన్ వ్యాపార పనిప్రదేశాలన్నింటికీ ఉదాహరణగా నిలిచింది.

అమెజాన్ చరిత్రలో యూనియన్ ఏర్పాటుకు చేసిన అత్యంత పెద్ద ప్రయత్నమిది. ఒక నెలరోజుల సంఘర్షణ తర్వాత, అల్బామాలోని బెస్సెమర్‌లో అమెజాన్ వేర్‌హౌస్ కార్మికులు 738 మంది యూనియన్ ఏర్పాటుకు అంగీకారం తెలపగా, 1,798 మంది నిరాకరిస్తూ ఓటు వేశారు. మరో 505 మంది కార్మికుల ఓట్లు అమెజాన్ చొరవతో ఛాలెంజ్ చేయబడి పరిశీలనకు గురయ్యాయి. అమెజాన్ చట్ట విరుద్ధంగా ఓటింగ్‌లో కల్పించుకుని, జాతీయ కార్మిక సంబంధాల బోర్డులో అన్యాయ ఆరోపణలతో జోక్యం చేసుకుంది. ప్రపంచంలో అత్యధిక సంపద కలిగిన జెఫ్ బోజెస్ నిర్వహించే అమెజాన్ సంస్థ, కార్మికుల వాదన వీగి పోయేందుకు మిలియన్ల డాలర్లు వెచ్చించింది. ఏవిధంగా చూసినా అమెజాన్ పనిపరిస్థితులతో తాము సంతృప్తి చెందామని కార్మికులెవరూ చెప్పటం లేదు. యూనియన్ అవసరమని చెబుతూ ఓటు చేయటానికి తాము భయపడ్డామని వారు చెబుతున్నారు.

యజమానుల ప్రయోజనాలకనుగుణంగా; మరోవైపున కార్మికులు సంఘటితపడటం ఎంతో కష్టమైనదిగా, పకడ్బందీగా రూపొందించబడిన కార్మిక చట్టాలున్న దేశంలో, బెస్సెమర్‌లోని అమెజాన్ కార్మికులు సంఘటిత పడేందుకు ప్రయత్నించటం పరిగణించదగింది.

ఫలితం ఏమైందనే దానితో నిమిత్తం లేకుండా అమెజాన్ యూనియన్ ఏర్పాటు ప్రయత్నం వెనుకనున్న కార్మికులు-ఇటీవలికాలం వరకూ దృఢంగా, కదిలించలేనిదిగా కన్పించిన, దీర్ఘకాలంగా కొనసాగుతున్న యూనియన్ వ్యతిరేక సంస్కృతిపై సిద్ధాంతపరంగా, చాతుర్యంగా పోరాటం సాగించి, గుర్తించదగిన పురోగతిని సాధించారు.

50 సంవత్సరాల క్రితం అమెరికాలోని కార్మికుల మొత్తం సంఖ్యలో మూడవవంతు పైగా కార్మికులు యూనియన్‌లలో వుండేవారు. ఈనాడు అత్యధిక కార్మికులు ఎవరికి వారుగా వుంటున్నారు. అమెరికా ప్రైవేటురంగంలోని మొత్తం కార్మికులలో కేవలం 6.4శాతం మాత్రమే యూనియన్లలో వుండి, అమెజాన్, వాల్‌మార్ట్, లేదా ఇతర బడాయాజమాన్య సంస్థలలోని కార్మికుల ప్రయోజనాలకోసం ఏమీ చేయలేని స్థితిలో వున్నారు.

50 సం॥ల క్రితం దేశంలో కార్మిక చట్టాలు అమలయ్యే విధంగా తగినంత రాజకీయ ప్రభావాన్ని కార్మికోద్యమం కలిగివుండేది. ఫలితంగా ప్రభుత్వాలు కూడా జి.ఎమ్.వంటి దిగ్గజ సంస్థలలో మధ్యతరగతి మనగలిగే విధంగా వత్తిడి తేగలిగేవి. ఆనాటితో పోలిస్తే ఈనాడు సంఘటిత కార్మికోద్యమం రాజకీయంగా స్వల్పంగా మాత్రమే ప్రభావితం చేయ గలుగుతోంది.

అమెజాన్ వంటి దిగ్గజ కార్పొరేషన్లే అత్యంత పెద్ద రాజకీయశక్తులుగా కూడా వున్నాయి. పనిహక్కు చట్టాన్ని వెనక్కునెట్టటానికి, కార్మిక రక్షణలను నీరుగార్చటానికి, జాతీయ కార్మిక సంబంధాల బోర్డులో సిబ్బందిని తగ్గించి వేసి, దానిపై పనిభారం పెంచటానికి, యూనియన్లను అంతమొందించే దుర్మార్గమైన ఎత్తుగడలను అనుమతించే విధంగా, అవి తమ రాజకీయ ప్రాబల్యాన్ని ఉపయోగిస్తున్నాయి.

అంతేగాక, పరిశ్రమలపై విధించిన పన్నులను తగ్గించుకునేందుకు; పరిశ్రమల ఏర్పాటుకు వసతులు కల్పించాల్సి వుంటుందనే షరతులతోపాటు, పన్నురాయితీలతో రాష్ట్రాలను దోచుకునేందుకు; తమ కేంద్ర కార్యాలయాలున్న నగరాలను బెదిరించేందుకు; ఒప్పంద కార్మికులతో పనిచేయించే విధంగా వాణిజ్య ఒప్పందాలు రుద్దేందుకు దిగ్గజ పరిశ్రమలు తమ రాజకీయ బలాన్ని ఉపయోగిస్తున్నాయి.

అమెరికాలో అవుట్‌సోర్సింగ్ (పొరుగు సేవల) కార్మికులుగా వున్న వారు అతితక్కువ వేతనంతో, చాలా ఎక్కువ వత్తిడిని ఎదుర్కొంటూ శ్రమిస్తున్నారు. ఒప్పంద వ్యతిరేక చట్టాలను బడాపరిశ్రమలు పెంచిపోషిస్తున్నాయి. మొదటి దశలో అమెజాన్‌వంటి కంపెనీలు మాత్రమే ఈ తరహాలో వుండేవి.

కార్పొరేటు కంపెనీలు కార్మికుల యూనియన్లను కాలరాచి వేస్తుండగా, మరోవైపున కార్పొరేటు లాబీ బాగా దృఢపడుతూ యూనియన్‌ల ప్రతి చిన్న విషయంలోనూ జోక్యం చేసుకుంటున్నాయి. కార్మికులకు సంఘటితపడే హక్కును కల్పించే పిఆర్ఓ చట్టాన్ని 'శాసనసభలో చేసిన నీచమైన చట్టం'గా నేషనల్ రీటైల్ ఫెడరేషన్ వ్యాఖ్యానించింది.

"అబ్రహాం లింకన్ లీడర్‌షిప్ ఫర్ అమెరికా అవార్డు" మరియు "జెఫర్‌సన్ - హామిల్టన్ అవార్డు ఫర్ బైపార్టిజన్‌షిప్"ల పేరుతో అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రచార విరాళాలు సేకరించి 15 డాలర్ల కనీస వేతనాన్ని అడిగిన వారిని చంపాలనే ప్రతిపాదనకు ఓటువేసిన సెనేటర్లను అభినందించింది.

బడాకార్పొరేటు సంస్థలు పైకి ఎగబాకు తుండగా, కార్మిక యూనియన్లు అదృశ్యంకావటం, సంపద, ఆదాయాల పునఃపంపిణీ భారీగా సాగేవిధంగా ఈ దశాబ్దపు పెద్ద అధికార బదలాయింపు జరిగింది. అమెరికాలో 0.1 శాతం అత్యధిక సంపన్నుల వద్దే, అట్టడుగునున్న 90శాతం ప్రజల మొత్తం సంపద పోగుపడి వుంది.

ఈ అధికార బదలాయింపును వెనుకకు మరల్చవచ్చు; అది కేవలం చాలా బలమైన కార్మిక చట్టాలు, మరిన్ని యూనియన్ల స్థాపన, కఠినమైన వాణిజ్య ఒప్పందాల ద్వారానే సాధ్యమౌతుంది. అమెజాన్ కార్మికుల యూనియన్ ఏర్పాటు ప్రయత్నం తర్వాత, అమెరికా దేశవ్యాపితంగా ప్రథమశ్రేణి కార్మికులతో సహా వివిధ రంగాల కార్మికులు తమకు మెరుగైన వేతనాలకొరకు, సౌకర్యాల కొరకు, రక్షణ, భద్రతల కొరకు విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్నారు.

అణచివేత తీవ్రమౌతున్న కొద్దీ పోరాటాలు కూడా పెరుగుతున్నాయి. 120 ఏళ్ళకాలం నాటి పరిస్థితులు-'గిల్డెడ్' (వృత్తి పనివారి) యుగానికి చెందిన ఆధిక్యతలను పడదోస్తున్నాయి. ఆ సమయంలో పెట్టుబడిదారీ వ్యవస్థ 'సంస్కరణ'లతో తనను తాను రక్షించుకో గలిగింది. అయితే నేడు కార్మికులు విప్లవంకోసం పోరాడాలి. ★

# 'నా జాతి ప్రజల కోసం నిలబడతా' - పుస్తక పరిచయం

**1940** జూలై 17న శ్రీశ్రీ 'మహాప్రస్థానం' కవితాసంపుటికి (ప్రచురణ : జూన్ 1950) చెలం రాసిన 'యోగ్యతాపత్రం'లో ఒక వాక్యం ఇలా వుంది. 'శ్రీశ్రీ కవిత్వమూ, పాల్ రోబ్సన్ సంగీతమూ ఒకటేరకం అంటుంది సౌరీస్'. తెలుగు సాహితీలోకంలో కొందరికి పాల్ రోబ్సన్ అలా పరిచయమయ్యాడు.

పాల్ రోబ్సన్ అద్భుతమైన అమెరికన్ సంగీతకారుడు, గాయకుడు, గొప్ప ఫుట్‌బాల్, బేస్‌బాల్, బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు కూడా. తన నల్లజాతివారి పౌరహక్కులకోసం జీవితాంతం అలుపెరగక కృషి చేసిన పోరాటయోధుడు. అమెరికా 16వ అధ్యక్షుడు అబ్రహమ్ లింకన్ 1863 జనవరి 1న బానిసలకు దాస్య విమోచన ప్రకటన చేశాడు. అయినప్పటికీ పాల్ రోబ్సన్ జీవితకాలం (9.4.1898 - 23.1.1976)లోనే కాదు ఈనాటికీ నల్లజాతివారిపట్ల సామాజిక వివక్ష అక్కడ సమాజంలో కొనసాగుతూనే వుంది. 1865 నాటి శ్వేత దురహంకార తీవ్రవాద రహస్య సంస్థకూ క్లక్స్ క్లాన్ జాడలు ఇప్పటికీ కనబడుతూనే వున్నాయి. నల్లజాతి వారికి కుళాయిలు వేరు, థియేటర్లు, పాఠశాలలకు వారికి కేటాయించిన ద్వారం గుండానే వెళ్ళాలి. అమెరికాలోని ఉత్తరాది రాష్ట్రాలకు, దక్షిణాది రాష్ట్రాలకు బానిస వ్యవస్థ నిర్మూలన సమస్యపై 1861-1865 మధ్య సాయుధ అంతర్యుద్ధం జరిగిన తరువాత 30 నుండి 40 లక్షలమంది నల్లజాతివారికి చట్టబద్ధమైన స్వేచ్ఛను ప్రకటించారు. కానీ మొన్న 2020 మే 25న మిన్నిపోలిస్ నగరంలో శ్వేతజాతి పోలీసులు నల్లజాతీయుడైన జార్జి ఫ్లాయిడ్ గొంతుపై మోకాలు నొక్కిపెట్టి, 'నాకు ఊపిరాడటంలేదు' అని మొత్తుకున్నా అతన్ని దారుణంగా చంపిన సంఘటన చూస్తే ఆచరణలో వారికి లభించిన స్వేచ్ఛ ఎలాంటిదో అర్థమౌతుంది.

అతి ప్రాచీనకాలం నుండి ప్రపంచమంతటా నెలకొనివున్న బానిస వ్యవస్థను బీటలువార్చే పలు పోరాటాలు, చరిత్ర గమనంలో కనబడతాయి. క్రీస్తు పూర్వం 111 నుండి 71 వరకు జీవించిన రోమన్ బానిస, మల్లయుద్ధ యోధుడు స్పార్టకస్ చేసిన తిరుగుబాటు విఫలమై, 200 కి.మీ. పొడవునా 6000 మంది బానిసలను శిలువ వేసి చంపిన రోమన్ పాలకుల దౌష్ట్యం మన నెత్తురు మరిగేటట్లు చేస్తుంది. 'ప్రాచీన చరిత్ర మొత్తంలో గొప్ప సైనిక జనరల్, ఉన్నత వ్యక్తిత్వం కలవాడు, ప్రాచీన శ్రామిక జనావళికి నిజమైన ప్రతినిధి' అంటూ 1861 ఫిబ్రవరి 27న



జనసాహితి ప్రచురణ

**నా జాతి ప్రజలకోసం నిలబడతా!**

**పేజీలు : 216 వెల : రు. 150/-**

**మూలం: పాల్‌రాబ్సన్ అనువాదం: కొత్తపల్లి రవిబాబు**

కాపీలకు :

**మైత్రీబుక్‌హౌస్**

**జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2**

కార్ల్‌మార్క్స్ మ్యాంచెస్టర్ నుంచి ఎంగెల్స్‌కు రాసిన లేఖలో స్పార్టకస్ కృషిని స్వేచ్ఛాస్వాతంత్ర్య కాంక్షను తెలియచేశారు.

బానిస వ్యవస్థ నిర్మూలన కీలక లక్ష్యంగా అమెరికాలో సాగిన అంతర్యుద్ధం విజయవంతమైన తరువాత, నల్లజాతివారిలో ఒక వికాసయుగం ప్రారంభమై వారు తమకోసం విద్యాలయాలు, చర్చిలు, సంక్షేమ సంస్థలు, బ్యాంకులు, పత్రికలు, వ్యాపార సంస్థలు ఏర్పాటు చేసుకున్నారు. న్యూయార్క్ నగర శివార్లలో వున్న హార్లెమ్ ప్రాంతం నల్లజాతివారి రాజధానిగా అభివృద్ధి చెందింది. సాహిత్యం, సంగీతం, కళలు, సంస్కృతి, విద్య మొదలగునవి వికసించాయి. అయినప్పటికీ నల్లజాతి వారిపై శ్వేతజాతి దురహంకారం దాడులు కొనసాగిస్తూనే వుంది. తెల్లజాతి పోలీసులు నల్లజాతి పౌరులపై కొనసాగిస్తూన్న దాష్టీకానికి వ్యతిరేకంగా 1935, 1943, 1964లలో అమెరికాలో పెద్దఎత్తున ఆందోళనలు చెలరేగాయి. ఇవేగాక చిన్న, చితకా అల్లర్లు దేశవ్యాప్తంగా జరుగుతూనే వున్నాయి. 1941లో అమెరికా 32వ అధ్యక్షుడు రూజ్వెల్ట్ ప్రకటించిన 'నాలుగు స్వేచ్ఛలు' నల్లజాతివారికి మృగ్యం కాగా, వారు పలు తిరుగుబాట్లు చేశారు. రెచ్చగొట్టే ఏ చిన్న సంఘటన ఐనా సరే వారిని కోపోద్రిక్తులను చేసేంతగా సామాజిక వ్యవస్థ వారిని అణచివేతకు గురిచేసింది.

వివక్షకు గురి అవుతున్న జాతులవారు వివిధ దేశాలలో పోరాటాలు చేస్తూనే ఉన్నారు. దోపిడీ పీడనల సమాజంలో అగ్రజాతిగా అనుకుంటున్నవారి మనస్సుల నుండి ఈ వివక్షాపరమైన భావాలను ఏ చట్టాలూ, ఏ శిక్షలూ, ఏ ఉద్యమాలూ ఇప్పటికీ తొలగించ లేదని బ్రిటిష్ రాజవంశానికి చెందిన ఇటీవల సమాచారం కూడా ధ్రువపరుస్తున్నది. హాలీవుడ్ నటి రాచెల్ మేఘన మర్కెల్ తల్లి ఆఫ్రికన్ అమెరికన్ కాగా, తండ్రి యూరోపియన్ అమెరికన్. ఈమె ఇంగ్లండ్ రాజవంశీకుడైన ప్రిన్స్ హ్యారీని వివాహం చేసుకున్న తరువాత రాజకుటుంబంలో తాను మూడేళ్లపాటు ఎదుర్కొన్న ఘోరమైన అవమానాలను ఒక ఇంటర్వ్యూలో తెలియచేసారు. ఈ దంపతులు ఏడాది క్రితమే ఆ కుటుంబంలో ఇమడలేక రాజరిక హోదా లన్నిటిని వదలివేసి అమెరికాకు వెళ్ళిపోయారు. మేఘనకు పుట్టబోయే బిడ్డ రంగుపైన చర్చలు సాగినట్లు, నల్ల రంగులో పుట్టే బిడ్డకు యువరాజు హోదా, రాజ కుటుంబీకులకు ఇచ్చే భద్రత ఇవ్వకూడదని రాజకుటుంబం అనుకున్నట్లూ తెలియచేసారు.

ఇంతకంటే ఘోరాతిఘోరమైన పరిస్థితులను, సంఘటనలను మనం మన దేశంలో అనుభవిస్తున్నాం. వేల సంవత్సరాలక్రితం దోపిడీ వ్యవస్థ అవసరాల కోసం ఏర్పడిన వర్ణవ్యవస్థ కారణంగా శూద్రులపట్ల, పంచమవర్ణంపట్ల మన సమాజం వివక్ష చూపిస్తూనే వుంది. శ్రమ చేసేవారిని, కష్టజీవులను వేలాది కులాలుగా, ఉపకులాలుగా విడదీసి దోపిడీ వర్గ అగ్రవర్ణాలు తమ పబ్బం గడుపుకుంటున్నారు. అంటరాని వారు చదువుకోడానికిగానీ, ఇతర విద్యలు నేర్వడానికిగానీ అనర్హులనీ రకరకాల ఆంక్షలు విధించి వాటిని అతిక్రమిస్తే వారిపై సామూహిక లేక వ్యక్తిగత దాడులు చేసి శిక్షించడం ఒక పద్ధతిగా అమలు చేస్తున్నారు. రాజ్యాంగం అందరికీ సమాన అవకాశాలు, స్వాతంత్ర్యం ఇచ్చినట్లు ప్రకటించినప్పటికీ ఈనాటికీ శ్రామికవర్గానికి అవి అందని ద్రాక్షపళ్ళే. మనదేశంలో వాటిని అనుభవించడాన్ని అగ్రవర్ణ సమాజం మృగ్యం చేస్తుంటే, పాశ్చాత్య దేశాల్లో శ్వేతజాతి దురహంకారం నల్లజాతి వారిపైనా, మూలవాసుల పైనా విషం చిమ్ముతోంది. గత 60 సంవత్సరాల కాలంలో మన దేశంలో అగ్రవర్ణాలవారు చేసిన ప్రధానమైన దాడులు ఎన్నో ఉన్నాయి. ఉదాహరణకి 1968 కీలవేన్మణి (తమిళనాడు), 1968 కంచికచర్ల (ఆంధ్రప్రదేశ్), 1980

భగల్పూర్ (బిహార్), 1985 కారంచేడు (ఆంధ్రప్రదేశ్), 1987 నీరుకొండ (ఆంధ్రప్రదేశ్), 1991 చుండూరు (ఆంధ్రప్రదేశ్), 1997 లక్ష్మణపూర్ బాతే (బిహార్), 2006 ఖైర్లాంజీ (మహారాష్ట్ర), 2011 మిర్చ్ పూర్ (హరియానా), 2012 లక్ష్మింపేట (ఆంధ్రప్రదేశ్), 2012 ధర్మపురి (తమిళనాడు), 2017 సహ్రాన్ పూర్ (ఉత్తరప్రదేశ్) మొదలైనవి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్య ఈ అసమాన వ్యవస్థ చేసిన హత్యే. దళితులపై, ఆదివాసీలపై, మహిళలపై రకరకాల సాకులతో చేసిన, చేస్తున్న అవమానాలకు, దాడులకు లెక్కే లేదు. దోపిడీవర్గ సమాజ ప్రయోజనాలకోసం పెంచి పోషించబడుతున్న వర్ణవ్యవస్థ వివక్షలకు మూలం పెకిలించినప్పుడే ప్రపంచ వ్యాప్తంగా వివక్ష అనేదానిని ప్రజల మనస్సుల నుండి తొలగించగలుగుతాం. అందుకు మడమతిప్పని కృషి చేయాల్సిన అవసరాన్ని ఇవన్నీ మనకు తెలియచేస్తున్నాయి.

**ఇక్కడే పాల్ రోబ్సన్ ప్రాసంగికత వుంది. పాల్ రోబ్సన్ లాంటి సాంస్కృతిక యోధుడు ఇప్పుడు కావాలి. పాల్ రోబ్సన్ తన జాతివారిలో వున్న అనైక్యతను, నిర్లిప్తతను ఖండించి వారిలో సంఘటితతత్వాన్ని పోరాట చైతన్యాన్ని రగిలించిన సాహసికుడు. తను పాడే పాటలన్నిటిలో సామాజిక విషయాలను జోడించి, ప్రజలకు ఉత్తేజాన్నిస్తూ చైతన్యపరిచాడు.** ఆఫ్రికన్ అమెరికన్ జానపద పాటల్లో ప్రముఖమైన 'ఓల్డ్ మాన్ రివర్'లో I am tired of living and afraid of dying అనే ఆఖరి చరణాన్ని I must keep fighting until I am dyingగా మార్చి శ్రోతలలో ఆశావహ దృక్పథాన్ని రగిలించాడు. ఆయన పాడిన 'బ్యాలెడ్ ఫర్ అమెరికన్', 'జోహిల్' చాలా ప్రసిద్ధమైనవి. 'జోహిల్' పాట కార్మికుల సభల్లో గొప్ప ప్రాచుర్యం పొందింది. దాని చివరి పాదం 'నా కోసం శోకించవద్దు – సంఘటితపడండి', శ్రోతలలో చైతన్యాన్ని రగిలించేది. ఆయన షేక్స్పియర్ నాటకం 'ఒథెల్లో'లో ఒథెల్లో పాత్రలో నటించి నటునిగా ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. పాల్ రోబ్సన్ ప్రత్యక్ష స్ఫూర్తితో ఆయన పాటల వరవడిలోనే మన దేశంలోనూ భూపేన్ హజారికా, హేమంగో బిశ్వాస్‌లు ఎన్నో పాటలు రాసి పాడారు. చరిత్రకారుడు డి.డి.కొశాంబికి రోబ్సన్ పాటలు ఎంతో ఇష్టం. 1958 ఏప్రిల్ 9న మనదేశంలో పాల్‌రోబ్సన్ 60వ జన్మదినం సందర్భంగా వివిధ నగరాలలో సభలు జరిపారు. సోవియట్ యూనియన్, చైనాతో సహా ఇంకా ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో కూడా సభలూ, సమావేశాలు జరిపారు. ఆ సందర్భంగా అప్పటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ "ఇది ఉత్సవంగా చేయవలసిన సందర్భం.... ఎందుకంటే పాల్ రోబ్సన్ మన తరంలోని అత్యంత ప్రతిభావంతుడైన కళాకారుడు" అని ప్రకటించారు.

ఈనాడు మనదేశంలోని దళితులు, ఆదివాసులు, మహిళలు, అసమానత్వాన్ని, వివక్షను ఎదుర్కుంటున్న సమస్త ప్రజానీకం సమైక్యమై, సంఘటితపడి తమ హక్కుల కోసం, సమాజంలో సమానత్వం కోసం పోరాడాలనే సందేశాన్ని పాల్ రోబ్సన్ జీవితం మనకు అందిస్తుంది. సామ్రాజ్యవాద దురాక్రమణల ఆధిపత్యశక్తులు వర్ణ వివక్షల అసమాన ఆర్థిక సాంఘిక వ్యవస్థలకు ప్రాపుగా ఉన్నాయని గ్రహించిన పాల్ రోబ్సన్ అమెరికా సామ్రాజ్య వాదాన్ని ధిక్కరిస్తూనే తన జీవితకాలం సాగాడు. పాల్ రోబ్సన్ జీవితంలోని అనుభవాలు, కులాలను కాలతన్ని, మతాలను మట్టుబెట్టి, ప్రాంతీయతలను పారద్రోలి దోపిడీ, పీడన లేని సమాజాన్ని, మానవులందరూ ఒక్కటేనన్న విశ్వమానవతత్వాన్ని ఆవిష్కరించాలన్న కాంక్షను రగిలిస్తాయి.

కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డిగారు ప్రఖ్యాతి చెందిన తన 'తాకట్టులో భారతదేశం' పుస్తకంలో మనదేశంలో దళితుల పట్ల అగ్రకులాలు చూపే సాంఘిక వివక్షను, అమెరికా దేశంలోని నల్లవారి పట్ల తెల్లవారు ప్రదర్శించే వర్ణ వివక్షతతో పోల్చి చెప్పారు. అమెరికా సమాజంలోని అలాంటి వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పాల్ రాబ్సన్‌ను ప్రళయ గాయకునిగా 'నా జాతి ప్రజల కోసం నిలబడతా' Here I Stand పాల్ రాబ్సన్ స్వీయచరిత్ర పుస్తకంలో ఒకచోట పేర్కొన్నారు. అవును వర్ణ వివక్షా పూరిత అమెరికన్ సమాజంలో భావ ప్రళయాన్ని సృష్టించిన మహోన్నత కళాకారుడు, ఎర్ర వెలుగులు చిమ్మిన నల్ల వజ్రం పాల్ రాబ్సన్ !

**ఆయన 123వ జయంతి సందర్భంగా, 8 ఏప్రిల్ 2021న 'జనసాహితి' ఆయన జీవిత చరిత్రను విడుదల చేసింది.**

ఆయన కమ్యూనిస్టు కాదు. కానీ ప్రఖ్యాతి చెందిన రష్యన్ నాటకకర్త ఐసెన్ స్టీన్ ఆహ్వానం మేరకు ఒక నాటకంలో నటించడానికి 1934 డిసెంబర్ నెలలో రష్యా వెళ్ళాడు.

అది అమెరికా ఐరోపా దేశాలు ఆర్థిక మాంద్యంలో కుప్పకూలిపోయిన కాలం. రష్యా దేశంలో నిరుద్యోగం లేకపోవడం, ధరలు స్థిరంగా ఉండటం, అభద్రత లేని జీవితం ఆయనను ఆశ్చర్యంతోపాటు చాలా ఆనంద పరిచింది. అంతేకాదు అమెరికా దేశంలో అడుగడుగునా తాను, తమలాంటి నల్లవారు ఎదుర్కొంటున్న వర్ణ వివక్ష, రష్యా దేశంలో మచ్చుకు కూడా కనబడకపోగా తనను ఆ దేశ ప్రజలు, కళాకారులు, స్త్రీ బాల వృద్ధులు ఎంతో ఆదరణతో గౌరవించడం ఆయనపై చెరగని ముద్ర వేసింది.

ఐసెన్ స్టీన్‌తో పాల్ రాబ్సన్ ఇలా అన్నాడు.." నేను పెరిగి పెద్దవాడినైన తరువాత ఇప్పుడు ఒక మానవుడిగా గుర్తింపబడుతున్నాను. ఇక్కడ నేను నీగ్రోను కాదు. ఒక మానవుడిని అంతే!!"

రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు రిహార్సల్ లాగా జరిగిన స్పానిష్ అంతర్యుద్ధంలో ప్రపంచవ్యాప్తంగా పాల్గొన్న అనేకమంది మేధావులు కళాకారులలో పాల్ రాబ్సన్ కూడా ఒకరు. స్వయంగా పోరాడే స్పానిష్ ప్రజల వద్దకు వెళ్ళి తన గాన చాతుర్యంతో వారిని ఉత్తేజపరిచి చైతన్యవంతం కావించిన చరిత్ర పాల్ రాబ్సన్‌ది.

మూడవ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ తన ఆరవ కాంగ్రెస్‌లో 'వలస అర్ధవలస దేశాలలో విప్లవోద్యమాలు' అనే 1928 నాటి థీసిస్‌లో నీగ్రోల సమస్య అనే ఒక ప్రత్యేక అంశం చేర్చి తీర్మానించింది.

నల్లవారు ఎక్కువగా ఉండే దక్షిణాది రాష్ట్రాలలో గల వ్యవసాయక చట్రాన్ని (agrarian structure) మౌలిక మార్పులకు గురి చేయడం ఒక ముఖ్యమైన విప్లవ కర్తవ్యం.

నీగ్రో సమస్య యొక్క పరిష్కారానికి నల్లవారు కాని శ్రామిక వర్గాలతో నల్లవారు కూడా కలిసి కట్టుగా నిలిచి అమెరికన్ బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా పోరాడితే తప్ప, అనాగరికమైన దోపిడీ పీడనల నుండి నల్లజాతి ప్రజలు మొత్తంగా విముక్తి పొందలేరని కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ మార్గదర్శకం చేసింది.

పాల్ రాబ్సన్ జీవిత అనుభవం కూడా అదే నేర్పింది. ఆయన వర్ణవివక్షను పాటించే శ్వేతజాతి అహంకారులతో తప్ప, మిగిలిన శ్వేతజాతి వారితో కలసికట్టుగా కార్యకలాపాలు నిర్వహించినట్లు మనకు ఈ పుస్తకం ద్వారా అర్థమవుతుంది. ఆయన ప్రపంచ ప్రఖ్యాతి చెందిన నటుడు, గాయక కళాకారుడు, గొప్ప క్రీడాకారుడు కూడా!

'నా జాతి ప్రజల కోసం నిలబడతా!' (Here I Stand) అనే పాల్ రాబ్సన్ ఆత్మకథ లాంటి జీవిత చరిత్ర పుస్తకాన్ని తెలుగులో 'జనసాహితి' సంస్థ ప్రచురించింది. కా॥కొత్తపల్లి రవిబాబు సులభశైలిలో దీన్ని అనువదించారు.

పాల్ రోబ్సన్ రాసిన ఈ స్వీయ అనుభవాల వేదనాపూరిత రచన వివక్షాయుత సమాజం ఎక్కడ వున్నా దానిని అంతంచేసే పోరాట చైతన్యాన్ని ప్రోత్సహిస్తుంది. మనల్ని మున్ముందుకు నడిపిస్తుంది. ★

# లక్షద్వీప్ దీవుల్లో పోరాడుతున్న ప్రజలకు సంఘీభావంగా నిలుద్దాం

**లక్షద్వీప్** పాలనాధికారి అయిన ప్రఫుల్ ఖోడా పటేల్ తీసుకుంటున్న అప్రజాస్వామిక, ప్రజావ్యతిరేక నిర్ణయాల కారణంగా అక్కడి దీవుల్లో అశాంతి వాతావరణం నెలకొంది. దీనిని వ్యతిరేకించిన అనేకమందిపై నిర్బంధం ప్రయోగిస్తున్నారు. అనేక మంది ప్రజలపై లాఠీఛార్జీ చేసి, అరెస్ట్ చేస్తున్నారు.

అరేబియా సముద్రతీరంలో ఉన్న భారత దేశపు దీవుల్లో లక్షద్వీప్ కూడా ఒకటి. 36 చిన్న చిన్న దీవుల సముదాయం ఇది. వీటిలో పది దీవుల్లోనే ప్రజలు నివసిస్తున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం అక్కడ జనాభా 64,473 మంది. అందులో 94.8 శాతం షెడ్యూల్డ్ జాతులు, వీరంతా ముస్లింలే. అత్యధికులు మాట్లాడే భాష మళయాళం. అక్షరాస్యత 92%. చేపల వేట, కొబ్బరిసాగు ప్రధాన వృత్తులుగా ఉన్నాయి. లక్షద్వీప్ ఒక జిల్లా హోదా కలిగి వుండి, ఒక పార్లమెంట్ స్థానం, పది దీవులకు పది గ్రామ పంచాయితీలు ఉన్నాయి. ఈ దీవులలో ప్రఫుల్ పటేల్ తన విధానాలతో కార్చిచ్చు రాజేశాడు.

పటేల్ లక్షద్వీప్‌లో అధికారం చేపట్టిటన దగ్గరన్నుండి దీవుల్లో అశాంతి, అసహనాలు రేకెత్తేవిధంగా ప్రజావ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ, ఒంటెత్తు పోకడలతో వ్యవహరిస్తున్నారు. ఈయన చేసిన చట్టాలలో లక్షద్వీప్ డెవలప్‌మెంట్ అథారిటీ రెగ్యులేషన్ యాక్ట్ ఒకటి. దీని ప్రకారం అభివృద్ధి పేరుతో ప్రభుత్వం ఏ భూమినైనా, ఎవరి భూమినైనా స్వాధీనం చేసుకునే హక్కు ఉంటుంది. ఈ దీవుల్లో పర్యావరణ విధ్వంసానికి గేట్లు బార్లా తెరుస్తూ మైనింగ్, గనుల తవ్వకాలు, భవన నిర్మాణాలకు, జాతీయ రహదారులు, రింగ్ రోడ్డులు, విమానాశ్రయాలకు అనుమతించారు. భారత దేశంలో సెజ్‌ల పేరుతో భూములు స్వాధీనం చేసుకుని, భూములు కోల్పోయిన వాళ్ళకు "సెక్యూరిటీ గార్డు" ఉద్యోగాలు ఇచ్చినట్టుగా.. ప్రజల ఉపాధి కోసం పరిశ్రమలు పెడతామంటున్నారు. అలాగే కోస్టల్ రెగ్యులేషన్ జోన్ కోస్ట్ గార్డ్ యాక్ట్ పేరు చెప్పి సముద్ర తీరంలో జాలర్లు వేసుకున్న గుడిసెలను, షెడ్లును, వలలను, బోట్లను అధికారులు నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నారు. జంతు పరిరక్షణ నియంత్రణ చట్టం పేరుతో పశుమాంసం ప్రధాన ఆహారంగా ఉన్న చోట బీఫ్, బీఫ్ ఉత్పత్తుల క్రయ, విక్రయాలను నిషేధించారు. టూరిజం డెవలప్‌మెంట్ పేరుతో ఈ దీవుల్లో మద్యం అమ్మకాలపై వున్న నిషేధాన్ని ఎత్తివేశారు. హోటళ్ళు, రిసార్టులు నిర్మించి టూరిజం అభివృద్ధి చేసేందుకు అంబానీ, అదానీ కంపెనీలను ఆహ్వానిస్తున్నారు.

అంతేకాకుండా అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే హైస్కూల్‌లో పనిచేస్తున్న 200 మంది కాంట్రాక్ట్ టీచర్లను, కొంత మంది అంగన్‌వాడీలను తొలగించారు. ఆ చర్యలను వ్యతిరేకిస్తూ విద్యార్థులు పెద్దఎత్తున ఎస్ఎంఎస్ క్యాంపెయిన్, సోషల్ మీడియాలో ప్రచారం చేసి.. ఆందోళన చేస్తే వారిపై లాఠీఛార్జీకు పాల్పడి, అక్రమంగా అరెస్ట్ చేశారు. టూరిజం శాఖలో పనిచేసే 190 మంది ఉద్యోగులను తీసేశారు. స్థానిక భాష మళయాళం మాట్లాడే సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ మరియు ఇతర అధికారుల్ని విధుల నుండి తొలగించి, గుజరాత్ నుండి హిందీ మాత్రమే మాట్లాడే అధికారుల్ని నియమించారు. అలాగే గ్రామ పంచాయితీ అధికారాలను తగ్గిస్తూ, వాటి మీద అజమాయిషీ చెలాయించడం, స్థానిక ప్రభుత్వం నిర్వహిస్తున్న పాల కేంద్రాలను మూసివేసి గుజరాత్ అమూల్ కంపెనీకి అనుమతివ్వడం, ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థులపై నిబంధనలు విధించడం... యిలా అనేక ప్రజావ్యతిరేక చర్యలు పటేల్ చేపట్టారు. ఈ చర్యలను నిరసించే, వ్యతిరేకించే ప్రజల్ని "ప్రివెన్షన్ ఆఫ్ యాంటీ-సోషల్ యాక్టివిటీస్" అనే పేరుతో కారణాలు చెప్పకుండా ఎవరినైనా అరెస్ట్ చేసి, ఒక ఏడాది జైల్లో పెట్టే విధంగా ఒక గూండా చట్టానికి రూపకల్పన చేసారు.

ఒకప్పుడు సివిల్ కాంట్రాక్టర్ అయిన ప్రఫుల్ పటేల్ రాజకీయ జీవితాన్ని గమనిస్తే... మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో శాసనసభ్యులుగా (2007) ఎన్నికయ్యారు. సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసు (2010)లో నాటి రాష్ట్ర హోంమంత్రి అమిత్‌షా అరెస్టయినపుడు, ఆయన స్థానంలో ప్రఫుల్ పటేల్ మంత్రిగా నియమితులయ్యారు. తర్వాత నరేంద్రమోడీ ప్రధానిమంత్రిగా ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వం 2016లో పటేల్‌ను దాద్రా-నగర్ హవేలీ, డామన్ దీవులకు పాలనాధికారిగా నియమించింది. కేంద్రపాలిత ప్రాంతాల్లో ఐఏఎస్ అధికారులనే నియమించే సంప్రదాయాన్ని ఈయన కోసం పక్కన పెట్టింది. 2019 లోక్‌సభ ఎన్నికలపుడు దాద్రా-నగర్ హవేలీ కలెక్టర్, ఎన్నికల అధికారి కణ్ణన్ గోపీనాథన్‌తో పటేల్‌కు పొసగకపోవటంతో, చివరికి ఐఏఎస్ అధికారి రాజీనామా చేసే పరిస్థితి ఏర్పడింది. ఇదే కేంద్రపాలిత ప్రాంతం నుండి 7 సార్లు లోక్‌సభకు ఎన్నికైన మోహన్ డేల్కార్ ఆత్మహత్య చేసుకుంటూ రాసిన ఉత్తరంలో పటేల్ వేధింపులే తన మరణానికి కారణమని చెప్పారు. అయినా కేంద్ర ప్రభుత్వం నిరుడు జనవరిలో దాద్రా-నగర్ హవేలీ, డామన్ దీవులను విలీనం చేసి వాటి పాలనాధికారాలను, గత డిసెంబర్‌లో లక్షద్వీప్‌ను ఆయన చేతుల్లో పెట్టారు.

లక్షద్వీప్ ప్రజల ఆచార వ్యవహారాల దగ్గర నుండి భాష, సంస్కృతి, జీవనోపాధి, చివరకు తినే ఆహారం విషయంలో కూడా పాలనాధికారి జోక్యం ఉండటంతో అక్కడి స్థానిక ప్రజలకు తిరగబడటం తప్ప మరోమార్గం లేకుండా పోయింది. ప్రఫుల్ పటేల్ నిరంకుశ విధానాలను వ్యతిరేకిస్తూ "లక్షద్వీప్‌ను రక్షించండి!" అన్న నినాదంతో గత కొన్ని రోజుల నుండి నిరసనలు, నిరాహార దీక్షలు, ఇతర రూపాల్లో తీవ్రంగా పోరాడుతున్నారు. భారత భూభాగానికి దూరంగా ఉన్న చిన్న దీవుల్లోని ప్రజలు అక్కడి ప్రభుత్వ విధానాలకు, దమనకాండకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. లక్షద్వీప్ ప్రజల న్యాయమైన పోరాటానికి 'జనశక్తి' సంఘీభావం తెల్పుతోంది. లక్షద్వీప్ దీవుల్లో ఆందోళన చేస్తున్న ప్రజల సమస్యలను కేంద్రప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ప్రజావ్యతిరేక, నిరంకుశ విధానాలను అమలు చేస్తున్న ప్రఫుల్ పటేల్‌ను విధుల నుండి వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తోంది. ✸


**Read ! Subscribe!!**




**Hindi Organ of Central Committee of CPI (ML)**

కరపత్రం

# ప్రజలపై ఆర్థిక భారాలు మోపుతూ, ప్రజల జీవితాలను దుర్భరం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర పాలకుల విధానాలపై పోరాడండి!

## పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరల తగ్గింపు కోసం, రాష్ట్ర ప్రభుత్వం పెంచిన ఇంటి పన్నుల రద్దు కోసం, కరోనా సహాయక చర్యల కోసం డిమాండ్ చేద్దాం!

**అంతర్జాతీయంగా** పెట్రోలియం ధరలు తగ్గుతున్న కాలంలో మనదేశంలో పెట్రోలు, డీజిలు, వంట గ్యాసు ధరలు విపరీతంగా పెరిగాయి. ఈ పెరుగుదలకు కారణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరోవైపు నుండి పన్నులు వడ్డించడమే. పెట్రోలియం కంపెనీలకు ప్రభుత్వం అనుమతి కోసం చూడకుండా ఎప్పటికపుడు పెంచుకునే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది. ఒకే దేశం, ఒకే పన్ను నినాదంతో తెచ్చిన జిఎస్‌టి పరిధి నుండి కూడ తప్పించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతైనా పన్నులు పెంచే అవకాశం పెట్టుకున్నారు. దీంతో రవాణా ఖర్చులు పెరిగాయన్న సాకుతో నిత్యజీవితావసర సరుకులన్నిటి ధరలు పెరిగి పోయాయి. కరోనా కాలంలోనే వంటనూనెల ధరలు, పప్పులధరలు దాదాపు రెట్టింపు చేశారు. మరోవైపు పంటలు పండించే రైతుకు గిట్టుబాటు ధర కాకున్నా మద్దతుధర కూడ ఇవ్వ నిరాకరిస్తున్నారు.

కరోనా ఫలితంగా గత సం॥ ఆకస్మికంగా లాక్‌డౌన్ ప్రకటించి వలస కూలీలను అత్యంత దయనీయ స్థితికి నెట్టారు. ఈ సంవత్సరం 2వ వేవ్ వస్తుందన్న శాస్త్రవేత్తల హెచ్చరికలను పట్టించుకోలేదు. ముందు జాగ్రత్తగా వేక్సిన్ కూడ వేయనందు వల్ల కోట్లాది మందిని కరోనా బారిన పడవేశారు. వారికి వైద్యం కల్పించే, మందులు అందించే, ఆక్సిజన్ అందించే బాధ్యత కూడ చేపట్టకుండా జనం పిట్టల్లా రాలిపోతుంటే కేంద్ర, రాష్ట్ర పాలకులు మా బాధ్యత లేదన్నట్లు వ్యవహరించారు. పెరిగిన వైద్య ఖర్చులవల్ల, కుటుంబ ఖర్చులవల్ల, లాక్‌డౌన్ ఫలితంగా ఉపాధి కోల్పోయినందు వల్లా సుమారు 23 కోట్ల మంది ప్రజలు, ఉన్న కొద్ది ఆస్తులు కూడ కోల్పోయి దరిద్రులుగా మారారని గణాంకాలు చెప్పాయి.

ఈ కరోనాతో సంవత్సర కాలంగా ప్రజల జీవితం అస్తవ్యస్తం అయిపోతుంటే రాష్ట్ర ప్రభుత్వం మరో సమ్మెట పోటుకు పూనుకుంది. పట్టణ ప్రాంతాలన్నిటిలో మునిసిపాలిటీలు, నగర కార్పొరేషన్లు అన్నిటిలో గతంలో అద్దె విలువ ప్రాతిపదికన వేస్తున్న ఆస్తి పన్ను (ఇంటి పన్ను)ను మార్కెట్ విలువ (స్థలం విలువ, కట్టడం విలువ)ను బట్టి విధిస్తూనూ-చెత్త సేకరణకు కొత్త పన్నులు విధిస్తూను జీవోలు విడుదల చేసింది. దీంతో ఇంటి పన్నులు 5,6 రెట్లు పెరిగాయి. ఫలితంగా ఉపాధి పూర్తిగానో, పాక్షికంగానో కోల్పోవడం, మరోవైపు ఇంటి ఖర్చులు రెట్టింపు కావడంతో పేద, మధ్య తరగతి వర్గాలకు బతుకే భారమైంది. నిరుద్యోగం కొండలా పెరుగుతున్నా పాలకుల్లో ఉలుకూపలుకూ లేదు. ఉచిత పథకాలు, నగదు బదిలీల పేరిట ప్రజల్ని మోసపుచ్చుతూ పరోక్ష పన్నుల భారాల్ని పెంచి-ఇచ్చేది దోసకాయంత, దోచుకునేది గుమ్మడికాయంతగా - మోస గిస్తున్నారు. ప్రజలు ఈ మోసాన్ని గుర్తించాలి.

ఈ నేపథ్యంలో ప్రజలపై మోపుతున్న భారాలకు వ్యతిరేకంగా ఈ క్రింది డిమాండ్ల కోసం పోరాడమని కమ్యూనిస్టు విప్లవ సంస్థలు ఉమ్మడిగా ప్రజలకు పిలుపునిస్తున్నాయి.

1. పెంచిన పెట్రోలు, డీజిలు, వంట గ్యాసు ధరలు తగ్గించాలి. వీటిని జిఎస్‌టి పరిధిలోకి తేవాలి. వ్యవసాయానికి వాడే డీజిల్‌ను సబ్సిడి ధరకు అందించాలి.
2. వంట నూనెలు, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలి. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలి.
3. కరోనా బారినపడిన ప్రజలకు ఉచితంగా వైద్యం అందించాలి. ప్రభుత్వ ఆసుపత్రుల వ్యవస్థను బలోపేతం చేయాలి. మందుల బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలి.
4. మండల, గ్రామ స్థాయిలలోనే కోవిడ్ ఐసొలేషన్ సెంటర్లు ప్రభుత్వం నడపాలి.
5. ప్రజలందరికీ, పిల్లలతో సహా ఉచిత వ్యాక్సిన్లు వేయాలి. ఇందుకోసం వ్యాక్సిన్‌పై పేటెంట్ హక్కులతో ప్రమేయం లేకుండా ఫార్మా కంపెనీలన్నిటిచే వాక్సిన్ ఉత్పత్తి చేయించాలి.
6. ఆదాయపు పన్ను పరిధిలోకి రాని కుటుంబాలన్నిటికీ నెలకు 10 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని, బియ్యంతో పాటు ఇతర నిత్య జీవితావసర సరుకుల్ని ప్రభుత్వం అందించాలి.
7. రాష్ట్ర ప్రభుత్వం ఇంటి పన్నుల, చెత్త పన్నుల పేరిట మోపుతున్న అదనపు భారాన్ని ఉపసంహరించాలి.

**జూన్ 18 నుండి ప్రచారం ప్రారంభం- 21న మున్సిపాలిటీలు, 28న రెవిన్యూ డివిజన్, కలెక్టరు కార్యాలయాల ముందు ఆందోళనలు చేపట్టండి.**

**విప్లవాభినందనలతో**

**సి.పి.ఐ. ఎం.ఎల్. న్యూడెమాక్రసి**
**సి.పి.ఐ. ఎం.ఎల్.**
**సి.పి.ఐ. ఎం.ఎల్. న్యూడెమాక్రసి**
**సి.పి.ఐ. (ఎం.ఎల్) జనశక్తి**
**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీలు**

**విజయవాడ**
**15-6-2021**

---

**(చివరి పేజీ నుండి)**

వెంకటగిరిలో కాళహస్తి శేషయ్య స్మారక భవనం వద్ద సిపిఐ(ఎం-ఎల్) నాయకత్వాన నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకులు వీరయ్య మాట్లాడుతూ కరోనా బాధిత ప్రజలందరికీ ఉచిత వైద్య సదుపాయాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు సిహెచ్ చిన్న ఓబయ్య, స్త్రీ విముక్తి సంఘటన నాయకులు కె.అజిత, రైతుకూలీ సంఘం నాయకులు జి.కృష్ణారెడ్డి, ఎన్‌వైఎస్ నాయకులు రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు సండే మార్కెట్ సెంటర్లో సిపిఐ (ఎమ్మెల్) నాయకత్వాన నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకులు జె. కిషోర్‌బాబు మాట్లాడుతూ, కరోనా, లాక్‌డౌన్ కారణంగా ఉపాధి కోల్పోయిన చిన్న వృత్తిదారులు, వ్యాపారులకు ఉపాధి సౌకర్యాలు కల్పించటానికి వారి కుటుంబాలకు నెలకు పదివేల రూపాయలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కరోనా బాధిత ప్రజలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గాలికి వదిలేశారని అందుకే ప్రజలు కృష్ణపట్నం ఆనందయ్య లాంటి వాళ్లు తయారుచేసే కరోనా మందుల కోసంఎగ పడుతున్నారని విమర్శించారు. ప్రజా పోరాటాల ద్వారానే పాలకుల మెడలు వంచగలుగుతామని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో స్త్రీవిముక్తి సంఘటన నాయకులు కొండమ్మ, కార్మిక సంఘం నాయకులు శరవణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు. ★

Janasakti (Communist Revolutionaries'Fortnightly) RNI No.8315/63 VJ-077/2019-21
No.of pages : 24 Date of publication : 3rd & 18th of Every Month Posting date : 5th & 20th of Every Month

# ‘కరోనా బాధిత ప్రజలను ఆదుకోవటానికి తక్షణ చర్యలు చేపట్టాలి’

## సిపిఐ(ఎంఎల్) కేంద్ర కమిటీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమాలలో డిమాండ్

**సిపిఐ(ఎంఎల్)** కేంద్ర కమిటీ మే 28వ తేదీన కరోనా బాధితుల ప్రజలను ఆదుకోవటానికి ప్రజలందరికీ ఉచిత వ్యాక్సిన్‌ను కేంద్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికపై అందించాలని, కరోనా వైద్యం పేరుతో కార్పొరేట్ హాస్పిటల్స్ చేస్తున్న నిలువుదోపిడి అరికట్టాలని, కర్ఫ్యూ, లాక్‌డౌన్‌తో పనులు కోల్పోయిన పేద, సామాన్య కుటుంబాలన్నింటికీ పదివేల రూపాయల ఆర్థిక సహాయం, ఉచిత రేషన్ అందించాలని తదితర డిమాండ్ల ప్రాతిపదికపై నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చింది. ఈ పిలుపునందుకొని వివిధ ప్రాంతాలలో కరోనా తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ పార్టీ కమిటీలు, రైతు, కూలీ, కార్మిక, ప్రజాసంఘాలు నిరసన కార్యక్రమాలను అమలు జరిపాయి.

విజయనగరం జిల్లా పార్వతీపురంలో రైతుకూలీసంఘం నాయకత్వాన ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రైతుకూలీసంఘం జిల్లా కార్యదర్శి డి.వర్మ మాట్లాడుతూ... కరోనా ఉపద్రవము నుంచి ప్రజలని కాపాడటంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, ప్రజల ఆరోగ్యాల కంటే కుంభమేళాలు నిర్వహించి ఎన్నికల ప్రయోజనాలు పొందాలని చూడటం విచారకరమని, కరోనా బాధిత కుటుంబాలకు తక్షణ సహాయక చర్యలను చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు ఊయక ముత్యాలు, శీనునాయుడు, బి.నర్సింగరావు, ఎం.భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో ఏ ఐ.ఎఫ్.టి.యు(న్యూ) నాయకత్వాన విజయనగరం అరుణ జూట్ మిల్ సెంటర్ వద్ద నిరసన కార్యక్రమాన్ని జరిపారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం రాష్ట్రనాయకులు బి.శంకర్‌రావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం రెండవ దశ కరోనా బీభత్సాన్ని ఎదుర్కోవడంలో పూర్తిగా విఫలమైందని, ఇప్పటికైనా కరోనా కారణంగా ఉపాధి కోల్పోయిన వివిధ రంగాలలో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులకు ఉచితంగా సహాయం అందించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు ఎం అప్పలరాజు, అరుణ జూట్ మిల్ కార్మిక నాయకులు పి.శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాష్, వై.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు. పార్టీ కేంద్ర కమిటీ ఇచ్చిన డిమాండ్లను ప్లే కార్డుల రూపంలో ప్రదర్శించి నినాదాలు చేశారు.

కృష్ణాజిల్లా నందిగామలో పార్టీ ఆఫీస్ వద్ద సిపిఐ (ఎం-ఎల్) నాయకత్వాన నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకులు ఎం.రాంబాబు మాట్లాడుతూ కరోనా నియంత్రణ చర్యలు అటు కేంద్ర ప్రభుత్వం ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు సకాలములో తీసుకోని ఫలితంగా కరోనా రెండవ దశ గ్రామాల్లో వేగంగా విస్తరించి ఎంతో మందిని బలి తీసుకుందని, ఇప్పటికైనా పాలకులు గ్రామాల్లో కరోనా పీడిత ప్రజలను ఆదుకునే చర్యలను యుద్ధ ప్రాతిపదికపై చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎలమందా రెడ్డి, వెంకటరెడ్డి, స్త్రీవిముక్తి సంఘటన కృష్ణా జిల్లా కార్యదర్శి ఎం కామేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలులో సిపిఐ (ఎం-ఎల్) నాయకత్వాన తరిమెల నాగిరెడ్డి భవనం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకులు డివిఎన్. స్వామి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర పాలకులు ఎన్నికలు, కుంభమేళాలు నిర్వహించి వ్యాధిని మరింత తీవ్రతరం చేశారని, కరోనా వ్యాధిని అరికట్టడంలో పాలకులు పూర్తిగా విఫలమైనందున ప్రజలు పిట్టల్లా రాలిపోయారని, ఈ మరణాలకు ప్రభుత్వాలే బాధ్యత వహించాలని, ఇప్పటికైనా యుద్ధప్రాతిపదికన కరోనా నివారణ చర్యలు, సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు ఎస్. లలితకుమారి, పరిటాల కోటేశ్వరరావు, కార్మిక సంఘం నాయకులు ఎమ్మెస్.సాయి, మహిళా సంఘం నాయకులు రేణుక తదితరులు పాల్గొన్నారు.

కావలి ఏరియా కలిగిరి మండలం క్రాకుటూరు గ్రామములో రైతు కూలీ సంఘం, స్త్రీ విముక్తి సంఘటనల నాయకత్వాన నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం-ఎల్) జిల్లా నాయకులు లక్ష్మిరెడ్డి, నవయువ సమాఖ్య జిల్లా కార్యవర్గ సభ్యులు మోహన్, రైతుకూలీ సంఘం సభ్యులు బి.మాల్యాద్రి, మహిళాసంఘం సభ్యులు చిన్నమ్మ మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు. కావలి మండలం రాముడుపాలెం గ్రామములో కూడా రెండు సంఘాల నాయకత్వాన నిరసన కార్యక్రమం జరిగింది. ఈ ఈ కార్యక్రమములో స్త్రీ విముక్తి సంఘటన జిల్లా నాయకులు ఎల్ శ్యామల, రైతుకూలీ సంఘం, మహిళా సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో కరోనా విస్తరించకుండా పాలకులు సమగ్ర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి పిలుపులో భాగంగా, తూర్పుగోదావరిజిల్లా దేవీపట్నం మండలం కొండమొదలు ఏరియాలో ఏజెన్సీ గిరిజన సంఘం (రైతుకూలీ సంఘం ఆంధ్రప్రదేశ్-అనుబంధం) నాయకత్వంలో మే 28, 29 తేదీలలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.

ఏజన్సీ ప్రాంతాలలో రోడ్, రవాణా సౌకర్యాలు లేనందున స్థానికంగా పంచాయితి స్థాయిలోనే క్వారైంటెన్ సెంటర్లు ఏర్పాటుచేసి, ఆక్సిజన్ ఏర్పాటుచేసి, ఇంటికే వెళ్ళి టెస్ట్‌లు చేసి, డాక్టర్ల పర్యవేక్షణలో వైద్యం అందించాలని వివిధ డిమాండ్స్‌ను ప్రభుత్వం ముందుంచారు.

ప్రజలు బయటకు వెళ్ళినప్పుడు ప్రతి ఒక్కరు మాస్క్ ధరించాలని, చేతులు సబ్బుతో కడుక్కోవాలని, దూరం దూరం పాటించాలని తదితర నినాదాలు, ప్లకార్డులు తయారుచేసి టీముగా కొండమొదలు, మెట్టగూడెం, కానివాడ, పెద్దగూడెం, కొక్కెరగూడెం, కొత్తగూడెం, కత్తనపల్లి, సోమర్లపాడు గ్రామాలలో ప్రదర్శనచేసి, ఆయా గ్రామాలలో ప్రజలతో సమావేశాలు నిర్వహించి జాగ్రత్తలు చెప్పారు.

ఈ కార్యక్రమాన్ని ఏజన్సీ గిరిజన సంఘం అధ్యక్షులు ఇల్లా రామిరెడ్డి సోమర్లపాడులో ప్రారంభించగా, సంఘం నాయకులు, కార్యకర్తలు వంజం జోగారావు, తాతా బుల్లబ్బాయి, వేట్ల శ్రీరాములు, చింతలాడ విజయ్‌రెడ్డి, సర్పంచ్ వేట్ల విజయ తదితర 20 మంది కామ్రేడ్స్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**(తరువాయి 23వ పేజీలో)**

Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010